Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్గా పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 239 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్, బుధవారం 24-09-2025 పేజీలు : 12 వెల : 2/-

# మేడారం కీర్తిని ప్రపంచానికి చాటుతాం

- గిరిజన కుంభమేళాపై కేంద్రం వివక్ష
- కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వినతి
- ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులు పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క సారలమ్మ
- సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పాటు
- 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించిన సిఎం



హైదరాబాద్: మేడారం జాతరను జాతీయ పండుగగా గుర్తించాలని కేంద్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. మంగళవారం ములుగు జిల్లా, తాడ్వాయి మండలం, మేడారంలో వన దేవతలను ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సమ్మక్క సారలమ్మ అమ్మవార్లకు 68 కేజీల నిలువెత్తు బంగారం సమర్పించారు. అనంతరం మేడారంలో గిరిజన సంక్షేమ శాఖ, దేవాదాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రులు, సీనియర్ అధికారులు, పూజారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి, విస్తరణకు సంబంధించిన ప్రణాళిక, డిజైన్లను పూజారులు, ఆదివాసీ సంఘాలకు అధికారులు వివరించారు. ఈ సమావేశంలో ఆలయ పూజారులు, ఆదివాసీ సంఘాల ప్రతినిధుల అభిప్రాయాలను సిఎం తెలుసుకున్నారు. ఆలయాన్ని విస్తరణ, అభివృద్ధిని ముక్తకంఠంతో పూజారులు, ఆదివాసీ సంఘాలు ఏకీభవించారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించి పలు అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి ఆదివాసీ సంఘాలు తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ..మేడారం వన దేవతల కీర్తిని ప్రపంచానికి చాటుతామని అన్నారు. ఆదివాసీలు ఈ దేశానికి మూలవాసులని, ఆదివాసీల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.మేడారంలో వంద రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. రాతి కట్టడాలతోనే నిర్మాణాలు ఉండాలని అధికారులకు సూచించాలని, ప్రపంచంలో ఎక్కడా లేనివిధంగా ప్రకృతి ఒడిలో ఉన్నట్టుగా సమ్మక్క సారలమ్మ ఆలయం ఉందని అన్నారు. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకునేలా నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు సిద్ధం చేశామని స్పష్టం చేశారు. ఆలయ అభివృద్ధిలో భాగస్వాములైన వారి జన్మ ధన్యమవుతుందని అన్నారు. ఇలాంటి అవకాశం ఈ జన్మకు దక్కిన వరం లాంటిది%ో%.ఆదాయం ఆశించి కాదు.. భక్తితో పనిచేయాలని సూచించారు. ఆదివాసీ పోరాట చరిత్రను, స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించేలా పనిచేయాలన్నారు.

జంపన్న వాగులో నీటి నిల్వ ఉండేలా సాగునీటిపారుదల శాఖ అధికారులు ప్రణాళికలు రూపొందించాలని, అవసరమైనచోట చెక్ డ్యామ్‌లు నిర్మించాలని, రాబోయే వంద రోజులు సమ్మక్క సారలమ్మ మాలధారణ చేసినట్లుగా నిష్ఠతో పనిచేయాలన్నారు. నిధులు గ్రీన్ చానల్‌లో విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. పనులు పూర్తి చేయించుకునే బాధ్యత మీపై ఉందన్నారు. ఆలయ అభివృద్ధికి ప్రత్యేకంగా ఒక డెడికేటెడ్ టీమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. రెండేళ్లకు ఒకసారి జరిగే మహా జాతరకు విచ్చేసే భక్తులకు మరింత సౌకర్యవంతంగా ప్రభుత్వ పక్షాన కల్పించాలనే ధ్యేయంతో, గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలను పరిగణనలోకి తీసుకుని సమ్మక్క సారమ్మల గద్దెల ప్రాంగణం పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను, విశ్వాసాలను పరిగణనలోకి తీసుకునే, వారిని భాగస్వాములను చేస్తూ ఆలయ అభివృద్ధి ఉంటుందని స్పష్టం చేశారు.అనంతరం జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మేడారం జాతర ప్రపంచంలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు

మిగతా 2లో



# కృష్ణా జలాల్లో వాటాపై రాజీలేని పోరాటం

- తెలంగాణకు చారిత్రక అన్యాయం ఇకపై కొనసాగదు
- కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ 2 ముందు వాదనలు
- తెలంగాణ హక్కులను తప్పకుండా దక్కించుకుంటాం
- మంత్రి ఉత్తమ్ నేతృత్వంలో కృష్ణా ట్రైబ్యునల్‌లో తుది వాదనలు

హైదరాబాద్ : కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ 2 ముందు తెలంగాణ వాదనలు వినిపిస్తోందని, మొత్తం 1050 టీఎంసీలలో దాదాపు 70 శాతం అంటే 763 టీఎంసీలను తెలంగాణకు కేటాయించాలని రాష్ట్ర ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సెప్టెంబర్ 23న ఢిల్లీలో మళ్లీ ప్రారంభమైన కృష్ణ ట్రైబ్యునల్ విచారణల అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కేసు చివరి దశకు చేరుకుందని, ఫిబ్రవరి నుండి తెలంగాణ తుది వాదనలు వినిపిస్తున్నదని ఉత్తమ్ చెప్పారు. ఈ విచారణలు సెక్షన్-3 రిఫరెన్స్ కింద జరుగుతున్నాయని, అన్ని పిటిషన్లు పూర్తయ్యాయని గత కొన్ని నెలలుగా సీనియర్ అడ్వకేట్ ఎస్.వైద్యనాథన్ తెలంగాణ తరఫున వాదనలు వినిపిస్తున్నారని, ఆయనకు మూడు

మిగతా 2లో



# భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను... ఐరాసలోనూ ట్రంప్ అదే మాట!

- ఐరాస సర్వసభ్య సమావేశంలో మరోసారి పాత వ్యాఖ్యల పునరుద్ఘాటన
- తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై అసంతృప్తి
- ఉక్రెయిన్ యుద్ధానికి భారత్, చైనాలు రష్యాకు నిధులు ఇస్తున్నాయని ఆరోపణ
- యుద్ధాలను ఆపడంలో ఐక్యరాజ్యసమితి విఫలమైందని తీవ్ర విమర్శ
- యూరప్ దేశాలు రష్యాపై ఆంక్షలు విధించకపోతే తీవ్ర

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తన పాత వాదనను పునరుద్ఘాటించారు. ఇటీవల భారత్, పాకిస్థాన్‌ల మధ్య తీవ్రస్థాయికి చేరిన ఘర్షణను తానే నివారించానని, తన వల్లే యుద్ధం ఆగిపోయిందని చెప్పుకొచ్చారు. ఐక్యరాజ్యసమితి (ఐరాస) సర్వసభ్య సమావేశంలో మంగళవారం ప్రసంగించిన ఆయన, ఈ ఘనత తనదేనని చెబుతూనే.. తనకు నోబెల్ శాంతి బహుమతి రాకపోవడంపై తన ఆవేదనను వెళ్లగక్కారు. ఐరాస ఉన్నతస్థాయి సమావేశంలో సుదీర్ఘంగా ప్రసంగించిన ట్రంప్, "నేను ఏడు యుద్ధాలను ముగించాను. అవన్నీ

మిగతా 2లో

# డాలర్‌తో పోలిస్తే 88.75కి పతనం

న్యూఢిల్లీ : అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరింత పడిపోయింది. మంగళవారం ట్రేడింగ్‌లో 47 పైసలు క్షీణించి 88.75కి చేరింది. రెండు వారాల క్రితం దాని ఆల్ టైమ్ కనిష్ట స్థాయి 88.46 కంటే దిగువకు పతనమైంది. ఆసియా మార్కెట్లలో డాలర్ స్వల్పంగా తగ్గిన నేపథ్యంలో ఈ క్షీణత సంభవించింది. ఆసియా కరెన్సీల బలహీనత, అమెరికా డాలర్ బలపడటం వల్ల రూపాయి విలువ తగ్గిందని నిపుణులు అంటున్నారు. దీనికి తోడు, అమెరికా సుంకాలు, హెచ్1బి వీసా ఫీజు పెంపు కారణంగా రూపాయి విలువ దెబ్బతింటోంది. 2025లో ఇప్పటివరకు రూపాయి 3.25 శాతం బలహీనపడింది. జనవరి 1న డాలర్‌తో పోలిస్తే 85.70 వద్ద ఉన్న రూపాయి ఇప్పుడు 88.49కి చేరుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్ ట్రంప్ కొత్త విధానాలు కూడా రూపాయిపై భారం వేస్తున్నాయని కరెన్సీ నిపుణులు అంటున్నారు.

# రెండు అమెరికా కంపెనీలకు భారత సంతతి సిఇఒల నియామకం





2లో

# బంగారం ఆల్ టైమ్ రికార్డు.. తులం రూ.1,18,900

- పది గ్రాముల పసిడి ధర రూ.1,18,900
- ఒక్క రోజే రూ.2,700 పెరిగిన రేటు
- కిలో వెండి రూ.3,220 పెరిగి రూ.1,39,600కి చేరిక



2



# పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది..

హైదరాబాద్ : స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి ఆధ్వర్యంలో మాజీ మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండాలని ఆయన బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా రెపరెపలాడించాలని

మిగతా 2లో

# 23 గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై 'సుప్రీం' స్టే



2

# మేడారం కీర్తిని ప్రపంచానికి చాటుతాం

పొందిందని, ఈ జాతర తెలంగాణ ప్రజల ఆత్మీయత, భక్తి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఆదివాసీలు దేశానికి మూలవాసులని, పోరాటానికి, పౌరుషానికి స్ఫూర్తి సమ్మక్క, సారలమ్మ తల్లులని అన్నారు. తాను ఎంఎల్ఎగా ఎన్నికైనప్పటి నుంచి అమ్మవార్లను సందర్శిస్తున్నా నని అన్నారు. 2023 ఫిబ్రవరి 6న ఈ గడ్డమీద నుంచే పాదయాత్ర మొదలుపెట్టానని, సమ్మక్క సారలమ్మ ఆశీర్వాదంతో ప్రజాప్రభుత్వం ఏర్పడిందని అన్నారు. సమ్మక్క సారలమ్మ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని ప్రభుత్వం సంకల్పించి, శాశ్వత ప్రాతిపదికన ఆలయాన్ని అభివృద్ధి చేయాలని నిర్ణయించామనివివరించారు. సంప్రదాయానికి గౌరవం ఇవ్వాలనే ఆలోచనతో మీ అభిప్రాయాలు తీసుకునేందుకు ఇక్కడికి వచ్చామని అన్నారు.సంప్రదాయంలో వీసమెత్తు కూడా తేడా రాకుండా ఉండాలనేదే తమ ప్రభుత్వ అభిమతం అన్నారు. ఇది డబ్బులతో కొలిచేది కాదు.. నమ్మకంతో కొలిచేదని, ఈ నమ్మకాన్ని మరింత పెంచేలా అభివృద్ధి ఉండాలన్నారు. మేడారం జాతర తెలంగాణ సాంస్కృతిక గొప్పతనాన్ని, గిరిజనుల పోరాట చరిత్రను ప్రతిబింబిస్తుందని, ఈ వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు అందేలా కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. మేడారంలో సమ్మక్క- సారలమ్మ గద్దెలు, ప్రాంగణ పునరుద్ధరణ పనుల డిజైన్లను విడుదల చేశారు. తెలంగాణ ప్రాంతంలో ములుగు జిల్లా అటవీ ప్రాంతంలో ఉన్న సమ్మక్క సారలమ్మ ప్రాంగణం కూడా ఒక గొప్ప దేవాలయమని, ఈ జాతరకు ఎన్నో ఏళ్ల చరిత్ర పోరాట ప్రతిమ రాచరికంపై తిరుగుబాటు జెండా ఎగరేసిన సమ్మక్క సారలమ్మ జాతరకు జాతీయ హోదా కల్పించాల్సిన అవసరం కేంద్ర ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ఆసియాలోని అతి పెద్ద గిరిజన జాతర తెలంగాణ కుంభమేళాగా అభివర్ణించే శ్రీ సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణాన్ని పునరుద్ధరించడం కోసం స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. గద్దెల పునరుద్ధరణలో భాగంగా భక్తుల విశ్వాసం, నమ్మకం, ఆదివాసీల ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా జాతర ప్రాశస్త్యం అనేక శతాబ్దాలు గుర్తిండిపోయేలా ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. వనదేవతల ప్రాంగణాన్ని పూర్తిగా గ్రానైట్ రాయి తో నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. సమ్మక్క సారలమ్మ చరిత్ర 13వ శతాబ్దంలో మొదలైందని మరో వెయ్యి సంవత్సరాలు జాతర వైభోగం, ఆదివాసి సాంప్రదాయాలు, గుర్తుండేలా అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. గతంలో సమ్మక్క సారలమ్మ మహా జాతరను అధికారికంగా నిర్వహించే అవకాశం ఇవ్వాలని కోరామని, అదే మాదిరిగా తన కోరికను తీరుస్తూ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగి జాతరను అధికారికంగా నిర్వహించడం చాలా సంతోషకరంగా ఉందని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన అనంతరమే మేడారం ప్రాంతాన్ని అభివృద్ధి పరచాలని స్వయంగా ముఖ్యమంత్రితో చర్చించామని, అదే మాదిరిగా ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారని, కనుక వెంటనే అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారని పేర్కొన్నారు. సమ్మక్క సారలమ్మ ఆశీసుల ద్వారా సకల జనులు బాగుంటారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తల్లుల ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని తెలిపారు. వెయ్యేళ్ళ పాటు పటిష్టమైన రీతిలో ఉండేలా నిర్మాణం ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. గద్దెల విస్తరణ విషయంలో అనేక అపోహాలు ఉన్న నేపథ్యంలో నిర్మాణం ఏ విధంగా జరగాలని, ఆచార సాంప్రదాయాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా చూడడం కోసం స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇక్కడికి రావడం అనేది చాలా సంతోషంగా ఉందని తల్లుల ఆశీర్వాదంతో ప్రజా ప్రభుత్వం వర్ధిల్లాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎసిలు పింగిలి శ్రీపాల్ రెడ్డి, బస్వరాజు సారయ్య, ఎంఎల్ఎలు తెల్లం వెంకట్రావు, బాలు నాయక్, కడియం శ్రీహరి, డా. మురళీనాయక్, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాయని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణరావు, కోరం కనకయ్య, జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మా బొజ్జు, సమ్మక్క సారలమ్మ పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు,ముందు ములుగు జిల్లా, ఎస్ఎస్ తాడ్వాయి మండలం, మేడారంనకు హెలికాప్టర్ లో 12 గంటల 27 నిముషాలకు చేరుకున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి , కొండా సురేఖ, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిలకు మంత్రులు దనసరి అనసూయ సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, మహబూబాబాద్, వరంగల్ పార్లమెంటు సభ్యులు పోరిక బాలరాం నాయక్, డాక్టర్ కడియం కావ్య, ఎంఎల్‌సిలు, శాసనసభ్యులు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఎస్పి డాక్టర్ శబరీష్ పుష్పగుచ్చాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. హెలిపాడ్ నుండి కమాండ్ కంట్రోల్ రూం ప్రాంగణంలో ముఖ్యమంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. గిరిజన కొమ్ము కోయనృత్యంతో, గిరిజన సంప్రదాయం ప్రకారం గద్దెల వద్దకు సిఎంకు ఘన స్వాగతం పలికారు.

# కృష్ణా జలాల్లో వాటాపై రాజీలేని పోరాటం

తెలంగాణకు జరిగిన చారిత్రక అన్యాయాన్ని సరిదిద్దే విధంగా కృషి చేస్తామని స్పష్టం చేశారు. గత కేటాయింపులను వివరించిన ఉత్తమ్ కృష్ణా జలాల వివాదాల ట్రైబ్యునల్ అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1005టీఎంసీలు కేటాయించిందని గుర్తు చేశారు. వీటిలో 811 టీఎంసీలు 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా, 49 టీఎంసీలు 65శాతం డిపెండబిలిటీ ఆధారంగా, 145 టీఎంసీలు సగటు ప్రవాహాల ఆధారంగా కేటాయించబడ్డాయని వివరించారు. అదనంగా గోదావరి డైవర్షన్ ద్వారా 45 టీఎంసీలు ఇచ్చారని, మొత్తంగా 1050 టీఎంసీలు కేటాయించబడ్డాయని అన్నారు. సగటు ప్రవాహాల కంటే ఎక్కువగా వచ్చే నీటిని వినియోగించుకోవచ్చని కూడా స్వేచ్ఛ ఇచ్చారని, 2014 లో తెలంగాణ వేరుగా ఏర్పడిన తర్వాత ఇప్పుడు కొత్తగా బేసిన్ పారామీటర్ల ఆధారంగా వాటాను కోరుతోందని ఉత్తమ్ తెలిపారు. తెలంగాణ డిమాండ్ శాస్త్రీయమైనదని, అంతర్జాతీయంగా అంగీకరించబడిన పారామీటర్ల మీద ఆధారపడి ఉందని పేర్కొన్నారు. క్యాచ్‌మెంట్ ఏరియా, బేసిన్‌లోని జనాభా, కరవు ప్రాంతం విస్తీర్ణం, సాగు భూములు వంటి అంశాల ఆధారంగా లెక్కలు వేసి 75శాతం డిపెండబుల్ వాటర్‌లో 555 టీఎంసీలు, 65 శాతం డిపెండబుల్ వాటర్‌లో 43 టీఎంసీలు, సగటు ప్రవాహాల నుండి 120 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ నుండి మొత్తం 45 టీఎంసీలు తెలంగాణకు రావాలని కోరుతున్నారు. మొత్తంగా ఇది 763 టీఎంసీలుగా అవుతుంది. సగటు ప్రవాహాలపై మిగిలిన అదనపు నీటిని వినియోగించే స్వేచ్ఛ కూడా తెలంగాణదేనని ఆయన స్పష్టం చేశారు.ఆంధ్రప్రదేశ్ ఇలాంటివి ఆపాలి : ఆంధ్రప్రదేశ్ తనకు కేటాయించబడిన 811 టీఎంసీల్లో పెద్ద భాగాన్ని బేసిన్ వెలుపలికి మళ్లించిందని ఆయన విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ ఇలాంటివి ఆపాలని, బదులుగా ప్రత్యామ్నాయ వనరులను వినియోగించాలని ట్రైబ్యునల్ ముందు తెలంగాణ విన్నవించుకుందన్నారు. అలా మిగిలిన నీటిని ప్రాంతాల్లో వాడుకోవాలని కోరారు. సగటు ప్రవాహాలపై మిగిలిన మొత్తం నీటిని వినియోగించే హక్కు తెలంగాణకే ఉందని, దీన్ని ట్రైబ్యునల్ ముందు బలంగా వాదిస్తామని అన్నారు. ఇది కేవలం ఒక డిమాండ్ మాత్రమే కాకుండా, దశాబ్దాలుగా తెలంగాణకు జరిగిన అన్యాయాన్ని సరిచేసే చర్య అని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం 299 టీఎంసీలను తెలంగాణకే కేటాయిస్తూ, 512 టీఎంసీలను ఆంధ్రప్రదేశ్‌కు ఇచ్చిన ఒప్పందానికి అంగీకరించడం రైతులకూ, కరవు ప్రాంతాలకూ మోసం చేశారని ఉత్తమ్ అన్నారు. దాదాపు పది సంవత్సరాల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ ఒప్పందాన్ని అంగీకరించిందని, అందుకే ఇప్పుడు ఆ ఫైలును మళ్లీ తెరిచి మొదటి నుంచి వాదనలు వినిపిస్తున్నామని చెప్పారు. 299 టీఎంసీలు అంగీకరించిన గత ఒప్పందం, తాము కోరుతున్న 763 టీఎంసీల మధ్య వ్యత్యాసమే ఈ అన్యాయానికి నిదర్శనమని అన్నారు. జలశక్తి మంత్రిత్వశాఖలో కూడా ఆ ఒప్పందం నమోదైనప్పటికీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారికంగా తిరస్కరించిందని చెప్పారు.ఏ పార్టీ అధికారంలో ఉన్నా రాజీపడం : పొరుగు రాష్ట్రాల్లో ఏ పార్టీ అధికారంలో ఉన్నా తెలంగాణ రాజీపడబోదని అన్నారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఉన్నా, ఆంధ్రప్రదేశ్‌లో టిడిపి ఉన్నా, మహారాష్ట్రలో బిజెపి ఉన్నా, తెలంగాణ తన హక్కుల కోసం కఠినంగా పోరాడుతుంది. ఒక్క చుక్క నీళ్లను కూడా వదులుకోదు, అని ధీమా వ్యక్తం చేశారు. అల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచే కర్ణాటక యోచనను ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. అలాంటి నిర్ణయం తెలంగాణకు నేరుగా నష్టం చేస్తుందని హెచ్చరించారు. దీనిని అడ్డుకోవడానికి సుప్రీంకోర్టులో బలమైన వాదనలు వినిపిస్తామని అన్నారు. మా ప్రభుత్వ అభిప్రాయం చాలా స్పష్టంగా ఉంది. తెలంగాణ వాటా తగ్గించే చర్య ఏదీ అనుమతించమని చెప్పారు. అల్మట్టి ఎత్తు పెంపు అనుమతించకుండా సుప్రీంకోర్టులో పోరాడతామని స్పష్టం చేశారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాన్ని అత్యంత సీరియస్‌గా తీసుకున్నదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ కేసుపై సమీక్ష సమావేశం నిర్వహించి పూర్తి స్థాయి వాదనలు వినిపించాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారని ఉత్తమ్ తెలిపారు.ఇది కేవలం న్యాయ పోరాటం మాత్రమే కాదని రైతుల జీవనాధారానికి, కరవు ప్రాంతాల భవిష్యత్తుకు సంబంధించినదన్నారు. ట్రైబ్యునల్ న్యాయమూర్తి బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని విచారణలో తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మేము మా వాదనలను అన్ని ఆధారాలతో సమర్పించామని వివరించారు. ఈ సారి తెలంగాణకు న్యాయం జరుగుతుందనే నమ్మకం ఉందని ఉత్తమ్ అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ ప్రభుత్వం వెనక్కి తగ్గదని ప్రజలకు హామీ ఇచ్చారు. డిపెండబుల్ ఫ్లోస్ అయినా, సగటు ప్రవాహాలైనా, అదనపు నీరైనా, గోదావరి డైవర్షన్లు అయినా -తెలంగాణల తన హక్కు కోసం పోరాడుతుందని పునరుద్ఘాటించారు. చారిత్రక అన్యాయం ఇకపై కొనసాగదని, తెలంగాణ తన హక్కు దక్కించుకుంటుందని ఉత్తమ్ స్పష్టం చేశారు.

## రెండు అమెరికా కంపెనీలకు

# భారత సంతతి సిఇఒల నియామకం

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్1బి వీసా నియమాలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలో అక్కడి కంపెనీలు మాత్రం సిఇఒ స్థానాలకు భారతీయుల వైపే మొగ్గుచూపుతున్నాయి. తాజాగా అమెరికాలోని రెండు పెద్ద కంపెనీలు భారత సంతతికి చెందిన సిఇఒ (చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్)లను నియమించాయి. దీనిలో మొదటి కంపెనీ అమెరికా టెలికాం దిగ్గజం టిమొబైల్, ఈ కంపెనీకి నవంబర్ 1 నుండి 55 ఏళ్ళ శ్రీనివాస్ శ్రీని గోపాలన్ సిఇఒగా బాధ్యతలు చేపట్టనున్నారు. రెండో కంపెనీ చికాగో కేంద్రంగా ఉన్న బేవరేజ్ దిగ్గజం మోల్సన్ కూర్స్, దీనికి రాహుల్ గోయల్ (49) అక్టోబర్ 1 నుండి కొత్త సిఇఒగా బాధ్యతలు స్వీకరించనున్నారు.ఐఐఎం అహ్మదాబాద్ అలుమ్నస్ గోపాలన్, ప్రస్తుతం టిమొబైల్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. 2020 నుండి కంపెనీని నడిపించిన మైక్ సీవర్ట్, కొత్తగా రూపొందించిన వైస్ చైర్మన్ స్థానంలోకి మారుతున్నారు. టిమొబైల్ తదుపరి సిఇఒగా బాధ్యతలు చేపట్టడం గౌరవంగా భావిస్తున్నానని గోపాలన్ లింక్డ్ఇన్‌లో ప్రకటించారు. వినియోగదారులకు కొత్త రీతిలో సేవలందించడానికి సాహసోపేత మార్పులు చేయడం తనకెంతో ఇష్టమైందని అన్నారు. గోపాలన్ వృత్తి జీవితంలో అనేక దేశాలు, రంగాలలో పనిచేసిన అనుభవం ఉంది. హిందుస్తాన్ యూనిలివర్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా ప్రారంభించి, భారతి ఎయిర్‌టెల్, వోడాఫోన్, కాపిటల్ వన్, డాయ్చ్ టెలికాం వంటి కంపెనీల్లో సీనియర్ పాత్రలు నిర్వహించారు. జర్మనీలో మొబైల్ మార్కెట్ షేర్ రికార్డు సాధించి, ఫైబర్ నెట్‌వర్క్‌ను కోట్ల హోమ్‌లకు విస్తరించారు. టిమొబైల్‌లో 5జి, ఎఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ కార్యక్రమాలను నడిపించారు. ఈ సందర్భంగా సీవర్ట్ మాట్లాడుతూ.. గోపాలన్‌ను అత్యంత నై పుణ్యవంతుడు, అద్భుత అవగాహనతో ఉన్న వ్యక్తి అని పేర్కొన్నారు.అమెరికాలో బేవరేజ్ దిగ్గజం మోల్సన్ కూర్స్ రాహుల్ గోయల్‌ను అక్టోబర్ 1 నుండి నూతన అధ్యక్షుడు, సిఇఒగా నియమించింది. 49 ఏళ్ళ గోయల్, గేవిన్ హాటర్స్‌లే స్థానంలో బాధ్యతలు చేపడుతున్నారు. భారతీయుడైన గోయల్ మైసూర్‌లో ఇంజనీరింగ్ చదివి, డెన్వర్‌లో బిజినెస్ స్టడీస్ కోసం అమెరికాకు వెళ్లారు. గోయల్‌కు అమెరికా, బ్రిటన్, భారత్‌లో కూర్స్, మోల్సన్ బ్రాండ్లలో అనుభవం ఉంది. మోల్సన్ కూర్స్ బోర్డు చైర్మన్ డేవిడ్ కూర్స్ మాట్లాడుతూ, సిఇఒ వారసత్వ ప్రక్రియ తర్వాత రాహుల్ సరైన అనుభవం, విజన్ సంస్థ తదుపరి వృద్ధికి దోహదం చేస్తుందని స్పష్టమైందని అన్నారు.

## భారత్-పాక్ యుద్ధాన్ని నేనే ఆపాను... ఐరాసలోనూ ట్రంప్ అదే మాట!

తీవ్రంగా కొనసాగుతున్నవే! వేలాది మంది ప్రాణాలు కోల్పోతున్న సమయంలో నేను జోక్యం చేసుకున్నాను" అని తెలిపారు. "అందులో భారత్, పాకిస్థాన్ మధ్య జరిగిన భీకర యుద్ధం కూడా ఉంది" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ట్రంప్ వాదనను భారత్ ఇప్పటికే పలుమార్లు ఖండించింది. ఈ విషయంలో ట్రంప్ జోక్యం ఏమీ లేదని, ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారుల మధ్య జరిగిన చర్చల ద్వారానే సమస్య పరిష్కారమైందని ప్రధాని నరేంద్ర మోదీ గతంలోనే జూన్‌లో జరిగిన ఫోన్ సంభాషణలో ట్రంప్‌కు స్పష్టం చేశారు. పాకిస్థాన్ డీజీఎంఓ మేజర్ జనరల్ కాషిఫ్ అబ్దుల్లా, భారత డీజీఎంఓ లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘయ్‌కు ఫోన్ చేసి కాల్పుల విరమణకు అంగీకరించారని భారత వర్గాలు వెల్లడించాయి. ఇదే సమావేశంలో ట్రంప్.. భారత్, చైనాలపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగించేందుకు ఈ రెండు దేశాలు రష్యాకు ఆర్థిక సహాయం అందిస్తున్నాయని విమర్శించారు. మరోవైపు, రష్యా నుంచి ఇంధనాన్ని కొనుగోలు చేస్తున్న నాటో మిత్రదేశాలు, యూరోపియన్ యూనియన్‌పైనా ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. "రష్యా యుద్ధాన్ని ఆపేందుకు సిద్ధపడకపోతే, అమెరికా శక్తిమంతమైన సుంకాలను విధించడానికి సిద్ధంగా ఉంది. ఈ సుంకాలు ప్రభావవంతంగా ఉండాలంటే యూరప్ దేశాలు కూడా మాతో కలవాలి" అని ఆయన హెచ్చరించారు.ప్రపంచంలో శాంతిని కాపాడటంలో ఐక్యరాజ్యసమితి పూర్తిగా విఫలమైందని ట్రంప్ దుయ్యబట్టారు. "ఈ పనులన్నీ ఐరాస చేయాల్సింది, కానీ నేనే చేయాల్సి వచ్చింది. విచారకరమైన విషయం ఏంటంటే, ఈ సందర్భాల్లో ఐరాస కనీసం సాయం చేసే ప్రయత్నం కూడా చేయలేదు" అని ఆయన విమర్శించారు. తన ప్రసంగం మధ్యలో టెలిప్రాంప్టర్ ఆగిపోయినా, ట్రంప్ తన ప్రసంగాన్ని ఆపకుండా కొనసాగించడం గమనార్హం.

# పార్టీ కోసం పని చేసిన వారికి గుర్తింపు లభిస్తుంది.. ఎన్నికలకు సిద్ధంగా ఉండండి: హరీశ్ రావు

సూచించారు.ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన దొంగ హామీలను గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 420 హామీలను గ్రామాల్లో గడపగడపకూ వివరించాలని హరీశ్ రావు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసినందుకు ఎంతలా ఇబ్బంది పడుతున్నారో ప్రజలకు వివరించాలని సూచించారు.నెలల తరబడి రేషన్ కమీషన్ చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్ల జీవితాలతో చెలగాటం ఆడటం దుర్మార్గం అని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు మండిపడ్డారు. పేదలకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తూ, వారి ఆకలి తీర్చుతున్న రేషన్‌డీలర్లకు.. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాల తీరుతో పస్తులుండే పరిస్థితి రావడం శోచనీయం అని ఆవేదన వ్యక్తం చేశారు. రేషన్ బియ్యం పంపిణీకి సంబంధించిన కమీషన్ అందక వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ఈ ప్రభుత్వం మొద్దు నిద్ర నటిస్తుండటం దారుణమని అన్నారు. రేషన్ డీలర్లు మంగళవారం నగరంలోని తన నివాసంలో హరీష్‌రావును కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ, అభయహస్తం పేరిట విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోలో రేషన్ డీలర్లకు 5 వేల గౌరవ వేతనంతో పాటు కమీషన్ పెంపు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు.అధికారంలోకి వచ్చి 22 నెలలు అవుతున్నా ఇప్పటికీ అతీగతీ లేదని, ఎన్నికల ముందు అబద్దపు హామీలతో నమ్మించి, ఇప్పుడు నట్టేట ముంచారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాటలు తప్ప చేతలులేని కోతల ప్రభుత్వం ఇది అని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సచివాలయానికి రేషన్ డీలర్లను ఆహ్వానించి వారి సమస్యలను విని పరిష్కరించామని గుర్తు చేశారు. మెట్రిక్ టన్నుకు ఇచ్చే కమీషన్‌ను 900 నుంచి 1400 రూపాయలకు పెంచామని, ప్రభుత్వంపై 139 కోట్ల అదనపు భారం పడుతున్నా రేషన్ డీలర్ల సంతోషం కోసం కెసిఆర్ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. 2014లో మెట్రిక్ టన్నుకు 200 రూపాయలుగా ఉన్న కమీషన్‌ను, 1400 రూపాయలకు పెంచామని, 17వేలకు పైగా ఉన్న రేషన్ డీలర్ల ముఖాల్లో చిరునవ్వులు నింపామని అన్నారు. కమీషన్ చెల్లించడమే కాదు, కరోనా సమయంలో సేవలందిస్తూ మరణించిన 100 మంది డీలర్ల వారసులకు కారుణ్య నియామకం కింద డీలర్‌షిప్ మంజూరు చేశామని చెప్పారు.రేషన్ డీలర్‌షిప్ వయో పరిమితిని 40 నుంచి 50 ఏళ్లకు పెంచామని అన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీని సైతం అమలు చేయకుండా రేషన్ డీలర్ల పాలిట శకునిలా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. రేషన్ డీలర్లకు బతుకమ్మ, దసరా, దీపావళి పండుగల సంబురాన్ని లేకుండా చేస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దుర్మార్గ వైఖరిని హరీష్‌రావు తీవ్రంగా ఖండించారు. ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ కమీషన్,చెల్లించాల్సిన వెంటనే విడుదల చేయాలని కోరారు

## బంగారం ఆల్ టైమ్ రికార్డు..

## తులం రూ.1,18,900

న్యూఢిల్లీ : బంగారం, వెండి ధరలు రోజు రోజుకీ పరుగులు పెడుతూనే ఉ న్నాయి. దేశ రాజధాని ఢిల్లీలో మం గళవారం 10 గ్రాముల పసిడి ధర ఏకంగా రూ.2700 పెరిగి రూ. 1,18,900కు చేరుకుంది. సురక్షితమైన ఆస్తిగా ప్రపంచ వ్యాప్తంగా డిమాండ్ పెరగడం, అమెరికా హెచ్1బి వీసా పెంపు నేపథ్యంలో రూపాయి విలువ భారీగా పడిపోవ డం వంటివి బంగారం ధర పెరుగుదలకు కారణవుతున్నాయి. ఆల్ ఇండి యా సరఫ అసోసియేషన్ ప్రకారం, క్రితం రోజు 99.9 శాతం స్వచ్ఛత బంగారం ధర రూ.1,16,200 (10 గ్రాములు) వద్ద ముగిసింది. స్థానిక బులియన్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత పసిడి రికార్డు స్థాయిలో రూ. 1,18,300 (10 గ్రాములు)కు చేరింది.ఇది సోమవారం రూ.1,15,650 ధరతో పోలిస్తే రూ.2,650 వద్ద ముగిసింది. ట్రేడర్ల ప్రకారం, డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ గణనీయంగా పడిపోయింది. ఈ సంవత్సరంలో ఇప్పటి వరకు 10 గ్రాముల బంగారం ధర దాదాపు రూ.39,950 (50.60 శాతం) పెరిగింది. 2024 డిసెంబర్ 31న పసిడి ధర రూ.78,950 వద్ద ఉంది. ఇక వెండి కూడా బంగారం బాటలోనే పయనిస్తోంది. మంగళవారం కిలో వెండి ధర రూ.3,220 పెరిగి రూ.1,39,600 కు చేరుకుంది. సోమవారం రోజు ఇది రూ.1,36,380 వద్ద ఉంది.

## 23 గ్రామాల్లో ఎన్నికల నిర్వహణపై 'సుప్రీం' స్టే

తెలంగాణలోని ములుగు జిల్లా మంగపేట మండలంలో స్థానిక సంస్థల ఎన్నికలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల నిర్వహణపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గ్రామాలను గిరిజన గ్రామా లుగా పేర్కొంటూ గతంలో హైకోర్టు ప్రకటించగా, ఆయా గ్రామాల గిరిజనేతరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. మంగపేట మండలంలోని 23 గ్రామాలు గిరిజన పరిధిలో లేవని 1950లో రాష్ట్రపతి ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిపై 2013లో గిరిజన సంఘాలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేయగా, నిజాం ఆర్డర్ ఆధారంగా గిరిజన గ్రామాలుగా పరిగణించాలని తీర్పు ఇచ్చింది.రాష్ట్రపతి ఉత్తర్వులను పక్కనపెట్టి నిజాం ఇచ్చిన ఆదేశాలను పరిగణనలోకి తీసుకోవడంపై స్థానికులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ గ్రామాలను గిరిజన గ్రామాలుగా పరిగణించవద్దని ఆ పిటిషన్‌లో పేర్కొన్నారు. 1950లో రాష్ట్రపతి ఇచ్చిన ఉత్తర్వుల్లో మంగపేట మండలంలో 23 గ్రామాలు లేవని గిరిజనేతరుల తరపు న్యాయవాది కోర్టులో వాదనలు వినిపించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమవుతున్న తరుణంలో స్టే ఇవ్వాలని కోరారు. దీంతో ప్రతివాదులకు నోటీసులు జారీ చేసిన జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ విజయ్ బిష్ణోయ్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. మంగపేట మండల పరిధిలోని 23 గ్రామాల్లో స్థానిక ఎన్నికల పైనా స్టే ఇస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది

## తాల్ హెల్త్‌ఫెస్ట్ 2025'కు కెటిఆర్‌కు ఆహ్వానం



భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావుకు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో జరగనున్న ప్రతిష్టాత్మక 'తాల్ హాస్పిటల్స్ హెల్త్‌ఫెస్ట్ 2025' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ మంగళవారం ఒయు మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ రవీందర్ యాదవ్‌తో కలిసి తాల్ హాస్పిటల్స్ సిఇఒ సాయి గుండవెల్లి నగరంలో కెటిఆర్‌కు కలిసి ఆహ్వానించారు. 2025 అక్టోబర్ 24న కాలిఫోర్నియాలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాన్ డియాగో (యుసిఎస్‌డి)లో ఈ 'హెల్త్‌ఫెస్ట్ 2025' నిర్వహించనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య నిపుణులు, విధాన నిర్ణేతలు, ఆవిష్కర్తలు, మార్పు తీసుకొచ్చేవారిని ఒకే వేదికపైకి తీసుకువచ్చి, భవిష్యత్ ఆరోగ్య సంరక్షణపై చర్చించడమే ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం.

ఈ సదస్సులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఎఐ),వ్యక్తిగత వైద్యం, డిజిటల్ హెల్త్‌కేర్ ఆవిష్కరణలు, సమీకృత వైద్య సంరక్షణ, ప్రపంచవ్యాప్తంగా మెరుగైన ఆరోగ్య సేవలకు మార్గాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చిస్తారు. ఈ అంతర్జాతీయ కార్యక్రమంలో కెటిఆర్ కీలకోపన్యాసం చేయనున్నారు. తెలంగాణలో టెక్నాలజీ ఆధారిత పాలన, ఆవిష్కరణలతో కూడిన అభివృద్ధి, ఆరోగ్య రంగంలో తీసుకువచ్చిన విధానాలు ప్రపంచ ప్రజలకు ఎంతో విలువైనవిగా ఉంటాయని నిర్వాహకులు పేర్కొన్నారు.తమ ఆహ్వానాన్ని కెటిఆర్ అంగీకరించినందుకు టచ్-ఎ-లైఫ్ ఫౌండేషన్ ధన్యవాదాలు తెలిపింది. హెల్త్‌ఫెస్ట్ 2025లో ఆయన భాగస్వామ్యం ఈ వేదికపై అర్థవంతమైన చర్చలకు దోహదపడుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## కోల్‌కతాలో భారీ వర్షాలు.. ఐదుగురు మృతి



కోల్‌కతా: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు కోల్‌కతాను ముంచెత్తాయి. వరదల కారణంగా ఉత్తర కోల్‌కతా లోని పలు ప్రాంతాలు నీట మునిగాయి. ప్రధాన రహదారులు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ షాక్ వల్ల ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, వరదల్లో కొట్టుకు పోయి మరో ఇద్దరు మరణించారు. ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయువ్య దిశగా కదిలే అవకాశం ఉన్నందున దక్షిణ బెంగాల్ లోని పలు జిల్లాల్లో రానున్న కొన్ని గంటల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వానల వల్ల పలు విమానాల రాకపోకలకు అంతరాయం కలిగినట్టు విమానయాన సంస్థలు వెల్లడించాయి.అటు ఎయిరిండియా, ఇండిగో ప్రయాణికులకు అలర్ట్‌లు పంపించాయి. తాజా అప్‌డేట్‌లను ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని సూచించాయి. భారీ వర్షాలకు అనేక ప్రాంతాలు నీట మునిగాయి. ఈదురుగాలులకు చాలా ప్రాంతాల్లో చెట్లు కూలిపోయాయి. కొన్ని భవనాలు ధ్వంసమయ్యాయి. దీంతో ప్రజులు సాధ్యమైనంతవరకు ఇళ్లలోనే ఉండాలని , అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని అధికారులు సూచించారు. భారీ వరదల వల్ల షాహిద్ ఖుదిరామ్, మైదాన్ స్టేషన్ల మధ్య పలు రైల్వే కార్యకలాపాలను నిలిపివేసినట్టు అధికారులు పేర్కొన్నారు.ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకర స్థాయిలో ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. ఉత్తరాఖండ్ , హిమాచల్ ప్రదేశ్‌లో కొండచరియలు విరిగి పడుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ సూచించింది. వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. పంజాబ్, హర్యానా, చండీగఢ్‌ల్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. పఠాన్‌కోట్, గుర్‌దాస్‌పుర్, ఫాజిల్కా, కపుర్థలా , తరన్‌తరన్, ఫిరోజ్‌పుర్, హోశియార్‌పుర్, అమృత్‌సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

సత్యమేవ జయతే
బుధవారం 24 సెప్టెంబర్ 2025

## వికారాబాద్ పి ఆర్ టి యు మండల అధ్యక్షుడిగా సి శ్రీనివాస్..







సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.. వికారాబాద్ మండలం పి ఆర్ టీ యు నూతన అధ్యక్షులుగా సి శ్రీనివాస్ ఎన్నిక చేశారు. వికారాబాద్ జిల్లా కేంద్రం లో జరిగిన సమావేశం లో జిల్లా అధ్యక్షులు కడియాల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. సి. శ్రీనివాస్ మాట్లాడుతూ నా మీద ఉన్న నమ్మకం తొ పదవి కట్టబెట్టినందుకు జిల్లా అధ్యక్షులు వారికి ధన్యవాదలు తెలిపారు శ్రీనివాస్ ను మండల ఉపాధ్యాయులు కలిసి సన్మానం చేశారు. గిరిగిట్ పల్లి గ్రామ ప్రజలు శ్రీనివాస్ ను అభినందించారు...

## జూరాలకు భారీగా వరద.. 42 గేట్లు ఎత్తివేత



సత్యమేవ జయతే – జోగులాంబ గద్వాల్ జోగులాంబ గద్వాల్ : జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద వస్తున్నది. ఎగువన వర్షాలు, జలాశయాల నుంచి నీటిని విడుదల చేయడంతో జూరాలకు 3.42 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. దీంతో అధికారులు 42 గేట్లు ఎత్తి 3.16 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లు. గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు. ప్రస్తుతం 8.790 టీఎంసీలు ఉన్నది.
ఇక శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద కొనసాగుతున్నది. ప్రాజెక్టుకు 3లక్షల57 వేల 333 క్యూసెక్కుల వరద వస్తున్నది. దీంతో అధికారులు 10 గేట్లను 5 అడుగుల మేర, 16 గేట్లను 10 అగుడుల మేర ఎత్తి అతే మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ, కుడి విద్యుత్ ప్లాంట్లలో కరెంటు ఉత్పత్తి కొనసాగుతున్నది. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా ప్రస్తుతం 586.70 అడుగులు ఉన్నది. ప్రాజెక్టులో మొత్తం 312 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 303.94 టీఎంసీలు నిల్వ ఉన్నాయి.

## మానుకోట రాళ్ల ఘటన తెలంగాణ తెగింపుకు ఒక నిదర్శనం






సత్యమేవ జయతే – హైదరాబాద్ హైదరాబాద్ : మానుకోట రాళ్ళ ఘటన తెలంగాణ తెగింపుకు ఒక నిదర్శనం.. ఈ గడ్డపై నుండి మొదలైన ఏ ఉద్యమం ఓడిపోలేదు అని బీఆర్ఎస్ సీనియర్ లీడర్ ఏనుగుల రాకేశ్ రెడ్డి గుర్తు చేశారు. మానుకోట పట్టణంలో మానుకోట నిరుద్యోగ జేఏసీ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ర్యాలీలో రాకేశ్ రెడ్డితో పాటు పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు, విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థులు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.
ఈ సందర్భంగా తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన యూత్ డిక్లరేషన్, నిరుద్యోగ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేయడం జరిగింది. అనంతరం రాకేశ్ రెడ్డి మీడియాతో మాట్లాడారు.
మానుకోట ఒక ఉద్యమాల గడ్డ, తెలంగాణ ఉద్యమ సమయంలో ఇక్కడి యువత, సామాన్య ప్రజలు చూపిన తెగువ ఎంతో స్ఫూర్తిని రగిల్చింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని గ్రామీణ ప్రాంతంలో మొదలైన ఈ ఉద్యమం యావత్ తెలంగాణ యువతను కదిలించడం ఖాయం అని రాకేశ్ రెడ్డి అన్నారు.
– నిరుద్యోగ యువత డిమాండ్స్ ఇవే..
1. యూత్ డిక్లరేషన్‌ను తక్షణమే అమలు చేయాలి.
2. 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలి.
3. కానిస్టేబుల్ ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల చేయాలి.
4. డీఎస్సీ పోస్టులు వేయాలని, స్పోర్ట్స్ కోటాలో జరిగిన అవినీతిపై విచారణ జరపాలి.
5. గురుకుల పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయాలి.
6. గ్రూప్ ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వాలి.
7. జీవో 46 రద్దు చేయాలి.
8. గ్రూప్ -1 బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేయడం జరిగింది.

# సేవాలాల్ మహారాజ్ రాంరావు మహారాజ్ భవాని మాత ,మాజీమంత్రి మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన బంజారా సోదరులు







సత్య మేవ జయతేనారాయణ ఖేడ్
నారాయణఖేడ్ పట్టణంలోని సేవాలాల్ భవానీ మాత మందిరం ఆవరణంలో సేవాలాల్ మహారాజ్ రాంరావు మహారాజ్ భవాని మాత మరియు మాజీ మంత్రి హరీష్ రావు మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ గారి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించిన బంజారా సోదరులు.వారు మాట్లాడుతూ..
గత టిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు మాజీ మంత్రి హరీష్ రావు గారు మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గారి ఆధ్వర్యంలో నారాయణఖేడ్ నియోజకవర్గం లో అన్ని తాండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటుచేసి వాటికి నిధులను సాంక్షన్ చేయించి తాండాలను అభివృద్ధి చేసిన ఘనత వారికే దక్కుతుందని తెలిపారు. నారాయణఖేడ్ పట్టణానికి దగ్గరగా జాతీయ రహదారి పక్కన 20 గుంటల స్థలాన్ని సుమారు కోట్లు విలువ చేసే స్థలాన్ని బంజారా సోదరుల కోసం వారి సామూహిక కార్యక్రమాల కోసం భవన నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గారు కేటాయించి రామరావు మహారాజ్ ట్రస్టు వారికి అందజేశారు.
గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గౌరవ తెలంగాణ తొలిముఖ్యమంత్రి కేసీఆర్ గారు బంజారా సోదరుల కోసం 10% రిజర్వేషన్లు అమలు చేశారని తెలిపారు.
గతంలో మీరు 56 సంవత్సరాలు అధికారంలో ఉండి మీ నాయన ఎమ్మెల్యేగా, మీరు ఎంపీపీగా జెడ్పీటీసీగా ఉండి ఈ మండలానికి ఈ నియోజకవర్గ బంజారా సోదరుల కోసం చేసింది ఏమీ లేదని అన్నారు.అనంతరం బంజారా సోదరి సోదరీమణులు మాజీ మంత్రి హరీష్ రావు గారికి మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి గారి చిత్రపటాలకు హారతులు ఇచ్చి, వీరి పేరు మీద ప్రత్యేక పూజలు చేసి వారి సాంప్రదాయం ప్రకారం భోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మాజీ సర్పంచ్లు రవి, కిషన్ నాయక్,మాజీ ఎంపీటీసీ రాజు నాయక్,నాయకులు వెంకట్ నాయక్, సర్దార్ నాయక్,బంగారు రాజు, రమేష్, శంకర్ నాయక్, దేవి సింగ్,భవానీ మాత మాల ధారణ స్వాములు, బంజారా సోదరులు తదితరులు ఉన్నారు.

# ఆయుధాలు అప్పగించాలి.. మల్లోజుల వేణుగోపాల్‌కు మావోయిస్టు కేంద్ర కమిటీ హెచ్చరిక



సత్యమేవ జయతే – హైదరాబాద్
హైదరాబాద్ : సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని లేఖ రాసిన మావోయిస్టు సీనియర్ నేత మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ భూపతిపై మావోయిస్టు కేంద్ర కమిటీ (%మీుశీఅర్ం%) చర్యలు తీసుకుంది. అతడిని ద్రోహిగా ప్రకటించడంతోపాటు, ఆయన వద్ద ఉన్న ఆయుధాలను వెంటనే పార్టీకి అప్పగించాలని ఆదేశించింది. లేనట్లయితే వాటిని పీపుల్స్ గొరిల్లా ఆర్మీ స్వాధీనం చేసుకుంటుందని హెచ్చరించింది. ఆయుధాలు వదిలేసేందుకు సిద్ధంగా ఉన్నామంటూ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి హోదాలో అభయ్ పేరుతో మల్లోజుల వేణుగోపాల్ ఇటీవల లేక విడుదల చేసిన విషయం తెలిసిందే.
ఆ ప్రకటనను తప్పుబట్టిన కేంద్ర కమిటీ, పార్టీపై మల్లోజుల వేణుగోపాల్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించింది. కాల్పుల విరమణ, శాంతి చర్చలపై అతడి ప్రకటనను ఖండించింది. లొంగిపోయేందుకే ఇలాంటి ప్రకటనలు చేస్తున్నారని పేర్కొంది. మావోయిస్టు నేత మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీకి వేణుగోపాలరావు తమ్ముడు అవుతారు.
– సాయుధ పోరాటాన్ని తాత్కాలికంగా విరమిస్తం..
మారిన ప్రపంచ, దేశ పరిస్థితుల దృష్ట్యా.. ఆయుధాలను విడిచిపెట్టి ప్రధాన స్రవంతిలో చేరాలని ప్రధాని, కేంద్ర హోం శాఖ మంత్రి, సీనియర్ పోలీస్ అధికారులు నిరం తరం చేసిన అభ్యర్థనల దృష్ట్యా తమ పార్టీ ఆయుధాలను వదులు కోవాలని నిర్ణయించుకుంటున్నదని ఆ పార్టీ నేత అభయ్ పేరుతో ఈ నెల 16న ఒక లేఖ విడుదలైన విషయం తెలిసిందే. సాయుధ పోరాటానికి తాత్కాలిక విరమణ ప్రకటించాలని తమ పార్టీ నిర్ణయించుకుంటున్నదని అందులో పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజా సమస్యలపై అన్ని రాజకీయ పార్టీలు, పోరాడుతున్న సంస్థలతో వీలైనంత వరకు కలిసి పోరాడుతామని వివరించారు.
ఈ అంశంపై కేంద్ర హోం శాఖ మంత్రితో లేదా ఆయన నియమించిన వ్యక్తులతో లేదా ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. మారిన తమ పార్టీ అభిప్రాయం గురించి పార్టీకి తెలియజేయడం తమ బాధ్యత అని, పార్టీలో ఈ అంశాన్ని అంగీకరించేవారు లేదా వ్యతిరేకించేవారు చర్చల్లో అంగీకరించి పాల్గొనే సహచరుల నుంచి ఒక ప్రతినిధి బృందాన్ని ఏర్పాటు చేయనున్నట్టు వివరించారు.
ప్రస్తుతం తమతో అందుబాటులో ఉన్న పరిమిత క్యాడర్, కొంతమంది నాయకత్వ సహచరులు ఈ కొత్త విధానాన్ని పూర్తిగా ఏకీభవిస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో పనిచేస్తున్న సహచరులతో, జైల్లో ఉన్న సభ్యులతో సంప్రదించేందుకు నెలరోజుల గడువు ఇస్తూ 'సీజ్ ఫైర్' చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై ప్రభుత్వంతో వీడియోకాల్ ద్వారా తమ అభిప్రాయాలను పంచుకునేందుకు కూడా తమ పార్టీ సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు. అయితే, మావోయిస్టు పార్టీలో మారిన ఈ విధానం సంచలం సృష్టిస్తున్నది. మావోయిస్టు పార్టీ సుప్రీం లీడర్ బసవరాజు మృతి తరువాత ఇటీవల కొత్త నాయకత్వంలో భాగంగా ఆయన స్థానంలో తిప్పిరి తిరుపతిని ప్రధాన కార్యదర్శిగా ఎంచుకున్న నేపథ్యంలో ఈ లేఖ విడుదల అవ్వడం మరింత సంచలనం కలిగిస్తున్నది. అంతేకాకుండా, ఎన్నడూ లేని విధంగా మావోయిస్టు నేత (అజ్ఞాత నేత) ఫొటోతో ఆ పార్టీ లేఖను విడుదల చేయడం దేశంలోని మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రతినిధి అభయ్ పేరుతో వచ్చిన ఈ లేఖ మంగళవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది.
ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రి, మావోయిస్టు ఉద్యమ ప్రభావిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, హోంశాఖ మంత్రులు శాంతిచర్చల పట్ల అనుకూలమైన వైఖరిని అవలంబించిన పాలక, అన్ని ప్రతిపక్ష పార్టీల నాయకులు, శాంతి కమిటీ సభ్యులు, జర్నలిస్టులు, ప్రజల ముందు మావోయిస్టు పార్టీ తన మారిన వైఖరిని స్పష్టంచేస్తున్నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో శాంతిచర్చలకు తమ పార్టీ సిద్ధంగా ఉన్నదని ఈ ఏడాది మార్చి చివరి వారం నుంచి విజ్ఞప్తి చేస్తున్నట్టు మావోయిస్టు పార్టీ తెలిపింది. ఇదే ప్రతిపాదనపై మే 10న మావోయిస్టు పార్టీ ప్రతినిధి అభయ్ పేరుతో పత్రికా ప్రకటన విడుదల చేసినట్టు తాజా లేఖలోనూ మావోయిస్టులు తెలిపారు. అందులో తమ పార్టీ ఆయుధాలను వదులుకుంటున్నట్టు ప్రస్తావించారని పేర్కొన్నారు. అదే విధంగా ప్రభుత్వానికి కాల్పుల విరమణ సైతం ప్రతిపాదించినట్టు వివరించారు.
ఈ ముఖ్యమైన అంశంపై తమ పార్టీ నాయకత్వ, సహచరులతో సంప్రదించడానికి ఒక నెల రోజుల సమయం కావాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోగా.. గత ఏడాది జనవరి నుంచి వేలాది సంఖ్యలో జరుపుతున్న సైనిక దాడిని తీవ్రతరం చేసింది. వేలాదిమంది సాయుధ పోలీస్ బలగాలను మోహరించి చుట్టుముట్టి నిర్మూలన దాడి జరిపింది. ఇందులో భాగంగానే ఈ ఏడాది మే 21న మాడ్ ఏరియాలోని గుండెకోట్ సమీపంలో జరిగిన భీకరదాడిలో ధైర్యంగా ప్రతిఘటించిన తమ పార్టీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజుతోపాటు 28 మంది కేంద్ర కమిటీ సభ్యులు, సహచరులు, వారి భద్రతా సిబ్బంది అమరులైనట్టు పేర్కొన్నారు. గతంలో జరిగిన శాంతిచర్చల ప్రక్రియను సగంలో వదిలి వేయకుండా అభయ్ ఆలోచనలకు అనుగుణంగా శాంతి చర్చలను ముందుకు తీసుకువెళ్లాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు, ఇందుకోసమే ఈ పత్రికా ప్రకటన విడుదల చేస్తున్నట్టు వెల్లడించారు. తమ పార్టీ ప్రధాన కార్యదర్శి చొరవతో ప్రారంభమైన శాంతి చర్చల ప్రక్రియను ముందుకు తీసుకెళ్తున్నట్టు పేర్కొన్నారు.

# వికారాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షుడికి ఘోర అవమానం..?

సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా ప్రతినిధి : జిల్లా బిజెపి పార్టీ నూతన అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డికి ఘోర అవమానం జరిగింది అని జిల్లా కేంద్రంలో చర్చనీయాంశం అయ్యింది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంలో భాగంగా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గెస్ట్ హౌస్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. నిజానికి ఈ సమావేశం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించాల్సి ఉంది. కానీ ఏం జరిగిందో తెలియదు. ఎంపీ ఇతర బిజెపి నాయకులు మీడియా సమావేశానికి వచ్చిన చాలాసేపటికి జిల్లా అధ్యక్షుడు మీడియా సమావేశానికి హాజరయ్యారు. సమావేశం లో స్థలం లేకపోవడంతో పార్టీ కండువా వేసుకోకుండానే జిల్లా అధ్యక్షుడు బయటకు వచ్చి కూర్చున్నాడు. అయినా కూడా ఆయనను ఎవరూ పట్టించుకోలేదు. పార్టీకి చెందిన ఇతర నాయకులు బయటకు వచ్చి లోపలికి వెళ్లినప్పటికీ, అధ్యక్షుడిని లోపలికి రమ్మని ఎవరు చెప్పకపోగా, ఎంపీ నాయకులతో మాట్లాడుతున్నారని కొద్ది సమయం వెయిట్ చేయండి అని ఎంపీ గన్మెన్ చెప్పినట్లు తెలుస్తుంది.
దాంతో ఎంపీ బయటకు వచ్చేంత వరకు జిల్లా అధ్యక్షుడు బయటే నిలబడ్డాడు. బయటకు వచ్చిన ఎంపీతో రాజశేఖర్ రెడ్డి మాట్లాడే ప్రయత్నం చేసినప్పటికీ, బయటకు వెళ్లే సమయం అవుతుందని చిన్నగా పలకరించి కారు ఎక్కి వెళ్ళిపోయాడు. దాంతో బిజెపి పార్టీలో అంతర్గత పోరు మరింత ఎక్కువైందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే రేపు మాపో పార్టీ అధ్యక్ష పదవి నుంచి రాజశేఖర్ రెడ్డిని గౌరవంగా తప్పుకోవాలని పార్టీ అధిష్టాన వర్గం సూచించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగానే ప్రెస్ మీట్ కు జిల్లా అధ్యక్షుడిని దూరం పెట్టారని తెలుస్తుంది. ఇక అధ్యక్షుడి వర్గం నాయకులు మాత్రం జిల్లాలో బిజెపి పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న రాజశేఖర్ రెడ్డిని కావాలనే పదవి నుంచి తప్పించాలని కొందరు స్థానిక నాయకులు కుట్రలు చేసి, ఎంపీతో పాటు కేంద్ర, రాష్ట్ర నాయకులకు ఫిర్యాదులు చేస్తున్నారని అంటున్నారు. మరి ఈ వర్గ పోరు ఎక్కడి వరకు వెళ్తుందో వేచి చూడాలి..

సత్యమేవ జయతే

బుధవారం 24 సెప్టెంబర్ 2025

## ఒడిలో పసిపాపతో మహిళ.. పరుగెత్తినా పట్టించుకోని నర్సాపూర్ ఆర్టీసీ డిపో డ్రైవర్




సత్యమేవ జయతే – నర్సాపూర్ నర్సాపూర్ : సాధారణంగా చాలా మంది ఆర్టీసీ డ్రైవర్లు బస్‌స్టాపుల్లో మాత్రమే బస్సులను ఆపుతుంటారని తెలిసిందే. అయితే కొందరు మాత్రం ప్రయాణికుల రిక్వెస్ట్‌లను బట్టి బస్ స్టాప్ లేకున్నా బస్సు ఆపి మరీ వారిని ఎక్కించుకుని వెళుతుంటారు. రూల్స్ మాట అటుంచితే కొన్నిసార్లు మానవతా దృక్పథంతో బస్సు ఆపాల్సి ఉంటుంది. కానీ కొందరు డ్రైవర్లకు మాత్రం అవేం పట్టవు. అలాంటి ఘటనే నర్సాపూర్ పరిధిలో జరిగింది.
నర్సాపూర్ ఆర్టీసీ డిపో టీఎస్ 08 యూహెచ్ 2540 సంబంధించిన బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా మహిళలను చూసి కూడా బస్సు ఆపకుండా వెళ్లిపోతున్నారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం 7 గంటలకు జోగిపేట్ నుండి నర్సాపూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు చందూర్ గేటు వద్ద ఒడిలో పాపను ఎత్తుకున్న మహిళ, మరో చిన్న పాపతో కలిసి బస్సును ఆపింది. అయితే ఆ బస్సు డ్రైవర్ ఏమాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఆపకపోవడంతో ఆ మహిళ తన ఇద్దరు పాపలతో కొద్ది దూరం పరిగెత్తింది. అది చూసిన చందూరు రోడ్డు వద్ద ఉన్న ప్రయాణికులు ఆమెను చూసి బస్సును గేటు వద్ద ఆపించారు.
దీంతో ఆ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా ప్రయాణికులపై దురుసుగా ప్రవర్తించాడు. బస్సు ఎక్కడ అంటే అక్కడ ఆపాలని రూల్ లేదు అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. అక్కడున్న ప్రయాణికులు ఆపకుంటే ఆపకున్నా సరే గానీ ఆ మహిళ ఆ పసిపిల్లలను చూసి అన్నా ఆపాలి కదా.. అని ప్రయాణికులు ఆ డ్రైవర్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం ప్రయాణికులు మాట్లాడుతూ.. ప్రతీ రోజు బస్సు డ్రైవర్లు రోజు ఇలానే మహిళలను చూసి ఆపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముందే పండగ సమయం, షాపింగ్‌కు వెళ్లాలన్నా ఇతర ప్రయాణం చేయాలన్నా బస్సులతో చాలు ఇబ్బందిగా ఉందని మహిళలు ప్రభుత్వపై, బస్సు డ్రైవర్ల పైన వాపోయారు.

## పెండింగ్ కేసులు వెంటనే పూర్తి చేయాలి . వికారాబాద్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి..




సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా.. వికారాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న కేసులను పూర్తి చేయాలని ఆయన అన్నారు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పెండింగ్ లో లేకుండా కేసులు చూడాలని ఆయన పోలీస్ అధికారులను కోరారు.

## మరోసారి ఆగిపోయిన మెట్రో రైలు ఆందోళనకు గురైన ప్రయాణికులు




సత్యమేవ జయతే – హైదరాబాద్‌హైదరాబాద్ : నగర ప్రజల రాకపోకలకు ముఖ్యమైన ఆధారంగా నిలుస్తున్న హైదరాబాద్ మెట్రో రైలులో మళ్లీ సాంకేతిక లోపం తలెత్తింది. ఈ ఘటన మంగళవారం ఉదయం భరత్‌నగర్ మెట్రో స్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది.
ప్రయాణికులతో వెళ్తున్న రైలు మధ్యలో అకస్మాత్తుగా ఆగిపోవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సుమారు 8 నిమిషాల పాటు రైలు కదలకపోవడంతో ప్రయాణికులు ఆందోళనతో అసహనానికి గురయ్యారు. అయితే, కొద్ది సేపటికే లోపాన్ని సిబ్బంది సరిచేసి రైలును మళ్లీ నడిపించారు.
ఈ సంఘటనపై మెట్రో అధికారులు స్పందిస్తూ %-% "సాంకేతిక సమస్య తలెత్తడంతో రైలు కాసేపు ఆగిపోయింది. అయితే వెంటనే లోపాన్ని గుర్తించి సరిచేయడం జరిగింది. ప్రయాణికుల భద్రతకు ఎలాంటి ముప్పు లేదు" అని స్పష్టం చేశారు.
ఇక వరుసగా ఇలాంటి సాంకేతిక లోపాలు రావడంతో, మెట్రో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "ప్రతిసారి ఇలాంటివి జరుగుతున్నాయి. మేము భయపడుతున్నాం. అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలి" అని కొందరు ప్రయాణికులు అభిప్రాయపడ్డారు.

## యువకుడి ఇంట్లో ఉరేసుకున్న వివాహిత!

మహబూబాబాద్ జిల్లాకు చెందిన ఓ వివాహిత కుమారుడికి వైద్యం చేయిస్తానని ఇంట్లో చెప్పి నాగోలులోని ఓ యువకుడి గదికి వెళ్లింది. రోజంతా అక్కడే గడిపిన ఆమె సాయంత్రానికి బాత్రూంలో చీరతో ఉరి వేసుకుంది. ఆ మహిళ తన గదిలో ఉందని బయటకు తెలిస్తే పరువు పోతుందని భయపడిన ఆ యువకుడు ఆమెను కాపాడేందుకు ప్రయత్నించాడు. బాత్రూం తలుపులు బద్దలు కొట్టి లోపలకి వెళ్లేసరికి ఆమె ఊపిరి ఆడక మృతి చెందింది. దీంతో తీవ్ర ఆందోళనకు గురైన ఆ యువకుడు కూడా ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషాదకర సంఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.జిల్లాలోని రెడ్యాల గ్రామానికి చెందిన 38 ఏళ్ల వివాహితకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆమెకు నాగోలులోని అంధుల కాలనీలో ఉండే బానోత్ అనిల్ నాయక్(24) తో పరిచయం ఉంది. ఈ క్రమంలో కుమారుడికి చికిత్స చేయించేందుకు ఆసుపత్రికి వెళుతున్నానని చెప్పి ఈ నెల 20న అనిల్ వద్దకు వచ్చింది. 21న రాత్రి వరకు ఇద్దరూ కలిసే ఉన్నారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఆ మహిళ బాత్రూంలోకి వెళ్లి చీరతో ఉరి వేసుకుంది. ఎంతసేపటికీ బయటకు రాకపోవడంతో బాత్రూం వెంటిలేటర్ నుంచి చూడగా ఆమె ఉరివేసుకోవడం కనిపించింది.

# ఆయన్ను చూస్తే మాకే భయమేస్తోంది.. సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ డ్రెస్సింగ్‌పై హైకోర్టు తీవ్ర ఆగ్రహం

సత్యమేవ జయతే – రాజన్న సిరిసిల్ల
రాజన్న సిరిసిల్ల : రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్‌కు డ్రెస్సింగ్ సెన్స్ సరిగ్గా లేదని.. ఆయన్ను చూస్తే తమకే భయంగా ఉందని వ్యాఖ్యానించింది. ఇక ఆయన ప్రజలకు ఎలా సేవ చేస్తారని మండిపడింది. సందీప్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ప్రిన్సిపల్ హెూం సెక్రటరీకి ఆదేశాలు జారీ చేసింది.
మిడ్ మానేరు నిర్వాసితురాలు వనబట్ల కవితకు నష్ట పరిహారం చెల్లించాలని గతంలో హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ నష్టపరిహారం చెల్లించకపోవడంతో పాటు ఆర్డీవో, ఎమ్మార్వోలకు చెప్పి కవితపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపణలు ఉన్నాయి. వీటిపై న్యాయం కోసం కవిత తాజాగా హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై గతంలో న్యాయస్థానానికి హాజరైనప్పుడు సందీప్ కుమార్ ఝా డ్రెస్సింగ్‌పై.. ధర్మాసనం అభ్యంతరం వ్యక్తం చేసింది. కోర్టు ప్రొసిడింగ్స్ తెలియదా.. కోర్టుకు వచ్చే పద్ధతి ఇదేనా అంటూ కలెక్టర్‌పై మండిపడింది. ఇదే విషయంలో మరోసారి ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్‌పై చర్యలు ఆదేశించింది. అలాగే బాధితురాలికి నష్టపరిహారం చెల్లించాలని గతంలో ఇచ్చిన తీర్పును యథావిధిగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, సీఎస్‌ను ఆదేశించింది. ఇప్పటికే సందీప్‌కుమార్ ఝాకు హైకోర్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. తంగళ్లపల్లి మండలం చీర్లవంచకు చెందిన వేపుల ఎల్లయ్యకు భూసేకరణ పరిహారం చెల్లించాలన్న హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయని రాజన్న సిరిసిల్ల కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తీరుపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. తామిచ్చిన ఉత్తర్వులను ఎందుకు అమ లు చేయలేదని నిలదీసింది. గతంలో ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయకపోగా



వ్యక్తిగతంగా హాజరై వివరణ ఇవ్వకపోవడంపై మండిపడింది. కోర్టు అంటే లెక లేదా అని నిప్పులు చెరిగింది. హైకోర్టు ఆదేశాలను అమలు చేయని కలెక్టర్‌తోపాటు భూసేకరణ అధికారికి బెయిలబుల్ వారంట్ జారీచేసింది. అక్టోబర్ 8న జరిగే విచారణ సమయంలో కలెక్టర్‌ను తమ ముందు హాజరుపర్చేలా చర్యలు తీసుకోవాలని హైకోర్టు రిజిస్ట్రీ కి ఉత్తర్వులు జారీచేసింది. ఉత్తర్వులను ఐఏఎస్ స్థాయి అధికారి అమలు చేయలేదంటే ఏమనుకోవాలని వ్యాఖ్యానించింది. ఇదిలా ఉంటే ప్రజాపాలన దినోత్సవాల సమయంలో ప్రొటోకాల్ వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం కూడా కలెక్టర్‌పై సీరియస్‌గా ఉన్న సంగతి తెలిసిందే.

# పేదల ఆరోగ్యానికి భరోసా.. సీఎంఆర్ఎఫ్

**పేదల ఆరోగ్యానికి భరోసా.. సీఎంఆర్ఎఫ్**

**-తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి**

**-157 మందికి రూ. 60లక్షల విలువైన ఎల్ఓసీల అందజేత..**

సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..తాండూరు, : సీఎంఆర్ఎఫ్ పథకంతో రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆరోగ్యానికి భరోసా అందిస్తోందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు.మంగళవారం తాండూరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాండూరు, బషీరాబాద్, యాలాల, పెద్దేముల్, తాండూరు పట్టణంకు చెందిన సీఎంఆర్ఎఫ్ పథకం కింద 157 మందికి మంజూరైన రూ. 60 లక్షల విలువైన ఎల్బీసీల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి చేతుల మీదుగా ఆయా మండలాల లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్.ఎల్డీసీలను అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి, ఆరోగ్యానికి ప్రజా ప్రభుత్వం పెద్ద పీట వేస్తుందని అన్నారు. ఈ పథకాలను అర్హులైన పేదలందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, నాయకులు అజయ్ ప్రసాద్, ఉప్పరి మల్లేశం, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, పట్టణ అధ్యక్షులు హబీబ్ లాల, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, వివిధ మండలాల లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ విఫలం : ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల



సత్యమేవ జయతే – కోరుట్ల కోరుట్ల : ఒక దశ, దిశ లేకుండా కాంగ్రెస్ పాలన సాగుతోందని, ఎవరికివారే మాయమాటలతోనే కాలం వెళ్లదీస్తున్నారని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విమర్శించారు. మంగళవారం కోరుట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 14ఏళ్లు ఉద్యమ పార్టీగా, పదేళ్లు అధికార పార్టీగా, 20 నెలలకాలంగా ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా వారి ఆకాంక్షల మేరకు పని చేస్తున్నామని తెలిపారు.
ప్రజా సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, రాష్ట్ర ఆర్థిక ప్రగతి కుంటుపడిందన్నారు. ప్రభుత్వానికి ప్రజా సమస్యలపై చిత్తశుద్ధి లేదని నిర్దిష్టమైన పాలసీ లేకుండా ఇష్టరీతిలో పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే దుయ్యబట్టారు. పదేళ్ల కెసిఆర్ పాలనలో ఏనాడు రైతులకు ఇబ్బందులు రాలేదని, ఇప్పుడు రైతులు యూరియా కోసం పడరాని పాట్లు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలలో ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పాలనలో విద్య, వైద్యం, సాగు రంగంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోని మొదటి స్థానంలో నిలిచిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రగతి అదోపతాలనికి దిగజారింది అన్నారు. రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు, పరిశ్రమలు రాలేదని పేర్కొన్నారు. ఐటీ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిపోయిందని, ఉద్యోగాలు దొరక్క నిరుద్యోగ యువత అష్టకష్టాలు పడుతున్నారని తెలిపారు.
కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజలు విసుగు చెందారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతారన్నారు. అనంతరం పట్టణంలోని ఏసుకొని గుట్ట దుర్గామాత ఆలయ దసరా నవరాత్రోత్సవాల పోస్టర్ ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఫహీం, ఉపాధ్యక్షుడు అస్లాం ఖురేషి, నాయకులు కాశిరెడ్డి మోహన్ రెడ్డి, పేర్ల సత్యం, సజ్జు, అన్వర్, కేతిరెడ్డి భాస్కర్ రెడ్డి, మహమ్మద్ అతిక్, చిత్తరి ఆనంద్, పొట్ట సురేందర్, వన తడుపుల అంజయ్య, గెల్లే గంగాధర్, శ్రీపతి, బింగి సంతోష్, అమెర్, రాజశేఖర్, రహీం పాషా తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడా యూరియా వెంటనే సరఫరా చేయాలి

సత్యమేవ జయతే – ఖమ్మం ఖమ్మం : రైతులందరికీ సరిపడా యూరియా వెంటనే సరఫరా చేయాలని, లేని పక్షంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని స్తంభింప చేస్తామని రైతు సంఘం జిల్లా కార్యదర్శి అన్నవరపు సత్యనారాయణ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండలంలోని స్థానిక మార్కెటియార్డులో యూరియా సరఫరా కేంద్రాన్ని పరిశీలించారు. యూరియా కొరతను నిరసిస్తూ జాతీయ రహదారిపై సిపిఎం, రైతు సంఘం ఆధ్వర్యంలో ధర్నా రాస్తారోకో చేశారు.
ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ సీజన్ లో యూరియా అందించకపోవడం వల్ల ఆరుకాలం కష్టపడ్డ పంట చేతికి అందక నష్టపోయి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని తెలిపారు. యూరియాను దిగుమతి చేసుకొని రైతులందరికీ సరిపడ యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి వాంకుడోత్ కోబల్, రైతులు భూక్యా బాలకిషన్, అజ్మీర కుమార్, నరేష్, రమేష్, పుల్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## గొల్లపల్లి గ్రామ ఎస్సీ ప్రజలకు న్యాయం చేయాలి - బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు దావీదు....



సత్యమేవ జయతే - కొండాపూర్ కొండాపూర్ : కొండాపూర్ మండలంలోని గొల్లపల్లి గ్రామంలో ఇప్పటి వరకు ఎప్పుడూ ఎస్సీ (షెడ్యూల్డ్ కులాలు) సర్పంచ్ పదవి రాకపోవడం పట్ల గ్రామ ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన దశాబ్దాల నుండి గొల్లపల్లి గ్రామానికి సర్పంచ్ పదవి దక్కినప్పటికీ ఎస్సీ సమాజానికి మాత్రం ఒక్కసారి కూడా ఆ అవకాశం లభించలేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

- ఈ సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ అసెంబ్లీ అధ్యక్షులు దావీదు గారు మాట్లాడుతూ %-%"గొల్లపల్లి గ్రామంలో ఎస్సీ కులాల ప్రజలు గణనీయంగా ఉన్నప్పటికీ వారికి సర్పంచ్ పదవిలో ప్రాతినిధ్యం ఇవ్వలేదు. ఇది పెద్ద అన్యాయం. రాబోయే ఎన్నికల్లో గొల్లపల్లి గ్రామానికి సర్పంచ్ పదవిని ఎస్సీలకు కేటాయించి, షెడ్యూల్డ్ కులాల హక్కులను కాపాడాలని ప్రభుత్వాన్ని మనవి చేస్తున్నాము" అని డిమాండ్ చేశారు.

గ్రామ యువకులు, మాజీ వార్డ్ మెంబర్లు, గ్రామ పెద్దలు కూడా ఈ ఆవేదనలో భాగమయ్యారు. "స్వాతంత్రం వచ్చిన 75 ఏళ్లలో ఒక్కసారి కూడా మా వర్గానికి సర్పంచ్ పదవి దక్కలేదు. ఇకనైనా మాకు న్యాయం జరిగి ఎస్సీ సమాజానికి గొల్లపల్లి సర్పంచ్ స్థానం ఇవ్వాలి" అని గ్రామస్థులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సిటీలో 10 ఎలక్ట్రిక్ బస్ స్టేషన్లు

### - ఉన్న బస్టాండ్లనే ఎలక్ట్రిక్ వాహనాల కోసం మార్పు

### - త్వరలో అందుబాటులోకి 2,800 ఎలక్ట్రిక్ బస్సులు

### - మొత్తం 19 బస్టాండ్‌లో చార్జింగ్ స్టేషన్ల ఏర్పాట్లు



సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : జీఎచ్ఎంసీ పరిధిలో ఎలక్ట్రిక్ బస్సుల కోసం 10 బస్‌స్టాండ్లను ఆర్టీసీ సంస్థ ఎంపిక చేసింది. ఇప్పటికే ఉన్న చార్జింగ్ స్టేషన్లతో కలిపి మొత్తం 19 బస్టాండ్లను ఎలక్ట్రిక్ బస్‌ల కోసం సిద్ధం చేస్తున్నారు. అయితే, ఇప్పటికే ఉన్న బస్టాండ్‌లను ఎలక్ట్రిక్ వాహనాల కోసం మార్పులు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ బస్సుల టెండర్ల ప్రక్రియ ఓ కొలిక్కి రావడంతో పనులు త్వరత్వరగా చేపడుతున్నట్లు ఆర్టీసీ ఉన్నతాధికారులు చెప్పారు.

దేశంలో ఎలక్ట్రిక్ బస్సుల వాడకాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం 'ప్రధానమంత్రి ఈ-డ్రైవ్' పథకాన్ని తీసుకురాగా.. ప్రధాన నగరాల్లో 14,028 ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురానున్నది. ఈ క్రమంలో టీజీఎస్‌ఆర్టీసీ 2,800 బస్సులు కావాలని కేంద్రాన్ని కోరింది. ఆ కోటాలో ఇప్పటికే 300 ఎలక్ట్రిక్ బస్సులు ఉండగా.. మిగిలిన అన్ని బస్సులను కేంద్రం సమకూర్చనుంది. దీంతో అతి త్వరలోనే తెలంగాణలో మొత్తం 2,800 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులో ఉండనున్నాయి. ఈ మేరకు జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా మరో 10 బస్టాండ్లను అందుకు తగ్గట్లుగా మార్చుతున్నారు. ఎక్కడికక్కడే చార్జింగ్ స్టేషన్లు ఏర్పాట్లు చేస్తున్నారు.

- 10వేల మంది రోడ్డుపాలు?

కేంద్రం తీసుకొస్తున్న ఎలక్ట్రిక్ బస్‌లతో తెలంగాణలోని సుమారు 10వేల మందికిపైగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారెజీల సిబ్బందిపై పలు రకాలుగా వేటు పడుతుందని ఆర్టీసీ కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. దీంతో ఇన్నాళ్లూ అమ్మలా ఆదరించిన ఆర్టీసీని వదిలి.. మరో ఉద్యోగం వెతుక్కోవాల్సిన దారుణమైన దుస్థితిని తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కోబోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా క్రమ క్రమంగా ఆర్టీసీ పూర్తిగా ప్రైవేట్‌పరం కానుందని అంటున్నారు.

గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్(జీసీసీ) విధానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకునేందుకు తెలంగాణ ఆర్టీసీ సిద్ధమవుతోంది. మొదటి దశలో వివిధ రాష్ట్రాలకు వచ్చే 14,028 ఎలక్ట్రిక్ బస్సులకు కేంద్రం నుంచి వచ్చే సబ్సిడీ మొత్తంతో వాటిని కొనుగోలు చేస్తున్న ఓ ప్రముఖ కార్పొరేట్ సంస్థకు వెళుతుంది. ఇందులో ఆర్టీసీకి ఎలాంటి లాభం ఉండదు. ఇక తెలంగాణకు వచ్చే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వాహణ అంతా వాటిని కొనుగోలు చేసిన ఆ కార్పొరేట్ సంస్థనే చూసుకుంటుంది.

వారు నియమించిన వారే డ్రైవర్లు, కండక్టర్లుగా ఉంటారని కార్మిక నేతలు అంటున్నారు. ఇక రిపేర్లకు కూడా ఆ సంస్థ నియమించుకునే వారే ఉంటారు. దీంతో ఆర్టీసీ గ్యారెజీలు ప్రశ్నార్థకం కానున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే తెలంగాణలోని కొన్ని ఆర్టీసీ డిపోల పరిధిలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. చార్జింగ్ స్టేషన్లు ఆర్టీసీ సంస్థవైతే.. వాటి ద్వారా చార్జింగ్ పెట్టుకుని లాభాలు పొందేది ప్రైవేట్ సంస్థలా? అని నిలదీస్తున్నారు.

# గల్లీగల్లీలో కల్తీ కల్లు దందా..

### పిచ్చిపిచ్చిగా ప్రవర్తించిన విద్యార్థి.. బట్టలు లేకుండా తిరిగి చనిపోయిన మరో యువకుడు





సత్యమేవ జయతే - పాపన్నపేట పాపన్నపేట : ఇటీవల జహీరాబాద్‌లో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపునకు పాపన్నపేట మండలం నుండి వెళ్లిన ఓ పదవ తరగతి విద్యార్థి కల్లు లేక పిచ్చి పిచ్చిగా ప్రవర్తించడంతో సంబంధిత అధికారులు ఇంటికి పంపించారు. పాపన్నపేటకు చెందిన ఒక యువకుడు పని మీద మధ్యప్రదేశ్ వెళ్లి అక్కడ కల్లు దొరకక మానసిక రోగిలా ప్రవర్తిస్తూ బట్టలు లేకుండా తిరిగి చనిపోయాడు. అనాథగా భావించిన అక్కడి స్థానికులు ఖననం చేశారు. అనంతరం జాడ తెలవడంతో పోలీసులు శవాన్ని బయటకు తీసి పాపన్నపేటకు పంపారు.

పాపన్నపేట మండలం పరిధిలోని ఒక గ్రామానికి చెందిన వ్యక్తి తమ కొడుకు వద్ద లక్ష్మీ నగర్‌లో ఉంటూ.. అక్కడ కల్లు దొరకక, తీవ్ర మానసిక ఆందోళనకు లోనై.. ఇటీవల ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుని చనిపోయాడు. ఇవన్నీ ఏంటీ అబ్రకదబ్ర కథలు అనుకుంటున్నారా ..? కాదండి కల్తీ కల్లు లీలలు, పాపన్నపేట మండల పరిధిలో కల్తీ కల్లు సృష్టిస్తున్న లీలలు అన్నీ.. ఇన్నీ కావు. కోకొల్లలు. ఏ పల్లె లో.. యే గల్లీలో చూసినా ఇలాంటి భయానక సంఘటనలు కనిపిస్తాయి. ఇలా చెబుతూ పోతే కల్తీ కల్లు కథలు ఇంతా అంతా కాదు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం డ్రగ్స్ నివారణ కోసం పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తుంది కానీ, డ్రగ్స్ కు మించిన మహమ్మారిగా మారిన కల్తీకల్లు గురించి కనీసం పట్టించుకోవడం లేదు.

ముఖ్యంగా దసరా పండుగ రావడంతో పట్టణాల నుండి ప్రజలంతా తమ తమ సొంతూళ్లకు చేరుకుంటున్నారు. ఇదే అదునుగా భావించిన కల్తీ కల్లు వ్యాపారులు గ్రామీణ ప్రాంతాల వారిని మత్తులో ముంచుతున్నారు. ఎలాంటి లైసెన్సులు లేకుండా ఇల్లీగల్ షాప్స్ కొందరు నడుపుతుండగా మరికొందరు ఎక్కడ దొరికితే అక్కడ దుకాణాలు ఏర్పాటు చేస్తూ డైజోఫామ్, క్లోరల్ హైడ్రాయిడ్, గంజాయి పౌడర్ లాంటి మత్తు పదార్థాలు కలుపుతున్నారు. ముఖ్యంగా గాజుల గూడెం ఎంకే పల్లి చౌరస్తా , కోడపాక, బాచారం, ఎల్లాపూర్, మల్లంపేట, పొడిచనుపల్లి, అన్నారం, అబ్లాపూర్, మిన్పూర్ తదితర గ్రామాలలో విపరీతమైన కల్తీ జరుపుతున్నారు.

- ఎలాంటి లైసెన్సులు లేకుండా..

కాగా కొత్తపల్లి, కుర్తివాడ గ్రామాల్లో అడ్డూ అదుపు లేకుండా కల్లులో ఆల్ఫాజోలం లాంటి మత్తు పదార్థాలు అధిక మొత్తంలో కలపడంతో, యూసుఫ్ పేట, ఆరేపల్లి గ్రామాలకు చెందిన కల్లు ప్రియులు సాయంత్రం అయిందంటే ఆ గ్రామాల బాట పడుతున్నారు. ఇక అరికెల చౌరస్తా రాజ్యా తాండ వద్ద మెయిన్ రోడ్డుపై కల్లు దుకాణాలు పెట్టి పెద్ద ఎత్తున కల్తీకల్లు అమ్మకాలు సాగిస్తున్నారు. మత్తు ప్రాతిపదికన ఫ్రిజ్ లో బాటిల్స్ పెట్టి రూ.20కి ఒక్కటి అమ్ముతున్నారు.

ఆర్కెలలో నైతే ఫ్రిజ్‌లో పెట్టి 30కి అమ్ముతున్నారు. పాపన్నపేట నుండి సుమారు 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న అరికెల చౌరస్తాకు కల్లు కోసం పరుగులు తీస్తున్నారంటే, మత్తు పదార్థాలకు ఎంతగా అలవాటు పడ్డారో అర్థం చేసుకోవచ్చు. ఇక లింగయ్య పల్లి చౌరస్తా వద్ద ఒక కోళ్ల ఫారం వద్ద సైతం ఇల్లీగల్‌గా దుకాణం ఏర్పాటు చేసి కల్లు అమ్ముతున్నారు. చుట్టుపక్కల గ్రామాల వారు తమ గ్రామాలను వదిలిపెట్టి అక్కడికి వచ్చి తాగుతున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతుంది.

- కల్లు దుకాణాలలో సీసాల్లో ఎలుకలు వస్తే..

గతంలో మల్లంపేట ,కొత్తపల్లి కల్లు దుకాణాలలో సీసాల్లో ఎలుకలు వస్తే కల్లు ప్రియులు ఆందోళనకు దిగిన సంఘటనలు గమనార్హం. కల్లుపై వార్తలు వస్తే కనీసం స్పందించకుండా సంబంధిత అధికారులు పేపర్‌లో వార్త వచ్చింది అంటూ సంబంధిత దుకాణాల యజమానులకు ఫోన్లు చేసి పెద్ద ఎత్తున డబ్బులు దండుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రభుత్వం డ్రగ్స్‌పై అవగాహన కల్పించడానికి ప్రతీ పాఠశాలలో అవగాహన తరగతులు నిర్వహిస్తుంది.

అంతకంటే పెనుభూతమైన కల్తీ కల్లును అరికట్టడంలో మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. మనిషిని నిర్వీర్యం చేస్తున్న ఆల్ఫా జోలం.. మత్తు కోసం కల్లులో ఆల్ఫా జోలం లాంటి ప్రమాదకరమైన మత్తు మందు కలుపుతున్నారు. దీని విలువ కిలోకు రూ.7 లక్షలు నుంచి 8 లక్షలు ఉంటుంది. ఒక గ్రామ్ ఆల్ఫా జోలంతో 100 పెట్టెల కల్తీ కల్లు తయారు చేస్తున్నారు. అసలు చుక్క చెట్టు కల్లు లేకుండానే కల్తీ కల్లు తయారవుతుంది. ఇందులో చక్రీన్ , వైట్ పేస్ట్, లాంటి ప్రమాదకర పదార్థాలు వాడుతున్నారు. దీనికి అలవాటు పడిన మనిషి, కల్లు తాగనిదే ఉండలేని పరిస్థితి నెలకొంటుంది. మనిషి ప్రాణాలు తీస్తున్న కల్తీ కల్లును అరికట్టాల్సిన బాధ్యత ఎక్సైజ్ అధికారులపై ఉందని, మహిళలు పేర్కొంటున్నారు.

# మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

### మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలి

### వైద్య ఆరోగ్య శిబిరాలను స్వదినియోగం చేసుకోవాలి

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి

### తాండూరు ఎంసీహెచ్‌లో మెగా ఆరోగ్య శిభిరం..



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా...తాండూరు, : మహిళలు ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు పట్టణం మాతా శిశు ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కింద మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హాజరై ఆరోగ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా గర్భిణీలకు వైద్య పరీక్షలు, టీబీ, బీపీ, చెవి, ముక్కు, చర్మ, రొమ్ము, సికిల్ పరీక్షలతో పాటు కిశోర బాలికల కోసం ఏర్పాటు చేసిన వైద్య సేవల విభాగాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ కుటుంబంలో మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం బలంగా, ధృడంగా ఉంటాయని అన్నారు.ఆరోగ్య సమస్యల విషయంలో మహిళలు నిర్లక్ష్యం వహించరాదని అన్నారు. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తుందని అన్నారు. వచ్చేనెల 2వ తేది వరకు నిర్వహించే వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్ డా.లలితాదేవి, డీసీహెచ్ఎస్ డా. ఆనంద్, డిప్యూటీ డీఎంహెచ్ఎం డా.రవీందర్ యాదవ్, తాండూరు మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ్ల బాల్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ధారాసింగ్, మాజీ కౌన్సిలర్ ప్రభాకర్ గౌడ్, నాయకులు అజయ్ ప్రసాద్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డా.రాజు, ఎంసీహెచ్ ఆర్ఎంఓ డా.అనిల్ కుమార్, మున్సిపల్ కమీషనర్ యాదగిరి, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు..

# తాండూరులో ఘనంగా ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు..



### బిడ్కర్ రఘు ఆధ్వర్యంలో యువకుల రక్తదానం

### జిల్లా ఆసుపత్రిలో పండ్లు, అల్పహారం వితరణ.

. సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా...తాండూరు, : తెలంగాణ చీఫ్ విప్, మాజీ మంత్రి, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి తాండూరు నేతలు, యువకులు, అభిమానులు జేజేలు పలికారు.

మంగళవారం మహేందర్ రెడ్డి జన్మదినం సందర్భంగా తాండూరుకు చెందిన యువనాయకులు బిడ్కర్ రఘు పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. దాదాపు 26 మంది యువకులు పాల్గొని రక్తదానం చేశారు. అదేవిధంగా మహేందర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆసుపత్రిలోని రోగులకు, బంధువులకు అల్పహారం పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ పరిమళ, అబ్దుల్ ఖవి, భగవాన్, పునీత్ కుమార్, శివానంద్, సంకేత్, సిద్ధు, ఆనంద్ గౌడ్, మణికంఠ శ్రీనివాస్, కాంతు, రజక క్రిష్ణ, నర్సింహా, మెట్లి వెంకట్, యువకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బిడ్కర్ రఘు, పలువురు నేతలు హైదరాబాద్‌లో మహేందర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. మహేందర్ రెడ్డిని గజమాలతో సత్కరించి.. ఫోటో జ్ఞాపికను అందజేసి జేజేలు పలిశారు..

# వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్సుల కొరత...



సత్య మే వ జయతే వికారాబాద్ జిల్లా..వికారాబాద్ జిల్లా కేంద్రంలో ప్రయాణికులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా ఆర్టీసీ బస్సుల కొరత కారణంగా ప్రతిరోజూ వందలాది మంది గంటల తరబడి బస్ స్టాండ్‌లో వేచి చూడాల్సి వస్తోంది.గౌరవ ముఖ్యమంత్రి, అసెంబ్లీ స్పీకర్ జిల్లాకే చెందిన వారైన సాధారణ ప్రజలకు తగిన సౌకర్యాలు అందడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం పీక్ అవర్స్‌లో అదనపు బస్సులు లేకపోవడంతో పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ప్రయాణికులు మాట్లాడుతూ "గంటలు గంటలు నిలబడి బస్సు కోసం వెయిట్ చేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు ప్రయాణం రద్దు చేసుకోవాల్సి వస్తోంది. జిల్లా కేంద్రంలో ఈ పరిస్థితి ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుంది" అని పేర్కొన్నారు..ప్రజలు డిమాండ్ చేస్తూ తక్షణమే వికారాబాద్ జిల్లా కేంద్రానికి అదనపు ఆర్టీసీ బస్సులు కేటాయించి, రోజువారీ ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు..

## పూడూర్ రైతుల ఆవేదన %-% రేడియల్ రోడ్డుకు భూములు ఇవ్వబోమన్న రైతులు



సత్యమేవ జయతే :వికారాబాద్, పూడూర్:రేడియల్ రోడ్ నిర్మాణం కోసం సాగు పట్టా భూములు తీసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ పూడూర్ గ్రామ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

వీడియోలో రైతులు కన్నీటి స్వరంతో మాట్లాడుతూ %-% "మాకు మరణం తప్ప ఇంకో మార్గం లేదు. మా శవాలపై రోడ్లు వేసుకోండి. కానీ మా పంటలు పండించే భూములు మాత్రం మేము ఇవ్వం" అని స్పష్టంగా తెలిపారు.రైతులు అభిప్రాయపడ్డ దాని ప్రకారం %-% మంచి పంటలు పండే సాగు భూములను రోడ్డు కోసం తీసుకోవడం తమ జీవనాధారంపై ముప్పు అని పేర్కొన్నారు. "మా భూములు పోతే మా కుటుంబాలు రోడ్డు మీద పడతాయి. ఇంతవరకు సాగు చేసుకున్న భూములు మాకే కావాలి. మేము రోడ్లకు వ్యతిరేకం కాదు కానీ పంట భూములపై కాకుండా వేరే మార్గం చూసుకోవాలి" అని వారు కోరుతున్నారు.స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తూ ు రోడ్డు నిర్మాణం కోసం ప్రత్యామ్నాయ మార్గాలు వెతికి, రైతుల జీవనోపాధిని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రైతుల ఆవేదనతో ప్రాంతమంతా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు



సత్యమేవ జయతే, వికారాబాద్ జిల్లా/నవాబ్ పేట్ :ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రివర్యులు, ప్రభుత్వ చీఫ్ శ్రీ పట్నం మహేందర్ రెడ్డి గారి జన్మదినాన్ని పురస్కరించుకుని, మంగళవారం వారి నివాసంలో నవాబ్ పేట్ మండల నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో నవాబ్ పేట్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మేడిపల్లి వెంకటయ్య గారు, వర్కింగ్ ప్రెసిడెంట్ సామ వెంకట్ రెడ్డి గారు, వట్టిమినపల్లి మాజీ సర్పంచ్ ప్రభాకర్ రెడ్డి గారు, నరసింహారెడ్డి గారు, బీసీ సెల్ అధ్యక్షుడు శ్రీధర్ గారు, మల్లేశం గారు, మహేందర్ రెడ్డి గారు, బాల్ రెడ్డి గారు, లక్ష్మణ్ గారు తదితర మండల నాయకులు పాల్గొన్నారు.నాయకులు, కార్యకర్తలు పట్నం మహేందర్ రెడ్డి గారికి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, సుభిక్షం కలగాలని ఆకాంక్షించారు.

## ఫన్ ఫీల్డ్ దసరా క్యాంపు కు భారీగా స్పందన పాఠశాల ఉపాధ్యాయులు బృందం





సత్య మేవ జయతే- నారాయణ ఖేడ్‌నారాయణఖేడ్ నియోజకవర్గంలో నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలో తెలంగాణ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ (గురుకుల) పాఠశాలలో షేటార్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు శివాని షేటార్,పై విలేజ్ మాడల్ విలేజ్ సభ్యుడు చిత్తరంజన్ దాస్ సమక్షంలో ఫన్ ఫీల్డ్ దసరా క్యాంపు అనే కార్యక్రమం ఈ నెల 21వ తారీకు నుండి 27వ తారీకు వరకు వివిధ పాఠశాలలకు చెందిన 200 మంది విద్యార్థులకు క్లాసికల్ డాన్స్, యోగా, లాజికల్ స్కిల్స్, మెడిటేషన్,బాలసభ, స్పోర్ట్స్ %౮% గేమ్స్ ఘనంగా నిర్వహించారు.అనంతరం మనూర్ మండల పరిధిలోని బోరంచ గ్రామానికి చెందిన పాఠశాలకు చెందిన 10 మంది విద్యార్థులు పాల్గొన్న నేపథ్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పీడీ రవి కుమార్ మరియు హిందీ ఉపాధ్యాయులు సాయి బాబా స్వయంగా క్యాంపు దగ్గరికి వెళ్లి పాఠశాల విద్యార్థుల తో కలిసి భోజనం చేయడంతో పాటు వారికి క్యాంపు గురించి అడిగి తెలుసుకున్నారు.తదుపరి విద్యార్థులు వేంటనే ఉపాధ్యాయులు తో మాట్లాడుతూ....ఈ క్యాంపు అనేది మా అదృష్టం అని ఎలాంటి క్యాంపు వస్తే మీము ఎక్కడికైనా వెళ్లడానికి సిద్ధం ఉన్నాం సంతోషం వ్యక్తం చేశారు.

## రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య





సత్యమేవ జయతే,వికారాబాద్/నవాబ్ పేట్: రాష్ట్ర చీఫ్ విప్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా శాసనమండలి సభ్యులు, మాజీ మంత్రివర్యులు శ్రీ పట్నం మహేందర్ రెడ్డి గారి జన్మదినం సందర్భంగా మంగళవారం హైదరాబాద్ బంజారాహిల్స్ లోని వారి నివాసంలో పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలసి శుభాకాంక్షలు అందజేశారు.

ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య గారు ప్రత్యేకంగా హాజరై, మహేందర్ రెడ్డి గారిని కలసి పూలమాల అర్పించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర రాజకీయాల్లో మహేందర్ రెడ్డి గారి సేవలు విశిష్టమైనవని,ఎమ్మెల్యే పేర్కొన్నారు.మహేందర్ రెడ్డి గారి నాయకత్వంలో రంగా రెడ్డి జిల్లాలో పలు అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, ప్రజల మనసులు గెలుచుకున్నారని కాలే యాదయ్య అన్నారు. ప్రజల సేవలో ఆయన మరింత బలంగా ముందుకు సాగాలని, పార్టీ బలోపేతానికి ఆయన కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల, జిల్లా నాయకులు పాల్గొని, మహేందర్ రెడ్డి గారికి దీర్ఘాయుష్షు, ఆరోగ్యం, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు.

## నాలుగు రోజుల్లోనే నోటిఫికేషన్. స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుకు కలెక్టర్ల ముమ్మర కసరత్తు

**స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల ఖరారుకు కలెక్టర్ల ముమ్మర కసరత్తు**

**నేడు సర్కారుకు సీల్డ్ కవర్‌లో అందజేత..**

**పరిశీలించి జీవో ఇవ్వనున్న ప్రభుత్వం.. ఆ తర్వాత నోటిఫికేషన్!**

**రిజర్వేషన్లకు 6 రకాల నివేదికలిచ్చిన కమిషన్..**

**దాని ప్రకారమే స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు**




హైదరాబాద్, సెప్టెంబరు 23 : స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం నాలుగు రోజుల్లోనే నోటిఫికేషన్ విడుదల చేయనుందా? నేటి (మంగళవారం) సాయంత్రానికే రిజర్వేషన్లు ఖరారు కానున్నాయా? అంటే విశ్వసనీయ వర్గాలు అవుననే అంటున్నాయి. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్లాలని ప్రభుత్వం నిర్ణయించిన సంగతి తెలిసిందే. హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ఇప్పటికే మొదలైన రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియ మంగళవారం సాయంత్రానికి పూర్తి కానున్నట్లు తెలిసింది. ఆ వివరాలన్నీ ప్రభుత్వానికి సీల్డ్ కవర్లో అందనున్నాయి. వాటిని పరిశీలించిన అన ంతరం నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రభుత్వ వర్గాలు జిల్లా కలెక్టర్లకు తెలిపాయి. రిజర్వేషన్ల ఖరారు పూర్తయిన తర్వాత.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లతోనే ఎన్నికలకు వెళ్తున్నామని తెలిపేలా సర్కారు ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయనుంది. ఆ తర్వాత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు సమాచారం. కాగా, ఈ నెల 30లోగా స్థానిక ఎన్నికలను నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు అసెంబ్లీలో ఆమోదించి, పంపిన బిల్లులపై కేంద్రం ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. అందుకే ఎన్నికల నిర్వహణ ఆలస్యమైందని, తాజాగా ప్రత్యేక జీవోతో ఎన్నికలకు వెళ్తున్నామని, అందుకు కొంత సమయం కావాలంటూ ప్రభుత్వం హైకోర్టును కోరనున్నట్లు తెలిసింది. మరోవైపు స్థానిక ఎన్నికల అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక సమావేశం నిర్వహించనున్నట్లు సమాచారం.

కమిషన్ నివేదిక ప్రకారమే రిజర్వేషన్లు..

రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిషన్ ఇచ్చిన నివేదిక ప్రకారమే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ, జడ్పీ చైర్పర్సన్.. ఇలా 6 ర కాల నివేదికలను కమిషన్ తయారు చేసింది. ఆయా పదవుల్లో బీసీలకు కేటాయించాల్సిన రిజర్వేషన్ల వివరాలను పేర్కొంది. గ్రామాల్లో వార్డు సభ్యులు, సర్పంచ్‌లకు ఎంత మేర రిజర్వేషన్ కేటాయించాలి? వార్డుల్లో ఎంతమంది బీసీలు ఉన్నారు? ఒకవేళ బీసీలకు సర్పంచ్ పోస్టును ఇవ్వాలంటే గ్రామం మొత్తం మీద బీసీలు ఎందరు ఉన్నారనే అంశాలను పరిగణనలోకి తీసుకుంది. మండల స్థాయి పోస్టులైన ఎంపీటీసీ, ఎంపీపీలకూ ఇదే విధానాన్ని వర్తింపజేయనున్నారు. ఇక జడ్పీటీసీ సభ్యులు, జడ్పీ చైర్పర్సన్ అంశంలోనూ రాష్ట్రస్థాయిలో ఉన్న వివరాలను పరిగణనలోకి తీసుకుంది. దీని ప్రకారమే ప్రస్తుతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లను ఖరారు చేయనున్నారు. ఎస్సీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం, బీసీలకు 2024 కుల సర్వే ఆధారంగా రిజర్వేషన్లను కేటాయించనున్నారు. అలాగే వార్డు సభ్యుల రిజర్వేషన్లను ఎంపీడీవోలే సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్లను ఆర్డీవో ఎంపీపీ, జడ్పీటీసీలకు జిల్లా కలెక్టర్లుబీ జడ్పీ చైర్మన్ల రిజర్వేషన్లను పంచాయతీరాజ్ శాఖ కమిషనర్లు ఖరారు చేయనున్నారు.

నేడు సీల్డ్ కవర్లో రిజర్వేషన్లు..

స్థానిక ఎన్నికల్లో రిజర్వేషన్ల వ్యవహారంపై సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఆయా జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో ముమ్మర కసరత్తు జరిగింది. ప్రత్యేక కమిషన్ నివేదికలతో పాటు ఆయా జిల్లాలు, గ్రామాల వారీగా ఉన్న జనాభా వివరాలను ప్రభుత్వం కలెక్టర్లకు అందించింది. ఆ వివరాల ప్రకారమే వార్డు సభ్యుల నుంచి జడ్పీ ఛైర్పర్సన్ వరకు రిజర్వేషన్లను అధికారులు ఖరారు చేస్తున్నారు. 12,760 గ్రామపంచాయతీలు, 1,12,534 వార్డులు, 5,763 ఎంపీటీసీలు, 565 ఎంపీపీలు, 565 జడ్పీటీసీలు, 31 జడ్పీ చైర్పర్సన్ స్థానాలకు ఖరారు చేసిన రిజర్వేషన్ల వివరాలను సీల్డ్ కవర్‌లో ఉంచి మంగళవారం సాయంత్రానికి కలెక్టర్లు ప్రభుత్వానికి అందించనున్నారు.

## చేవెళ్లలో ఎమ్మెల్యే కాలే యాదయ్య దుర్గాదేవి దర్శనం





సత్యమేవ జయతే/చేవెళ్ల నియోజకవర్గం:శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల భాగంగా చేవెళ్ల పట్టణంలోని రచ్చబండ వద్ద కొలువుదీరిన దుర్గాదేవి అమ్మవారిని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య గారు దర్శించుకున్నారు.ఎమ్మెల్యే గారు ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, భక్తులు మరియు పట్టణవాసులు పాల్గొన్నారు

సత్యమేవ జయతే



## శ్రుతిలయ ఫౌండేషన్ - సీల్వెల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో "సీల్వెల్ సేవా సమ్మేళనాలు - 77"





సత్యమేవ జయతే - హైదరాబాద్ హైదరాబాద్ : శ్రుతిలయ ఫౌండేషన్ మరియు సీల్వెల్ కార్పొరేషన్ సంయుక్తంగా నిర్వహించిన "సీల్వెల్ సేవా సమ్మేళనాలు %-% 77" కార్యక్రమం 2025లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఆక్టివ్ మీడియా విశిష్ట ప్రతిభా పురస్కారం 2025 ప్రదానం చేయబడింది.

ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ వివేక్ వెంకటస్వామి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన తన ప్రసంగంలో, "నిర్వాహకులు చేపట్టిన ఈ మంచి కార్యక్రమానికి నా ఆల్ ద బెస్ట్. ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడం వలన సమాజంలో మరిన్ని సృజనాత్మక, సామాజిక కార్యక్రమాలు వస్తాయని నమ్మకం వ్యక్తం చేస్తున్నాను" అని అన్నారు.

మంత్రివర్యులు, అక్కినేని నాగేశ్వరరావు గారు మరియు కేంద్ర మాజీ మంత్రి స్వర్గీయ వెంకటస్వామి గారి మధ్య ఉన్న ఆప్త అనుబంధాన్ని గుర్తుచేసారు. ఈ సందర్భంగా, ఆయన మాట్లాడుతూ "సామాజిక సేవలు చేయడంలో ఆప్త సంబంధాల యొక్క ప్రాముఖ్యత చాలా ఉందని" పేర్కొన్నారు. యువత ప్రతిభను వెలికితీసి, సమాజానికి ఉపయోగపడేలా చేయాలని పిలుపునిచ్చిన మంత్రివర్యులు, ప్రత్యేకంగా యువతకు తగిన ప్రోత్సాహాన్ని ఇవ్వడం, వారికి మార్గదర్శకత్వం కల్పించడం ద్వారా వారు సమాజానికి మంచి సేవలు అందించేలా ప్రేరేపించాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో మీడియా, కళారంగం, సేవారంగం వంటి విభాగాల్లో ప్రతిభ చూపిన పలువురు ప్రముఖులను సత్కరించారు. కొవిద ఆర్ట్స్ %చ% కల్చరల్ అకాడమీ, వీఎంఆర్ ఫౌండేషన్, సీల్వెల్ కార్పొరేషన్ వంటి సంస్థలు ఈ కార్యక్రమానికి సమర్థకులు మరియు భాగస్వాములు కావడంతో, ఈ వేడుక మరింత విజయవంతంగా సాగింది.

ఈ కార్యక్రమం, ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించడమే కాక, సమాజంలో వారి సేవల ద్వారా మరిన్ని సామాజిక మరియు సృజనాత్మక కార్యక్రమాలు జరుగుతాయని భావించే వేదికగా నిలిచింది.

- సామాజిక సేవలు, కళా రంగాలు, మీడియా రంగం

వంటి విభాగాలలో పనిచేస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడం ద్వారా, ఈ కార్యక్రమం సమాజంలోని సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఒక గొప్ప అవకాశం ఇస్తున్నట్లు వారు తెలిపారు.

- సంఘటనలో పాల్గొన్న సంస్థలు:

1. కొవిద ఆర్ట్స్ %చ% కల్చరల్ అకాడమీ
2. వీఎంఆర్ ఫౌండేషన్
3. సీల్వెల్ కార్పొరేషన్

ఈ సంస్థలు తమ వంతు సహకారాన్ని అందించి, కార్యక్రమాన్ని మరింత విజయవంతంగా రూపొందించడంలో కీలక పాత్ర పోషించాయి.

ఈ కార్యక్రమం, ప్రతిభ, సేవ, కళ మరియు మీడియా రంగాలలో విజయాలను సాధించిన వారిని గుర్తించి, వారి కృషిని సర్వసాధారణంగా ప్రేరేపించే ఒక గొప్ప వేదికగా నిలిచింది.

## ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం నిల్వలు ఉన్న దేశాలు ఇవే!భారత్ ఎక్కడుందో తెలిస్తే..

కరెన్సీ హెచ్చుతగ్గులు, ఆర్థిక సంక్షోభాల నుండి రక్షణగా పనిచేస్తూ, దేశ ఆర్థిక స్థిరత్వంలో బంగారు నిల్వలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిని కేంద్ర బ్యాంకులు నిర్వహిస్తాయి. విలువ నిల్వగా పనిచేస్తాయి. ఇది మంచి ద్రవ్య విధానాలకు దేశ నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ నిల్వలు కరెన్సీ స్థిరీకరణకు ఒక రూపంగా ఉపయోగపడతాయి. ఆర్థిక అనిశ్చితి సమయాల్లో భద్రతను అందించగలవు.%చాలా దేశాలు వివిధ కారణాల వల్ల బంగారు నిల్వలను పెంచుకుంటాయి. కరెన్సీ హెచ్చుతగ్గులు, ఆర్థిక సంక్షోభాల నుండి రక్షణగా పనిచేస్తూ, దేశ ఆర్థిక స్థిరత్వంలో బంగారు నిల్వలు కీలక పాత్ర పోషిస్తాయి. వీటిని కేంద్ర బ్యాంకులు నిర్వహిస్తాయి. విలువ నిల్వగా పనిచేస్తాయి. ఇది మంచి ద్రవ్య విధానాలకు దేశం నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ఈ నిల్వలు కరెన్సీ స్థిరీకరణకు ఒక రూపంగా ఉపయోగపడతాయి. ఆర్థిక అనిశ్చితి సమయాల్లో భద్రతను అందించగలవు. ఉదాహరణకు, యునైటెడ్ స్టేట్స్ 19వ శతాబ్దం చివరిలో గణనీయమైన బంగారు నిల్వలను సేకరించడం ప్రారంభించింది. 1934 గోల్డ్ రిజర్వ్ చట్టంతో బంగారు యాజమాన్యం ప్రైవేట్ వ్యక్తుల నుండి %ఖా% ట్రెజరీకి బదిలీ చేయబడింది. దీనితో దేశం నిల్వలు గణనీయంగా పెరిగాయి.వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ప్రకారం, యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా అతిపెద్ద బంగారు నిల్వలను కలిగి ఉంది. ఇది ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీల మొత్తం నిల్వలకు దాదాపు సమానం. బంగారం నిల్వలు అధికంగా ఉన్న దేశాలు తమ జాతీయ నిల్వలలో భాగంగా గణనీయమైన మొత్తంలో బంగారాన్ని కలిగి ఉన్నాయి. ఇది ప్రపంచ ఆర్థిక మార్కెట్లను ప్రభావితం చేస్తుంది.

అమెరికా.. బంగారం నిల్వలు అత్యధికంగా ఉన్న దేశాల జాబితాలో అమెరికా మొట్టమొదటి స్థానంలో ఉంది. 2025 రెండవ త్రైమాసికం నాటికి 8,133.46 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి.

జర్మనీ జర్మనీ , ప్రపంచంలోనే అత్యధిక నిల్వలు ఉన్న దేశాల జాబితాలో రెండో స్థానంలో ఉంది. 2025 సంవత్సరం రెండవ త్రైమాసికం నాటికి 3,350.25 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి.

ఇటలీబంగారం నిల్వల విషయంలో ఇటలీ చాలా ఏళ్లుగా మూడో స్థానంలో ఉంది. 2025 రెండో త్రైమాసికం నాటికి ఈ దేశంలో 2,451.84 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి.ఫ్రాన్స్‌ఈ ఏడాది రెండో త్రైమాసికం నాటికి 2,437 టన్నుల బంగారం నిల్వలతో ప్రపంచంలోనే నాలుగో స్థానంలో ఉంది.రష్యా 2025 ఏడాదిలో రెండో త్రైమాసికం నాటికి రష్యా దేశంలో 2,329.63 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి.భారత్ ఎన్నో స్థానంలో ఉందంటే?ప్రపంచ దేశాల్లో బంగారం నిల్వల విషయంలో చైనా ఆరో స్థానంలో ఉండగా, స్విట్జర్లాండ్ ఏడో స్థానంలో, మన భారతదేశం ఎనిమిదో స్థానంలో ఉంది. భారతదేశంలో 1,040 టన్నుల బంగారం నిల్వలు ఉన్నాయి.

# హెచ్-1బీపై ట్రంప్ పిడుగు.. భారత ఐటీ రంగానికి భారీ దెబ్బ.. మన టెక్కీలకు బ్రిటన్ రెడ్ కార్పెట్

**హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచిన ట్రంప్ ప్రభుత్వం**

**భారత ఐటీ రంగంపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణుల ఆందోళన**

**స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని అమెరికా కంపెనీలపై పెరుగుతున్న ఒత్తిడి**

**ప్రస్తుతం హెచ్-1బీ వీసాల్లో 71 శాతంతో భారతీయులే అగ్రస్థానం**

**ప్రతిభావంతులను ఆకర్షించేందుకు వీసా ఫీజు రద్దు యోచనలో బ్రిటన్**




అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న ఒకేఒక్క నిర్ణయం భారత ఐటీ రంగంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. అత్యంత కీలకమైన హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు (సుమారు రూ.83 లక్షలు) పెంచడం ఇప్పుడు సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. ఈ నిర్ణయం భారత ఐటీ నిపుణుల అమెరికా కలను ప్రశ్నార్థకం చేయనుందని ఆర్థికవేత్తలు హెచ్చరిస్తున్నారు.

భారత ఐటీ పరిశ్రమకు అమెరికా మార్కెట్ వెన్నెముక లాంటిది. మన దేశ మొత్తం ఐటీ వ్యాపారంలో 57 శాతం వాటా అమెరికాదే. గత ఏడాది జారీ అయిన హెచ్-1బీ వీసాలలో ఏకంగా 71 శాతం భారతీయులే దక్కించుకున్నారు. తాజా నిర్ణయంతో ఈ రంగంపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం పడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ట్రంప్ ప్రభుత్వ నిర్ణయంతో భారతీయుల అమెరికా కల మరింత సంక్లిష్టంగా మారిందని జెన్సార్ టెక్నాలజీస్ సీఈవో గణేష్ నటరాజన్ వంటి నిపుణులు అభిప్రాయపడుతున్నారు. మరోవైపు, యాపిల్, మైక్రోసాఫ్ట్, మెటా వంటి దిగ్గజ సంస్థలపై స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలంటూ వైట్‌హౌస్ ఒత్తిడి పెంచుతోంది.

అమెరికా ఇటువంటి కఠిన నిబంధనలు విధిస్తుండగా, బ్రిటన్ మాత్రం ఇందుకు పూర్తి భిన్నమైన మార్గంలో పయనిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యుత్తమ ప్రతిభావంతులను తమ దేశానికి ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రణాళికలు రచిస్తోంది. ప్రపంచంలోని అగ్రశ్రేణి సైన్స్, టెక్నాలజీ నిపుణుల కోసం వీసా ఫీజును పూర్తిగా రద్దు చేసే యోచనలో బ్రిటన్ ప్రభుత్వం ఉన్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇందుకోసం ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వంలో "గ్లోబల్ టాలెంట్ టాస్క్‌ఫోర్స్"ను కూడా ఏర్పాటు చేశారు. అమెరికా వర్క్ వీసా కార్యక్రమాలు, సాఫ్ట్ వేర్ ఔట్ సోర్సింగ్, వ్యాపార సేవలు తదితరాల రూపంలో భారత ఐటీ సెక్టార్ 283 బిలియన్ డాలర్ల(రూ.25 లక్షల కోట్లు) వ్యాపారం చేస్తోందని, తాజా పరిణామాలతో దీనిపై తీవ్ర ప్రభావం పడనుందని నిపుణులు తెలిపారు.

భారత టెక్కీలకు బ్రిటన్ ఆశాకిరణం!

ఒకవైపు అమెరికా హెచ్-1బీ వీసా ఫీజును భారీగా పెంచి షాక్ ఇస్తుంటే, మరోవైపు బ్రిటన్ ప్రతిభావంతులకు రెడ్ కార్పెట్ పరుస్తుండటం గమనార్హం. ఈ పరిణామాలతో భవిష్యత్తులో భారత ఐటీ నిపుణులు అమెరికాకు బదులుగా బ్రిటన్ వైపు చూసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

## నారాయణఖేడ్ పట్టణంలోని షాపింగ్ మాల్స్ యజమానులపై చర్యలు తీసుకోవాలి డిమాండ్







సత్య మేవ జయతే- నారాయణ ఖేడ్‌ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు అలిగే జీవన్‌నారాయణఖేడ్ పట్టణంలోని షాపింగ్ మాల్స్ యజమానులు పెద్ద పెద్ద బాక్సులు, డీజే సౌండ్స్,షాపింగ్ మాల్ దగ్గర పార్కింగ్ లేకపోవడం వల్లన రోడ్డు పైన పార్కింగ్ చేయడం తో బశ్వేశ్వర చౌక్ చాలా ట్రాఫిక్ జామ్ అవడం, వల్లన ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు అలిగే జీవన్ అన్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు తెలిపారు. ధ్వని కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. యజమానులు పెద్ద పెద్ద బాక్సులు, డీజే సౌండ్స్ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, మరియు పార్కింగ్, వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్పీఐ జిల్లా అధ్యక్షులు అలిగే జీవన్ అన్నారు. పోలీసులు, మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆయన ఆరోపించారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయాలు తెలిపారు.

## శబరిమల అభివృద్ధికి గుజరాత్ మలయాళీ నేత దినేష్ నాయర్ కీలక ప్రతిపాదనలు

తీర్థయాత్రికుల అనుభవాన్ని మరింత మెరుగుపరచేందుకు గుజరాత్‌లోని మలయాళీ సమాజానికి చెందిన ప్రముఖ నాయకుడు దినేష్ నాయర్ శబరిమల అభివృద్ధి కోసం కీలక ప్రతిపాదనలు చేశారు. ఆలయ సంప్రదాయాలను కాపాడుతూ సుస్థిర అభివృద్ధి అవసరాన్ని ముఖ్యంగా ప్రస్తావించారు. పూర్తి వివరాలు తెలుసుకుందాం పదండి ...

శబరిమలలో భక్తుల యాత్రను మరింత సౌకర్యవంతంగా, భద్రంగా మార్చేందుకు గుజరాత్‌లోని మలయాళీ సంఘానికి చెందిన ప్రముఖ నాయకుడు దినేష్ నాయర్ సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు చేశారు. లోక కేరళ సభ ప్రత్యేక ఆహ్వానితుడిగా, ప్రపంచ మలయాళీ కౌన్సిల్ గ్లోబల్ వైస్ ఛైర్మన్‌గా ఉన్న నాయర్.. శబరిమల ఆలయ సంప్రదాయాలను కాపాడుతూ సుస్థిర అభివృద్ధి చేపట్టాల్సిన అవసరాన్ని స్పష్టంగా తెలియజేశారు.

శబరిమల అభివృద్ధికి ఆరు కీలక రంగాల్లో ప్రతిపాదనలు:

1. రవాణా సదుపాయాల మెరుగుదల
కేఎస్ఆర్టీసీ ప్రత్యేక సేవలు
అంతర్రాష్ట్ర బస్సు సేవల విస్తరణ
భక్తుల సౌకర్యార్థం రోప్‌వే వ్యవస్థ ఏర్పాటు

2. భక్తుల సౌకర్యాలు %చ% మౌలిక సదుపాయాలు
పర్యావరణానికి హాని లేకుండా ఆశ్రయాలు, డార్మిటరీలు, విశ్రాంతి గృహాల ఏర్పాటు



పరిశుభ్రమైన మరుగుదొడ్లు, స్నానాల గదులు, త్రాగునీటి సదుపాయాలు
దర్శన టోకెన్ల కోసం డిజిటల్ బుకింగ్ సిస్టమ్
వృద్ధులు, వికలాంగ భక్తులకు ప్రత్యేక సహాయక సేవలు

3. ఆరోగ్యం భద్రత
శాశ్వత మల్టీ-స్పెషాలిటీ మెడికల్ సెంటర్ ఏర్పాటు
అత్యవసర విపత్తు నిర్వహణ విభాగం ఏర్పాటు
రక్తదానం, ఫస్ట్ ఎయిడ్ కోసం వాలంటీర్ నెట్‌వర్క్

4. పర్యావరణ పరిరక్షణ సుస్థిరత
కఠినమైన ప్లాస్టిక్ నిషేధం, ఘన వ్యర్థాల నిర్వహణ
గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని ప్రోత్సహించడం
అటవీ విస్తరణ, నది తీరాల సంరక్షణ

5. సాంస్కృతిక ఆధ్యాత్మిక ప్రచారం
శబరిమల భక్తుల సమాచార కేంద్రం
అంతర్జాతీయ అయ్యప్ప పరిశోధన సాంస్కృతిక సదస్సు ప్రతి సంవత్సరం నిర్వహణ
ప్రపంచవ్యాప్తంగా భక్తులను కలిపే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు

6. పరిపాలన %చ% గ్లోబల్ ఎంగేజ్‌మెంట్
గ్లోబల్ అయ్యప్ప ఫెలోషిప్ కార్యక్రమం
విదేశాల్లోని మలయాళీ సంఘాల భాగస్వామ్యం
నిధుల వినియోగం, అభివృద్ధి ప్రాజెక్టుల్లో పారదర్శకత, ప్రజా భాగస్వామ్యం

శబరిమల అభివృద్ధి కోసం చేసిన ఈ ప్రతిపాదనలు భక్తుల యాత్రను సౌకర్యవంతం చేయడంతో పాటు ఆలయ పవిత్రతను కాపాడాలని దినేష్ నాయర్ స్పష్టం చేశారు. ఈ డిమాండ్లను కేరళ ప్రభుత్వం, దేవస్వం బోర్డు పరిగణనలోకి తీసుకుని, శబరిమల యాత్రను మరింత సుస్థిరంగా, భక్తులకు అనుకూలంగా మార్చేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

# బాల్యం కోసం.. రోబోటిక్స్!








సాంకేతికత ముద్దుబిడ్డలు రోబోలు. రెస్టారెంట్, సినిమా థియేటర్, ఆఫీస్, ఫ్యాక్టరీ ప్రతిచోటా రోబోలదే రాజ్యం. సరిహద్దులలోనూ వాటిదే పహారా. సాంకేతిక రంగంలో వస్తున్న ఈ పెనుమార్పులను పదేండ్ల క్రితమే గుర్తించారు హైదరాబాద్‌కు చెందిన దేవులపల్లి ప్రసూన. 'టిక్స్ రోబోటిక్స్' అనే సంస్థను స్థాపించి బాల్యానికి సాంకేతిక శిక్షణ అందిస్తున్నారు.

సాంకేతికత ముద్దుబిడ్డలు రోబోలు. రెస్టారెంట్, సినిమా థియేటర్, ఆఫీస్, ఫ్యాక్టరీ ప్రతిచోటా రోబోలదే రాజ్యం. సరిహద్దులలోనూ వాటిదే పహారా. సాంకేతిక రంగంలో వస్తున్న ఈ పెనుమార్పులను పదేండ్ల క్రితమే గుర్తించారు హైదరాబాద్‌కు చెందిన దేవులపల్లి ప్రసూన. 'టిక్స్ రోబోటిక్స్' అనే సంస్థను స్థాపించి బాల్యానికి సాంకేతిక శిక్షణ అందిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులనూ రోబో విద్యలో రాటుదేలుస్తున్నారు.

**ఆ అనుభవాలు ఆమె మాటల్లోనే..**

మాది హనుమకొండ. కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి మైక్రో బయాలజీలో పీజీ చేశాను. పెండ్లి తర్వాత మా ఆయన రవికుమార్ అమెరికా వెళ్లారు. ఆయనతోపాటు నేనూ బయల్దేరాను. నాలుగేండ్లపాటు అక్కడే ఉన్నాం. మా పిల్లలు.. సుహాస్, ఆర్ణవ్ చదువుకుంటున్న స్కూల్‌లోనే వలంటీర్‌గా చేశాను. అక్కడి విద్యార్థులు రోబోటిక్స్‌లో చాలా ముందుంటారు. ఆ స్థాయి పరిజ్ఞానాన్ని మన పిల్లలకూ అందించాలనిపించింది. స్వదేశంపై మమకారంతో 2011లో భారత్ తిరిగొచ్చేశాం. హైదరాబాద్‌లోని మియాపూర్‌లో ఉంటున్నాం. అమెరికా నుంచి వస్తూ ఓ రోబో తీసుకొచ్చాను. రోబోటిక్స్ నిపుణుల సహకారంతో ఏడాదిపాటు రోబోల పనితీరు అధ్యయనం చేశాను. నా పిల్లలకు రోబోటిక్స్‌పై అవగాహన కలిగించేందుకు మంచి సంస్థల కోసం చాలా ప్రయత్నించాను. ఎక్కడా కనిపించలేదు. దీంతో ఆ బాధ్యత నేనే తీసుకున్నాను. వాళ్లకు గురువుగా మారాను. కొద్దిరోజులకే ఆ శాస్త్రం మీద వాళ్లు పూర్తి పట్టు సాధించారు. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటారు. ఓ ఎగ్జిబిషన్‌లో ఐటీ మంత్రి కేటీఆర్ కూడా నన్ను ప్రశంసించారు. రోబోటిక్స్‌ను పదిమందికీ చేరువ చేయమని ప్రోత్సహించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో 2016లో 'టిక్స్ రోబోటిక్స్' పేరుతో శిక్షణ సంస్థను ప్రారంభించాను.

**ఇరవై వేలమందికి పైగా..**

ప్రతి చిన్నారిలో నిగూఢంగా ఉన్న ప్రతిభను వెలికితీసి.. రోబోటిక్స్‌పై లోతైన పరిజ్ఞానాన్ని పెంపొందించడమే మా సంస్థ లక్ష్యం. ఇందులో భాగంగా వినూత్నమైన రోబోలకు ప్రాణం పోశాం. ఇక్కడ రూపుదిద్దుకున్న ప్రతి రోబో ప్రత్యేకమైందే. ఆరేండ్లు పైబడిన ఎవరైనా మా దగ్గర శిక్షణ తీసుకోవచ్చు. సొంతంగా రోబోలను ఆవిష్కరించవచ్చు.

ఈ ఏడేండ్లలో 20వేల మందికిపైగా శిక్షణ ఇచ్చాం. స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లోనూ రోబోటిక్స్‌పై అవగాహన పెంచుతున్నాం. వివిధ పోటీల కోసం పిల్లలతో ఇప్పటివరకూ రెండొందలకు పైగా రోబోలను తయారు చేయించాం. 'టిక్స్ రోబోటిక్స్'లో శిక్షణ పొందిన ఎంతోమంది పిల్లలు అంతర్జాతీయ వేదికలపై ప్రతిభ చూపుతున్నారు. అమెరికా, యూకే తదితర దేశాలలో శిక్షణ తీసుకున్న వారితో పోటీపడి మరీ, మనవాళ్లు గెలవడం సంతోషంగా అనిపిస్తున్నది. కార్పొరేట్ స్కూళ్ల పిల్లలను వెనక్కి నెట్టి మియాపూర్, మదీనాగూడ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారు. ఇది ఎంతో మంచి పరిణామం. ఈ మార్పు గ్రామాల వరకూ విస్తరించాలి. పల్లెలు సైతం రోబోలను ఆవిష్కరించే రోజు రావాలి.

**వీహబ్ మద్దతు ..**

మా ప్రయత్నానికి వీహబ్ పూర్తి మద్దతు పలికింది. నెట్‌వర్కింగ్, మెంటర్‌షిప్ నా వ్యాపార విస్తరణకు దోహదపడ్డాయి. అనేక ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలలో సెమినార్‌లు నిర్వహించే అవకాశాలనూ కల్పించింది. ఇక్కడితో ఆగకుండా.. విదేశాలకు విస్తరించాలన్నది నా సంకల్పం. మహిళ కెరీర్‌ను, కుటుంబ బాధ్యతలను వేరువేరుగా చూడాలి. రెండిటికీ సమన్యాయం చేయాలి. ఇదే నా సలహా.

# రామ్మా చిలుకమ్మా..





చిలుక పలుకులు, అతివ కులుకులు.. దేనికదే ముచ్చటగా ఉంటాయి. ఆ చిలుకమ్మ అందాలను కలికి ఆభరణాలుగా మారుస్తున్నారు నేటి డిజైనర్లు. అందుకు తగ్గట్టు అమ్మాయిలు కూడా.. రామ్మా చిలుకమ్మా అంటూ ఆ నగల పట్ల ప్రేమ మొలకల్ని మొలిపిస్తున్నారు. చిలుక పలుకులు, అతివ కులుకులు.. దేనికదే ముచ్చటగా ఉంటాయి. ఆ చిలుకమ్మ అందాలను కలికి ఆభరణాలుగా మారుస్తున్నారు నేటి డిజైనర్లు. అందుకు తగ్గట్టు అమ్మాయిలు కూడా.. రామ్మా చిలుకమ్మా అంటూ ఆ నగల పట్ల ప్రేమ మొలకల్ని మొలిపిస్తున్నారు. అంతేకాదు, చిటారుకొమ్మన గుసగుసలాడే గువ్వల జంటలు, చిగురుటాకుల మీద సందడి చేసే చిట్టిపిట్టలు.. ఇప్పుడు సొమ్ముల్లో అమరిపోతున్నాయి. 'బర్డ్ ఇన్‌స్పైర్డ్ జువెలరీ' రామచిలుకంత రమ్యంగా అగుపిస్తున్నాయి.చిలుక జోస్యం.. రేపటిని తెలిపే ఓ నమ్మిక. చిలుక కొరికిన జాంపండు.. ఇష్టమైన వారికి తియ్యని కానుక. ఇక, చిలుకమ్మ నగలు కలికి చిలుకల కొలికికి అందమైన జోడీ. అతివ ముస్తాబులో ఇన్నాళ్లూ అగ్రతాంబూలం అందుకున్న నెమలి సొగసుల్ని తోసిరాజని, చిలుకలూ, గువ్వలూ ఆమె కంఠసీమలో కువకువలాడు తున్నాయి. నాజూకు వేళ్లమీద నాట్యమాడుతున్నాయి. కర్ణాభరణాలుగా కనువిందు చేస్తున్నాయి. రంగురంగుల పక్షిరాజ్యానికి ఇప్పుడామె రారాణి. పంచవన్నెల చిలుకలన్నీ ఆమె చెలికత్తెలు. వాటి చిన్నెలన్నీ చిత్రికబట్టి ఆమెను అలంకరించే పనిలో డిజైనర్లు మునిగిపోయారు.'ప్యారట్ జువెలరీ', 'బర్డ్ ఇన్‌స్పైర్డ్ జువెలరీ' పేరిట వస్తున్న ఆభరణాలన్నీ అలా ఆమె కోసం ఆవిష్కరించినవే. ఈ తరహా నగల్లో నెక్లెస్‌లు, గొలుసులు మొదలు చెవిదుద్దులు, లాకెట్లు, ఉంగరాలు, బ్రూచ్‌లు.. ఇలా ఎన్నో రకాలు ఉంటున్నాయి. బంగారంతో చేసినవీ, వజ్రాలు పొదిగిన వాటితో పాటు రంగురంగుల ఎనామిల్‌తో రూపొందించిన ఫ్యాన్సీ నగలూ, స్వరోవ్‌స్కీలాంటి విల ౹వైన రాళ్లతో చేసిన ముచ్చటైన సొమ్ములూ తయారవుతున్నాయి. నల్లపూసల్లోనూ విహంగాల సోకు విందుచేస్తున్నది. మొత్తానికి చిటారు కొమ్మన చిలుకమ్మా అమ్మాయి నగలో కులుకమ్మా అన్న చందంగా అందాల నగలు ముస్తాబవుతున్నాయి.



# సాహసమే ఆమె పంథా..

%మహిళలు సైన్యంలో తమను తాము నిరూపించుకునే అవకాశాలను దాదాపు పదేళ్ల న్యాయపోరాటం తర్వాత దక్కించుకున్నారు. ఇటీవల సుప్రీంకోర్టు మహిళలకు పర్మినెంట్ కమిషన్ పొందే అవకాశం కల్పించాలని చరిత్రాత్మక తీర్పును వెలువరించింది. మహిళా అధికారులకు అనుకూలంగా ఈ తీర్పు రావడం వెనుక ఒక ప్రతిభావంతురాలి కృషి ఉంది. ఆమే ఐశ్వర్యా భాటి. న్యాయవిద్యలో బంగారు పతక గ్రహీత కూడా.. న్యాయస్థానంలో మరో లాయర్ మీనాక్షి లేఖితో కలిసి ఆమె ఈ కేసును వాదించారు. తాజాగా వచ్చిన తీర్పుతో మహిళలు ఆయా విభాగాల్లో కమాండ్ హోదా పొందేందుకు పోటీపడే అవకాశం కూడా లభించింది. దాదాపు 2003 నుంచి మొదలైన ఈ న్యాయపోరాటంలో మహిళలు ఎక్కడా తగ్గలేదు. ఫలితంగా వారు సైన్యంలో శాశ్వత ఉద్యోగాలు పొందేందుకు అవకాశం లభించింది. ఒకప్పుడు షార్ట్ సర్వీస్ కమిషన్ ద్వారా 14 సంవత్సరాలు ఉద్యోగం చేసి సైన్యం నుంచి బయటకు వచ్చాక మరో ఉద్యోగం కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉండేది. కానీ తాజాగా వచ్చిన తీరు అమలైతే పర్మినెంట్ కమిషన్ మానసికంగా, శారీరకంగా సిద్ధమై అవకాశాలను అందిపుచ్చుకుని శాశ్వత ఉద్యోగం పొందవచ్చు. మహిళా అధికారుల తరఫున ఆమె వాదనలో దిట్ట..సంప్రదాయ రాజ్‌పుత్ కుటుంబానికి చెందిన ఐశ్వర్యకు వివాహం తర్వాత కూడా అత్తింటి నుంచి ప్రోత్సాహం లభించింది. దీంతో ఆమె ఇద్దరు పిల్లల ఆలనాపాలనా చూసుకుంటూనే ప్రాక్టీస్ కొనసాగిస్తోంది. ఇరవై సంవత్సరాల న్యాయవాద వృత్తిలో ఆమె 'ఆధార్ చట్టబద్ధత', వాయుసేనలో మహిళలకు సమానహక్కులు వంటి ప్రతిష్టాత్మక కేసులను వాదించింది.లక్ష్యశుద్ధి ఉంటేనే.. గమ్యాన్ని చేరుకోగలం.. ఎగరడానికి రెక్కలు ఒక్కటే సరిపోవు.. తగిన సాహసం కూడా ఉండాలి.. అని ప్రముఖ న్యాయవాది ఐశ్వర్యా భాటి సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించిన తరువాత చెప్పిన మాటలు. ఆమె పేరు సుప్రీం కోర్టులో తరచూ మార్మోగిపోతుంటుంది.



న్యాయవాద వృత్తిలో మహిళలు పెద్దగా రాణించలేరని ఎవరైనా అనుకుంటే గనుక ఈమె వాదించేటప్పుడు చూస్తే ఆ అపోహలు పటాపంచలైపోతాయి.

భాటి మాటల్లోనే ఆత్మవిశ్వాసం తొణికసలాడుతుంది. నిర్మాణాత్మకంగా ఆమె వాదనలకు ఎవరైనా ఫిదా అయిపోతారు. అంతర్జాతీయ న్యాయస్థానంలో కులభూషణ్ జాదవ్ కేసు వాదించే ప్యానల్‌లో కూడా భాటి సభ్యురాలు. సైనిక దళాల ప్రత్యేక అధికారాల చట్టంపై అభ్యంతరం చెబుతూ దాఖలైన కేసులోనూ దళాల తరఫున ఆమే వాదించారు. తాజాగా మహిళా ఎన్ఎస్‌సీ అధికారులకు పర్మినెంట్ కమిషన్ ఇవ్వాలంటే ఢిల్లీ హైకోర్టు 2010లో ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై మహిళా అధికారులకు అనుకూలంగా వాదించారు. ఈ కేసులో మహిళా అధికారులకు అనుకూలంగా సుప్రీం తీర్పు వెలువరించింది. దీంతో సైనిక దళాల్లో నిర్దేశించిన విభాగాల్లో 'కమాండ్ హోదా' పోస్టుల్లో నియామకానికి వీలు కల్పించడం వల్ల పురుష అధికారుల తరహాలో మహిళా అధికారులూ కంపెనీ, బెటాలియన్ వంటి విభాగాలకు నాయకత్వం వహించడానికి వీలవుతుంది.

ఐశ్వర్య చిన్న వయస్సుల్లోనే మంచి పేరు తెచ్చుకున్నారు. జోధ్‌పూర్‌లో ఓ న్యాయవాదుల కుటుంబంలో జన్మించింది ఐశ్వర్య. తండ్రి సుప్రీంకోర్టులో న్యాయవాది. ఆమె సోదరుడు పుష్పేందర్ సింగ్ రాజస్థాన్ హైకోర్టులో న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. దీంతో ఐశ్వర్య కూడా న్యాయవిద్య వైపే మళ్లారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంలో క్యాంపస్ లా సెంటర్ నిర్వహించిన 'ఆల్ ఇండియా మూట్ కోర్ట్' పోటీలో 'బెస్ట్ స్టూడెంట్ అడ్వకేట్'గా నిలిచింది ఐశ్వర్య. జై నారాని వ్యాస్ విశ్వవిద్యాలయంలో న్యాయవిద్యలో బంగారు పతకం సాధించింది. 1999లో ఢిల్లీ హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించింది.గతేడాది మార్చిలో సుప్రీంకోర్టు ఈమెను సీనియర్ అడ్వకేట్‌గా ప్రమోట్ చేసింది. రాజస్థాన్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి మహిళ ఈమే కావడం విశేషం. అప్పటికే 2017 నుంచి ఉత్తరప్రదేశ్ అడ్వకేట్ జనరల్‌గా పనిచేస్తున్నారు. అంతేకాదు సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ సెక్రటరీగా కూడా రెండు పర్యాయాలు పనిచేసింది. 'న్యాయవాద వృత్తిలో విజయాన్ని ఎప్పుడూ డబ్బుతో కొలవకూడదు. ప్రజల జీవితాల్లో వారు తెచ్చిన మార్పుతో కొలవాలి' అని చెబుతోంది ఐశ్వర్య.

# పోలీస్ టైలర్స్!




రండి.. వచ్చి చూడండి. చూసి నేర్చుకోండి. కత్తిరించడం కష్టం కాదు. నేర్చుకుంటే రానిది లేదు. కుట్టు మెషీన్ మీద కాలు పెట్టండి. మీ కాళ్ల మీద మీరు నిలబడండి. పైసలు సంపాదించండి. పదింతలు సంతోషంగా జీవించండి.. అంటూ పేదింటి ఆడబిడ్డల్ని ఆహ్వానిస్తున్నారు రాచకొండ పోలీసులు. పోలీస్ స్టేషన్ ఆవరణలో కుట్టుపని నేర్పుతున్నారు.చదువు లేదు. పని నైపుణ్యం తెలియదు. ఇంట్లో ప్రోత్సాహం అంతంతమాత్రమే. స్థానికంగా అవకాశాలూ లేవు. ఇలాంటి పరిస్థితుల్లో నాలుగు గోడల మధ్య బతుకీడ్చే మహిళల జీవితాల్ని అధ్యయనం చేయడానికి రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ (ఆర్‌కేఎస్‌కే) సభ్యులు పహాడీషరీఫ్, బాలాపూర్‌లో ఇల్లిల్లూ తిరిగారు. సర్వే చేశారు. సలీమా (షీ టీమ్స్ డీసీపీ), లతా రామసుబ్రహ్మణ్యం (ఇన్ఫోసిస్), పోలీసు అధికారులు నిఖత్, సావిత్రి, వలంటీర్లు జయప్రకాశ్ రాజు, నందిత, కమల్, అమిత్ మరికొందరు ఆ గణాంకాలను విశ్లేషించారు. ఫలితాలు హృదయాలను కదిలించేలా ఉన్నాయి. దాదాపు 1200 కుటుంబాల్లో దారిద్ర్యం తాండవిస్తున్నది. ఏ ఇంటికి వెళ్లినా నలుగురు, అయిదుగురు పిల్లలు. సంపాదించేది మాత్రం ఒక్కరే. చిన్న గదిలో గంపెడు కుటుంబం. ఆ పేదింటిలో మగ్గే తల్లులకు ఉపాధి చూపిస్తామని రాచకొండ సెక్యూరిటీ కౌన్సిల్ భరోసా ఇచ్చింది.

**సంకల్పానికి పరీక్ష**

ఒక అడుగు ముందుకుపడింది. మరో అడుగు ముందుకేస్తే వాళ్ల జీవితాలూ వేగంగా మారిపోతాయని (అప్పటి) రాచకొండ పోలీస్ కమిషనర్ మహేశ్ భగవత్ భావించారు. అందుకు అవసరమైన బడ్జెట్ కేటాయించారు. అమలు బాధ్యత సలీమా (డీసీపీ, షీటీమ్స్), కరుణాకర్ రెడ్డి (షీ టీమ్స్, ఎస్ఐ)కి అప్పగించారు. పహాడీ షరీఫ్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రేకుల షెడ్డు వెలిసింది. అందులో పది కుట్టు మెషీన్లు, కుర్చీలు, లైట్లు, ఫ్యాన్లతో 'ఉమెన్ ఎంపవరింగ్ రూరల్ యాస్పిరెంట్స్ (షీఎరా)' కుట్టుపని శిక్షణ కేంద్రం సిద్ధమైంది. 4 అక్టోబరు 2022న శిక్షణ మొదలైంది. కుట్టుపని నేర్చుకునేందుకు 36 మంది వచ్చారు. కానీ ఎవరు బోధిస్తారు? శిక్షణ కోసం ఇద్దరు ఇన్‌స్ట్రక్టర్లను నియమించారు. 'నాలుగు రోజుల్లోనే ఒక రకం దుస్తులు కుట్టడం నేర్పిస్తాం' అని చెబుతారు ఇన్‌స్ట్రక్టర్ అమీనా బేగం.'మొదటి రెండు రోజులు మార్కింగ్ నేర్పిస్తాం. తర్వాత కత్తిరించడం ప్రాక్టీస్ చేయిస్తాం. ఇక కుట్టడం అనేది మెషీన్ తొక్కినంత సులభం! చక్రం ఎంత స్పీడ్‌గా తిరిగితే డ్రెస్ అంత తొందరగా రెడీ అయిపోతుంది! ఆ తర్వాత మరో డ్రెస్ కోసం మార్కింగ్ నేర్పిస్తాం. ఇలా కుర్తా, పైజమా, పటియాలా, అంబ్రెల్లా టాప్, జాకెట్లు, పరికిణీలు, గౌన్లు, ఫ్రాక్‌లు కుట్టడం అలవాటు చేస్తాం. చివర్లో డీఆర్‌డీఏ అధికారులు టైలరింగ్ టెస్ట్ పెట్టారు. అందరూ పాసయ్యారు!' అని మొదటి బ్యాచ్ ముచ్చట్లు చెప్పారు అమీనా బేగం. ఉత్తీర్ణులకు సర్టిఫికెట్‌తోపాటు ప్రభుత్వమే ఉచితంగా కుట్టు మెషీన్లు ఇచ్చింది! వాళ్లంతా ఇప్పుడు ఇంటి దగ్గరే నాలుగు రూపాయలు వెనకేసుకుంటున్నారు.

**చిన్న కుటుంబం..**

కుట్టుపని శిక్షణ కోసం వచ్చే యువతుల కుటుంబాల్లో.. ఆటోడ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, పెయింటర్లుగా పనిచేస్తున్నవారే ఎక్కువ. కొంతమంది వీధి వ్యాపారులూ ఉన్నారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న 16 మందిలో అఫ్రీన్ బేగం ఒకరు. ఆమె పహాడీ షరీఫ్‌లో ఉంటున్నది. పదో తరగతి పాసైంది. పెళ్లి తర్వాత చదువు ఆగిపోయింది. భర్త సంపాదన కుటుంబ ఖర్చులు, పిల్లల స్కూల్ ఫీజులకే సరిపోతుంది. ఇరుకిరుకు గదిలో ఉంటున్నారు. ఇంటి దగ్గరే టైలరింగ్ పని చేసుకోవడానికి వాళ్లాయన ఒప్పుకొన్నాడు. క్లాసులకూ పంపిస్తున్నాడు. ఇప్పుడామె సంతోషానికి హద్దుల్లేవ్! 'మా బంధువుల్లో ఆడవాళ్లెవరూ సంపాదనా పరులు కాదు. నాతోనే మొదలు. నేను కూడా సంపాదిస్తాను కాబట్టి పిల్లల్ని బాగా చదివించు కుంటా. మంచి ఇల్లు కట్టుకుంటా. నన్ను చూసి మా ఆడబిడ్డ కూడా నేర్చుకోవాలనుకుంటున్నది.

వచ్చే బ్యాచ్‌లో చేరతానని చెప్పింది. మా పిల్లకు టైలర్ పని వచ్చని మా అమ్మ అందరితో సంతోషంగా చెప్పుకొంటున్నది. రేపు నా పిల్లలు కూడా అంతే సంతోషంగా ఉంటారు' అంటూ అఫ్రీన్ బేగం మురిసిపోతున్నది! ఆడవాళ్లూ పని చేస్తే వేడినీళ్లకు చన్నీళ్లు తోడైనట్టు పేదింటి కష్టాలు తీరిపోతాయని మగవాళ్లూ ప్రోత్సహిస్తున్నారు. కారు చీకట్లలో కాంతి రేఖలాంటి 'షీ ఎరా' ప్రభావం మొదలైంది! వేయి మైళ్ల ప్రయాణమైనా ఒక్క అడుగుతో మొదలవుతుందన్నట్టు.. నస్రీన్ బేగం గడప దాటి కుట్టు మెషీన్ మీద కాలుపెట్టింది. 'కుట్టు పని నేర్చుకున్న తర్వాత.. మళ్లీ కాలేజీకి వెళ్తాను. బాగా చదువుకుని డాక్టర్ అవుతా' అంటున్నది. ఇక్కడికి వచ్చినప్పటి నుంచీ జీవితంలో ఎదగాలనిపించిందట. పది పాస్ అయింది. ఆమె అన్నయ్య ఈ మధ్యే దుబాయ్ నుంచి వచ్చాడు. తన సాయంతో కాలేజీకి వెళ్లి చదువుకుంటానని నస్రీన్ చెప్పింది. తొలి బ్యాచ్ కొన్ని జీవితాలను మార్చింది, రెండో బ్యాచ్ కూడా అనేక జీవితాల్లో వెలుగులు నింపింది. ఇక మూడో బ్యాచ్ వంతు. కుట్టుపని, పట్టుదల.. రెండూ ఉంటే ఇక తిరుగేముంది. ఆర్థిక విజయం దిశగా తొలి అడుగే.

# కృష్ణవేణి తీరంలో పవిత్ర క్షేత్రాలు



**పుష్కరాల సమయంలో కృష్ణలో స్నానాదులు, పూజలు, దానధర్మాలు, పితృ దేవతలకు పిండప్రదానాలు, జపాలు చేస్తే పుణ్య ఫలాలు సంప్రాప్తిసాయని పురాణాలు చెబుతున్నాయి. పుష్కరాలలో నదీ స్నానం చేస్తే పన్నెండు సంవత్సరాలపాటు ఆ నదులలో నిత్యం స్నానం చేసినంత పుణ్య ఫలం లభిస్తుందంటారు. అలాగే జన్మజన్మల పాపాలూ నశించి, మోక్షప్రాప్తి కలుగుతుంది. ఏ నదికి పుష్కరాలు వస్తాయో ఆ నదిపేరును మనం స్నానం చేసేటప్పుడు ముమ్మారు మనస్సులో తలచుకున్నా కొంతమేర పుష్కర స్నానఫలితం పొందచ్చునని శాస్త్రవచనం.**

పుష్కర కాలంలో చేసే ఆయా కర్మల వలన శారీరక, మానసిక మలినాలు తొలగి పవిత్రత, ఆధ్యాత్మిక తేజస్సు కలుగుతాయి. బంగారం, వెండి, భూమి, ధనం, గోవులు, ధాన్యం, లవణం, రత్నాలు, అశ్వం, పండ్లు, బెల్లం, వస్త్రాలు, తైలం, కూరగాయలు, తేనె, పీట, అన్నం, పుస్తకం %గా% ఇలా ఎవరి శక్తిని బట్టి వారు ఈ పుష్కర సమయంలో దానం చేస్తే పుణ్య ఫలాలు సిద్ధిస్తాయంటారు.మహారాష్ట్రలోని సహ్యాద్రి పర్వతశ్రేణిలో మహాబలేశ్వరం వద్ద ఉద్భవించిన కృష్ణా నది మహాబలేశ్వర లింగం పైనుంచి ప్రవహించి నదిగా మారింది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల గుండా ప్రవహించి ఆంధ్రప్రదేశ్‌లోని హంసలదీవి మీదుగా ఏటిమొగ, ఎదురుమొండి వద్ద బంగాళాఖాతంలో కలుస్తోంది. తుంగభద్ర, వేణి, మూసీ, దిండి, పాలేరు, మున్నేరు దీనికి ఉప నదులు. వీటిలో తుంగభద్ర, మూసీ నదులు ఇతర జీవ నదులకు మల్లే ప్రఖ్యాతి చెందాయి. కృష్ణానది పుష్కర కాలంలో ఆయా నదిలో స్నానాదికాలు, జప, తపాలతో పాటు ఆయా నదికి సమీపంలో ఉన్న ఆలయాల సందర్శనం ఆధ్యాత్మికానందాన్ని సొంతం చేయడంతో పాటు, మానసికానందన్నిచ్చి, పుణ్య ఫలాలు సొంతమవుతాయని పెద్దలు చెబుతారు. ఆకారణంగా నదికి సమీపంలోనూ, నది ఒడ్డున ఉన్న ఆలయాల సందర్శనం సర్వ విధాల మేలు చేస్తుందని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. మహారాష్ట్ర నుంచి కర్ణాటక లోకి ప్రవేశించిన కృష్ణా నది మహబూబ్ నగర్ జిల్లాకు సమీపంలో మక్తల్ మండలంలో తెలంగాణలోకి ప్రవేశిస్తుంది.

### దత్తాత్రేయ స్వామి దేవాలయం వల్లభాపురం(మక్తల్ )

మహబూబ్ నగర్ జిల్లా మక్తల్ మండల కేంద్రంలో గల వల్లభాపురం గ్రామంలో వెలసిన మహిమాన్వితమైన దత్తాత్రేయ క్షేత్రం శ్రీపాద శ్రీవల్లభ స్వామి దేవాలయం . దత్తాత్రేయ స్వామి మొదటి అవతారమైన శ్రీపాద శ్రీవల్లభ స్వామి వెలసిన క్షేత్రమిది. శ్రీపాద శ్రీవల్లభ స్వామి జన్మ స్థలం పిఠాపురం అయితే తన తపస్సు, ధ్యానం అన్ని కురవాపురం లోనే జరిగాయని పురాణాల ద్వారా అవగతమవుతోంది. వల్లభాపురం తెలంగాణా, కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న మహిమాన్విత దత్త క్షేత్రం. కృష్ణా నదికి ఇవతలి వైపు వల్లభాపురం ఉండగా, అవతలి వైపు కురువాపురం ఉంటుంది.

కృష్ణా నది సమీపంలో వెలసిన మహిమాన్విత దత్త పీఠమిది. శ్రీపాద శ్రీవల్లభ స్వామి దేశమంతా తిరుగుతూ, ఈ క్షేత్రానికి వచ్చి కొన్ని రోజులు ఇక్కడ నివాసముండి భక్తుల కష్టాలు తీర్చాడట. కష్టాలు, కలతలతో బాధపడేవారు, దుష్ట శక్తుల బారి నించి విముక్తి కోరుకునేవారు ఇక్కడ స్వామిని పూజిస్తే కోరికలు నెరవేరుతాయని స్థల పురాణం చెబుతోంది.

కురుపురం, కురువాపురం, కురుంగడ్డ తదితర పేర్లతో పిలుచుకునే శ్రీపాద శ్రీవల్లభ క్షేత్రం తెలంగాణ కర్ణాటక సరిహద్దులో ఉంది. మక్తల్ నుంచి అనుగొండ వెళ్ళే బస్సులో పంచదేవ్ పహాడ్ గ్రామాన్ని చేరుకుని అక్కడ నుంచి సమీపంలోనే ఉన్న కురుపురం చేరుకోవచ్చు. కురుపురం ఒక ద్వీపంలో ఉంది. చుట్టూ కృష్ణా నది. ఈ నది దాటితే స్వామి వారి ఆలయం ఉంది. శ్రీపాద శ్రీవల్లభులు చాలా సంవత్సరాలు కురుపురంలో తపస్సు చేశారు. శ్రీపాద శ్రీ వల్లభ స్వామి తపస్సు చేసిన ఈ ప్రాంతంలో ఒక చిన్న ఆలయం ఉంది. సమీపంలోనే వాసుదేవానంద సరస్వతి స్వామి వారు తపస్సు చేసిన గుహ, శివాలయం దర్శించుకోవచ్చు. కురు మహారాజుకు జ్ఞాన సిద్ది కలిగిన ప్రదేశం కాబట్టి కురుపురమనే పేరు వచ్చింది. దీనికి సమీపంలోనే పంచదేవ పహాడ్ ఉంది. మక్తల్ మండలంలో ఉన్న ఈ క్షేత్రంలో పాండురంగ స్వామి, శ్రీలక్ష్మీనరసింహ స్వామి, ఆంజనేయ స్వామి, రాఘవేంద్ర స్వామి, వినాయకునితో పాటు అనఘ దత్త దేవాలయాలు ఒకే చోట దర్శనమిస్తాయి.

### ఆంజనేయ స్వామి ఆలయం, బీచుపల్లి

మహబూబ్ నగర్ జిల్లా ఇటిక్యాల మండలం కృష్ణా నది ఒడ్డున బీచుపల్లి గ్రామంలో వెలసిన మహిమాన్విత ఆలయమిది. పదహారవ శతాబ్దానికి చెందిన ఈ ఆలయం, తొమ్మిదవ శతాబ్దానికి చెందిన చోళ రాజ్యంలో ప్రాచుర్యం పొందిందని ఇక్కడి చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. ఇక్కడ స్వామిని బీచుపల్లిరాయుడని భక్తులు భక్తితో పిలుచుకుంటారు. ఇక్కడ ఈ ఆలయంలో స్వామివారి మొదటి పూజను బోయవారు చేయడం ఈ ఆలయం విశేషంగా చెబుతారు. స్వామి వారి ఆదేశం మేరకు ఈ సంప్రదాయం ఇలా కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతోంది. ఇక్కడ స్వామివారిని వ్యాస రాయల వారు ప్రతిష్ఠించినట్లు ఇక్కడి స్థల పురాణాలు చెబుతున్నాయి. అలాగే రెండు శతాబ్దాల క్రితం గద్వాల రాజులు ఈ ఆలయాన్ని పునర్నిర్మించినట్లు చారిత్రక ఆధారాల ద్వారా అవగతమవుతోంది. గర్భాలయంలో స్వామివారి మూర్తితోపాటు ఎడమ వైపున మహేశ్వర లింగం, కుడివైపున సీతా లక్ష్మణ సహిత శ్రీరాముడు కొలువుదీరి ఉన్నారు.

### సోమేశ్వర స్వామి ఆలయం, సోమశిల:

మహబూబ్ నగర్ జిల్లా కొల్లాపూర్ గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న సోమశిలలో సోమేశ్వర స్వామి ఆలయం ఉంది. ప్రశాంతమైన వాతావరణం, ప్రకృతి అందాల నేపథ్యంగా అలరారుతున్న ఈ దివ్యాలయం ప్రాంగణంలోని కృష్ణా నదిలో పుష్కర స్నానాదికాలు చేస్తే విశేష పుణ్యఫలాలు సొంతమవుతాయని భక్తులు ప్రగాఢంగా నమ్ముతారు. సోమశిలలోని శ్రీలలితా సోమేశ్వర స్వామి దేవాలయాన్ని ఏడవ శతాబ్దంలో నిర్మించినట్లు చెబుతారు. శ్రీశైలం ప్రాజెక్టు వల్ల ఈ ఆలయం నదిలో మునిగిపోకుండా గట్టున ఆలయాన్ని తిరిగి పునర్నిర్మించారు. ఈ ఆలయం పదిహేను ఆలయాల సముదాయంగా విరాజిల్లుతోంది. జ్యోతిర్లింగాలుగా ప్రసిద్ధమైన ద్వాదశ లింగాల ప్రతిరూపాలను ఒకే చోట ఆలయంలో ప్రతిష్టించారు. ఈ ఆలయాలలోని అన్ని గర్భగుడుల లలాట బింబంగా గజలక్ష్మి ఉండడం ఈ ఆలయ విశేషంగా చెబుతారు. ఆలయం ముందు భాగంలో రెండు శాసనాలున్నాయి. కళ్యాణి చాళుక్య చక్రవర్తి త్రైలోక్య మల్ల ఒకటవ సోమేశ్వరుని పాలన కాలంలో, కాకతీయ మహారాజు రెండో ప్రతాప రుద్రుని కాలంలోనూ ఈ శాసనాలు వేసినట్లు ఇక్కడి ఆధారాల ద్వారా అవగతమవుతోంది.









### అలంపురం ఆలయాలు

అలంపురం సమీపంలో కృష్ణా, తుంగభద్ర నదులు సంగమించడం వల్ల ఈ ప్రాంతాన్ని దక్షిణకాశిగా అభివర్ణిస్తూ ఉంటారు. మహబూబ్‌నగర్‌కి 90 కిలోమీటర్ల దూరంలోనూ, హైదరాబాద్‌కి 200 కిలో మీటర్ల దూరంలోనూ నెలకొని ఉన్న అలంపురం అష్టాదశ శక్తి పీఠాల్లో ఐదవది. అలాగే, ఈ క్షేత్రంలో నవ బ్రహ్మలు కొలువై ఉన్నారు. క్రీస్తు శకం ఏడవ శతాబ్దంలో బాదామీ చాళుక్యులు ఈ ఆలయాలను నిర్మించారు. అలంపురం చుట్టూ నల్లమల అడవులు వ్యాపించి ఉన్నాయి. తుంగభద్ర నది ఎడమ గట్టున అలంపురం ఆలయం ఉంది. శాతవాహన, బాదామీ చాళుక్యులు, కాకతీయులు, విజయనగర సామ్రాజ్యాధిపతులు, గోల్కొండకి చెందిన కుతుబ్ షాహీ ల కాలంలో ఈ ఆలయం అభివృద్ధి చెందింది. జోగులాంబ, బ్రహ్మేశ్వరస్వామి వార్ల ఆలయాలు చారిత్రక ప్రసిద్ధి చెందినవి. అలంపురాన్ని పూర్వం హలంపురంగానూ, హటాంపురంగానూ వ్యవహరించేవారని క్రీస్తు శకం 1101 సంవత్సరం నాటి శాసనం తెలియజేస్తోంది. ఈ శాసనం పశ్చిమ చాళుక్య రాజు త్రిభువనమల్ల విక్రమాదిత్య-4 కాలం నాటిది. జోగుళాంబ ఆలయం అలంపురంలో ఆగ్నేయ దిశగా నెలకొని ఉంది. ఈ ఆలయాన్ని 14వ శతాబ్దంలో బహమనీ సుల్తానులు ధ్వంసం చేయగా, జోగులాంబ, చండి, ముండి విగ్రహాలను బ్రహ్మేశ్వరస్వామి ఆలయంలో భద్రపర్చారు. కొద్ది సంవత్సరాల క్రితం జోగులాంబ ఆలయాన్ని ప్రత్యేకంగా నిర్మించారు. సతీదేవికి చెందిన పై దవడ పంటితో సహా ఇక్కడ పడినట్టు పురాణకథనం. అమ్మవారు ఉగ్రరూపంతో దర్శనమిస్తారు. మొదట అమ్మవారి విగ్రహం ఇక్కడున్న బాల బ్రహ్మేశ్వరాలయంలో ఉండేది. 2008లో అమ్మవారికి ప్రత్యేకంగా ఆలయాన్ని నిర్మించి, తిరిగి ప్రతిష్టించారు. అలంపూర్‌కు ఈశాన్యంలో కృష్ణా, తుంగభద్ర నదుల సంగమ ప్రాంతంలో కూడవెల్లి అనే గ్రామంలో సంగమేశ్వరాలయం ఉండేది. ఈ గ్రామం, ఆలయం శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణం వల్ల ముంపునకు గురికావడంతో ఇక్కడి సంగమేశ్వరాలయాన్ని తరలించి అలంపూర్‌లో పునర్నిర్మించారు. ఈ ఆలయ శిల్పసంపద ఆకట్టుకుంటుంది. ఈ దేవాలయం కూడా చాళుక్యుల నిర్మాణ శైలిలోనిదే. అలాగే, అలంపురం సమీపంలోని పాపనాశంలో ఇరవై దేవాలయాలు ఒకేచోట ఉండటం వల్ల అలంపురం ఆలయాల పట్టణంగా కూడా ప్రసిద్ధి చెందింది. ఏడవ శతాబ్ది నుంచి 17వ శతాబ్ది వరకూ దక్షిణాపథాన్ని పరిపాలించిన రాజవంశీయుల శాసనాలు ఇక్కడ ఉన్నాయి. ప్రాచీన శిల్పకళకు కాణాచి అయిన ఈ ఆలయం అడుగడుగునా విజ్ఞాన విశేషాలకు ఆలవాలంగా ఉంది. వైదిక మతానికి చెందిన ఆలయాలు, జైన, బౌద్ధుల కాలం నాటి శిల్పనిర్మాణాలు ఇక్కడ ఎన్నో దర్శనమిస్తాయి.ఈ ఆలయం మహాద్వారాన్ని రాష్ట్ర కూటుల హయాంలో నిర్మించినట్టు చారిత్రక కథనం. కాకతీయుల కాలంలో ఇక్కడ మండపాలను నిర్మించారు. శ్రీకృష్ణ దేవరాయలు రాయచూర్ నుంచి ఈ ఆలయానికి వచ్చి అనేక మాన్యాలిచ్చినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

### శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, మట్టంపల్లి, నల్గొండ జిల్లా

నల్గొండ జిల్లా హుజూర్‌నగర్ సమీపంలోని మట్టంపల్లి గ్రామంలో కృష్ణా నదీ తీరాన శ్రీ యోగానంద లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్నాడు. తెలుగునాట పంచ నారసింహ క్షేత్రాలలో ఒకటిగా ప్రసిద్ధిగాంచిన పుణ్య క్షేత్రమే మట్టపల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం. ఈ ఆలయానికి దాదాపు వెయ్యేళ్లకు పైగా చరిత్ర ఉంది. మట్టపల్లిలో వెలసిన స్వామి కొన్నాళ్లు ఎవరికీ కనిపించకుండా గుహలో దాగి ఉండేవాడట. ఇదే గుహలో భరద్వాజ మహర్షి తపస్సు చేయడంతో ప్రత్యక్షమైన స్వామి ఇక్కడే వెలిశాడని, ఒక్క భరద్వాజ మహర్షి మాత్రమే అప్పట్లో స్వామివారిని ఆరాధించుకునేవారని ప్రతీతి. ఈ ఆలయంలో దేవనాగరి లిపిలో ఉన్న శిలాశాసనం ఆధారంగా ఈ ఆలయం 1100 సంవత్సరాల కిందటిదని తెలుస్తోంది. కొండ మీద స్వామి స్వయంభువుగా వెలిశాడు. ఇక్కడ స్వామితో పాటే ఒక దక్షిణావృత శంఖం కూడా ఆవిర్భవించింది. గుంటూరు జిల్లాలోని తంగెడ గ్రామానికి చెందిన మాచిరెడ్డి అనే భక్తుడికి స్వామి కలలో కనిపించి, తాను ఇక్కడ కొండగుహలో వెలిశానని, తనను వెలికితీసి, పునఃప్రతిష్టించమని ఆదేశించాడట. ఆ భక్తుడు గుహలోనున్న స్వామి విగ్రహాన్ని వెలికితీసి, ఆలయం నిర్మించినట్లు ఇక్కడి స్థలపురాణాలు చెబుతున్నాయి. నాటి నుంచి ఈ ఆలయంలో రాజ్యలక్ష్మీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామిని భక్తులు పూజించడం మొదలైంది. ఈ ఆలయంలో స్వామివారికి ప్రీతిపాత్రమైన ఆరె ఆకులను దండలుగా చేసి అలంకరిస్తారు. పశ్చిమాభిముఖంగా ఉన్న స్వామివారి గుహాలయానికి ఆనుకుని గోదాదేవి ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, నాగేశ్వర ఆలయం తదితర ఆలయాలు ఉన్నాయి. ఈ క్షేత్రానికి యమమోహిత క్షేత్రమని కూడా పేరుంది. యమధర్మరాజు స్వయంగా ఈ ఆలయంలో స్వామి వారి చుట్టూ ప్రదక్షిణలు చేయడం వల్ల దీనికాపేరు వచ్చిందంటారు. హైద్రాబాద్ నుంచి వచ్చే భక్తులు రోడ్డు మార్గంలో కోదాడ వరకు వచ్చి అక్కడ నుంచి ఈ క్షేత్రానికి చేరుకోవచ్చు. అలాగే మిర్యాలగూడ మీదుగా కూడా ఇక్కడకు చేరుకోవచ్చు.

### శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం, దామెరచర్ల

నల్గొండ జిల్లా దామెరచర్ల మండలంలో విష్ణుపురానికి సమీపంలో కృష్ణా, మూసీ నదుల సంగమ క్షేత్రంలో వెలసిన పుణ్య క్షేత్రమిది. ఇదో ప్రాచీన మహానగరం. 11,12 శతాబ్దాల కాలంలో ఈ క్షేత్రం గొప్ప ఓడరేవుగా ఉండేదని, వోడపల్లి కాలక్రమంలో వాడపల్లిగా, వజీరాబాద్ గా మారిందని చెబుతారు. అలాగే ఈ ప్రాంతాన్ని పూర్వం బదరికారణ్యం అని పిలిచేవారు. ఆరు వేల సంవత్సరాలకు పూర్వం అగస్త్య మహాముని, తన ధర్మపత్ని లోపాముద్రతో శివకేశవులను తన పూజా కావిడిలో ఉంచుకుని, వారిని ప్రతిష్టించే పవిత్ర ప్రదేశం కొరకు ముల్లోకాలు తిరుగుతూ భూలోకం చేరారట. ఉత్తరకాశీకి వెళ్ళే క్రమంలో ఈ బదరికారణ్యాన్ని చేరుకున్నారట. ఈ పవిత్ర క్షేత్రంలోకి రాగానే నరసింహ స్వామి తానా ప్రదేశంలోనే ఉండ దలచినట్లు ఆకాశవాణి వినిపించిందట. అంతట ఆ ముని దంపతులు శ్రీ లక్ష్మీసమేతునిగా నరసింహుని ప్రతిష్ఠించి ఈ క్షేత్ర పవిత్రతను ఇనుమడింప చేశాడని ఇక్కడి స్థల పురాణాల ద్వారా అవగతమవుతోంది. మరో కథనం మేరకు వ్యాస భగవానుడి కోరిక మేరకు లక్ష్మీనరసింహ స్వామి ఈ క్షేత్రంలో కొలువుదీరినట్లు చెబుతారు. ఈ ఆలయం దక్షిణ ముఖంగా ఉంటుంది. విష్ణుకుండినులు, చాళుక్యులు, కుందూరు చోళులు, రేచర్ల పద్మ నాయకులు, రెడ్డి రాజులు ఈ ప్రాంతాన్ని పాలించినట్లు తెలుస్తోంది. శిథిలమైన ఆలయాన్ని 13వ శతాబ్దంలో అనవేమారెడ్డి పునర్నిర్మాణం చేసి వసతులు ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. ఎరయ తొండయ చోళుడు క్రీ.శ. 1050, 1065 మధ్య అద్భుతమైన వాడపల్లి దుర్గాన్ని అభివృద్ధి చేసినట్లు తెలుస్తోంది. 12వ శతాబ్దంలో రెడ్డి రాజులు ఈ ప్రదేశంలో పట్టణ నిర్మాణానికై తవ్వకాలు జరుపుతుండగా స్వామి వారి విగ్రహం బయట పడిందని, వారు అక్కడే ఆ విగ్రహాన్ని ప్రతిష్టించి క్రీ.శ. 1377లో ఆలయ నిర్మాణం చేసినట్లు శాసనాల ద్వారా అవగతమవుతోంది.

### పుష్కరాల సమయంలో దర్శించుకోదగ్గ ఇతర ఆలయాలు

వీటితో పాటు మాగనూరు మండలం తంగిడి పుష్కర ఘాట్ సమీపంలోని వల్లభేశ్వరస్వామి ఆలయం, దత్తాత్రేయస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి, గుడెబల్లూరు ఘాట్ స్వయంభూ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి, మక్తల్ మండలం పస్పుల ఘాట్ సమీపంలోని శ్రీదత్తాత్రేయస్వామి . పరెవుల ఘాట్ సమీపంలోని శంకర లింగేశ్వర స్వామి ఆలయాలు దర్శించుకోవచ్చు. అలాగే ఆత్మకూరు మండలం నందిమళ్ల ఘాట్ సమీపంలోని శివాలయం, మూలమళ్ల ఘాట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయం, జూరాల ఘాట్ దగ్గర శివాలయాలు. పెబ్బేరు మండలం రంగాపూర్ ఘాట్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయాలను దర్శించుకునే వీలుంది. ధరూర్ మండలం పెద్దచింతరేవుల ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం, వీపనగండ్ల మండలం పెద్దమరూర్ ఘాట్ ఈశ్వర ఆలయం, జటప్రోలు మదనగోపాల స్వామి, కొల్లాపూర్ మండలం సింగోటం శ్రీలక్ష్మీనర్సింహ్మస్వామి ఆలయం, శ్రీ అగస్తేశ్వర ఆలయాలు కూడా పుష్కరాల సమయంలో దర్శించుకోవచ్చు. అలాగే, అమరగిరి ఘాట్ అమరేశ్వర ఆలయం, పెబ్బేరు మండలం గుమ్మడం ఘాట్ సమీపంలోని చెన్నకేశవస్వామి ఆలయం, రామ్‌పూర్ ఘాట్ శ్రీరామాలయం, ముంగమందిన్నె ఘాట్ శ్రీ ఆంజనేయస్వామి, రామాలయాలు. వీపనగండ్ల మండలం చెల్లపాడు ఘాట్ శివాలయం, కొల్లాపూర్ మండలం మంచాలకట్ట, మల్లేశ్వరం ఘాట్ సమీపంలోని శ్రీ రామతీర్థస్వామి ఆలయం, శివాలయం. అచ్చంపేట మండలం పాతాళగంగ పుష్కరఘాట్ దగ్గర్లోని దత్తాత్రేయ స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చు. వీటితో పాటు ధరూర్ మండలం నెట్టెంపాడు శివాలయం, ఉప్పేరు, రేవులపల్లి ఘాట్ సమీపంలోని శివాంజనేయస్వామి ఆలయాలు, గద్వాల మండలం రేకులపల్లి ఘాట్ ఆంజనేయస్వామి ఆలయం, నదీ అగ్రహారం రామావధూత మఠం, బీరెల్లి చెన్నకేశవస్వామి ఆలయాలు, అలంపూర్ మండలం క్యాతూరు వెంకటేశ్వరస్వామి ఆలయం, గొందిమళ్ల ఘాట్ సమీపంలోని జూంకారేశ్వరీదేవి ఆలయాలు కూడా పుష్కర సమయంలో దర్శించుకునే మహాద్భాగ్యం కలుగుతుంది.

## జన్మనక్షత్ర పాదమును బట్టి శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం



హరిః ఓమ్..
అశ్వని 1వ పాదం
విశ్వం విష్ణు ర్వషట్కారో భూత భవ్య భవత్ ప్రభుః 01
భూతకృత్ భూతభృద్భావో భూతాత్మా భూతభావనః
అశ్వని 2వ పాదం
పూతాత్మా పరమాత్మా చ ముక్తానాం పరమాగతిః 02
అవ్యయః పురుష స్సాక్షీ క్షేత్రజ్ఞో క్షర ఏవచ
అశ్వని 3వ పాదం
యోగో యోగవిదాం నేతా ప్రధాన పురుషేశ్వరః 03
నారసింహవపు శ్రీమాన్ కేశవః పురుషోత్తమః
అశ్వని 4వ పాదం
సర్వ శ్శర్వ శ్శివ స్థాణుః భూతాది ర్నిధి రవ్యయః 04
సంభవో భావనో భర్తా ప్రభవః ప్రభురీశ్వరః
భరణి 1వ పాదం
స్వయంభూ శ్శంభు రాదిత్యః పుష్క రాక్షో మహాస్వనః05
అనాదినిదనో ధాతా విధాతా ధాతు రుత్తమః
భరణి 2వ పాదం
అప్రమేయో హృషీకేశః పద్మనాభో మరప్రభుః 06
విశ్వకర్మా మనుస్త్వష్టా స్థవిష్ఠః స్థవి రో ధ్రువః
భరణి 3వ పాదం
అగ్రాహ్య శ్శాశ్వతః కృష్ణో లోహితాక్షః ప్రతర్ధనః 07
ప్రభూత స్త్రికకుద్ధామ పవిత్రం మంగళం పరమ్
భరణి 4వ పాదం
ఈశానః ప్రాణదః ప్రాణో జ్యేష్ఠః శ్రేష్ఠః ప్రజాపతిః 08
హిరణ్యగర్భో భూగర్భో మాధవో మధుసూదనః
కృత్తిక 1వ పాదం
ఈశ్వరో విక్రమీ ధన్వీ మేధావీ విక్రమః క్రమః 09
అనుత్తమో దురాధర్షః కృతజ్ఞః కృతి రాత్మవాన్
కృత్తిక 2వ పాదం
సురేశ శ్శరణం శర్మ విశ్వరేతాః ప్రజాభవః 10
అహ స్సంవత్సరో వ్యాళః ప్రత్యయ స్సర్వదర్శనః
కృత్తిక 3వ పాదం
అజ స్సర్వేశ్వర స్సిద్ధః సిద్ధి స్సర్వాది రచ్యుతః 11
వృషాకపి రమేయాత్మా సర్వయోగ వినిస్సృతః
కృత్తిక 4వ పాదం
వసు ర్వసుమనా స్సత్యః సమాత్మా సమిత స్సమః 12
అమోఘః పుండరీకాక్షో వృషకర్మా వృషాకృతిః
రోహిణి 1వ పాదం
రుద్రో బహుశిరా బభ్రుః విశ్వయోని శ్శుచిశ్రవాః 13
అమృత శ్శాశ్వతః స్థాణుః వరారోహో మహాతపాః
రోహిణి 2వ పాదం
సర్వగ స్సర్వవిద్భానుః విష్వక్సేనో జనార్దనః 14
వేదో వేదవి దవ్యంగో వేదాంగో వేదవిత్ కవిః
రోహిణి 3వ పాదం
లోకాధ్యక్ష స్సురాధ్యక్షో ధర్మాధ్యక్షః కృతాకృతః 15
చతురాత్మా చతుర్వ్యూహః చతుర్దంష్ట్ర శ్చతుర్భుజః
రోహిణి 4వ పాదం
భ్రాజిష్ణు ర్భోజనం భోక్తా సహిష్ణు ర్జగదాదిజః 16
అనఘో విజయో జేతా విశ్వయోనిః పునర్వసుః
మృగశిర 1వ పాదం
ఉపేంద్రో వామనః ప్రాంశుః అమోఘ శ్శుచి రూర్జితః 17
అతీంద్ర స్సంగ్రహ స్సర్గో ధృతాత్మా నియమో యమః
మృగశిర 2వ పాదం
వేద్యో వైద్య స్సదాయోగీ వీరహా మాధవో మధుః 18
అతీంద్రియో మహామాయో మహోత్సాహో మహాబ లః
మృగశిర 3వ పాదం
మహాబుద్ధి ర్మహావీర్యో మహాశక్త ర్మహాద్యుతిః 19
అనిర్దేశ్యవపు శ్రీమాన్ అమేయాత్మా మహాద్రిధృత్
మృగశిర 4వ పాదం
మహేష్వాసో మహీభర్తా శ్రీనివాస స్సతాంగతిః 20
అనిరుద్ధ స్సురానందో గోవిందో గోవిదాం పతిః
ఆరుద్ర 1వ పాదం
మరీచి ర్దమనో హంసః సుపర్ణో భుజగోత్తమః 21
హిరణ్యనాభ స్సుతపాః పద్మనాభః ప్రజాపతిః
ఆరుద్ర 2వ పాదం
అమృత్యు స్సర్వదృక్ సింహః
సంధాతా సంధిమాన్ స్థిర ?

# మహేంద్రజాలం చూడాల్సిందే!







తూర్పుకనుమల్లో అందాలు నెలకొన్న కొండలు మహేంద్రగిరులు. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో పర్వత శ్రేణులపై ప్రకృతి ఎప్పుడూ పరవశిస్తూ ఉంటుంది. చెట్లు, చేమలతో పచ్చలపేరులా మెరిసిపోతున్న మహేంద్రగిరుల్లో.. అక్కడక్కడా వజ్రాలు పొదిగినట్టుగా అపురూప ఆలయాలు దర్శనమిస్తాయి. ముత్యాలు కుమ్మరించినట్టుగా నీటి చెలమలు కనిపిస్తాయి. ఈ గిరులకు ఏడాదంతా పర్యాటకుల తాకిడి ఉంటుంది. ముఖ్యంగా శివరాత్రి సందర్భంగా వేల మంది భక్తులు తరలి వస్తారు. ఇక్కడి పాండవుల ఆలయాలను సందర్శిస్తారు. ఆ చుట్టుపక్కల వాళ్లు ప్రతిష్ఠించిన మహాలింగాలను భక్తితో పూజిస్తారు. శ్రీకాకుళం జిల్లా మందస మండలం సింగుపురం సమీపంలో ఉంటాయి మహేంద్రగిరులు. సముద్ర మట్టానికి ఐదువేల అడుగుల ఎత్తులో ఉన్నాయివి. అరుదైన వృక్షసంపద వీటి సొంతం. వనవాసకాలంలో పాండవులు మహేంద్రగిరులపై కొంతకాలం గడిపారని చెబుతారు. ఆ సమయంలో ఒక్కొక్కరూ ఒక్కో మందిరాన్ని నిర్మించుకొన్నారని స్థానిక కథనం.

అందుకు తగ్గట్టుగా ఇప్పుడు అక్కడ పాండవుల పేరిట ఆలయాలు కనిపిస్తాయి. ధర్మరాజు, కుంతీదేవి ఆలయాలు ఒక ప్రదేశంలో ఉండగా.. భీమసేనుడి ఆలయం ఎత్తయిన శిఖరంపై కనిపిస్తుంది. అక్కడికి కొంత దూరంలో అర్జునుడు, నకుల, సహదేవుల ఆలయాలు ఉన్నాయి. వీటి పరిసర ప్రాంతాల్లో పాండవులు ప్రతిష్ఠించారని భావించే లింగాలు కనిపిస్తాయి. కాలప్రవాహంలో ఆలయాలన్నీ శిథిలావస్థకు చేరుకున్నాయి. అయినా.. వాటి ప్రాశస్త్యం మాత్రం తగ్గలేదు. ఏటా శివరాత్రి సందర్భంగా మహేంద్రగిరులపై జరిగే ఉత్సవాలకు భక్తులు తండోపతండాలుగా తరలివస్తారు. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా భక్తులు వస్తుంటారు. పిల్లలు, పెద్దలు వ్యయప్రయాసలకోర్చి సాహసయాత్రకు పూనుకుంటారు. శివరాత్రికి ఒకరోజు ముందుగానే భక్తులంతా గిరులపైకి చేరుకుంటారు. పూజాసామగ్రి, మంచినీళ్లు, ఆహారం, పళ్లు అన్నీ వెంట తెచ్చుకుంటారు. శివరాత్రి ఉపవాస దీక్షలో ఉంటారు. భజనలతో రాత్రంతా జాగరణ చేస్తారు. మర్నాడు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణం అవుతారు. శివరాత్రి సందర్భంగా జనంతో కిటకిటలాడే మహేంద్రగిరులు ఆ తర్వాత బోసిపోతాయి. సాహస యాత్రికులు మాత్రం తరచూ ఇక్కడికి వస్తుంటారు.

ఇలా వెళ్లాలి.. మహేంద్రగిరుల యాత్రకు సాహసంతో పాటు ఓపిక కూడా ఉండాలి. ముందుగా శ్రీకాకుళం, ఇచ్ఛాపురం నుంచి బస్సుల్లో మందస మండలం సింగుపురం చేరుకోవాలి. మహేంద్రగిరులకు సమీపంలో ఉన్న రైల్వే స్టేషన్ పలాస. ఇక్కడి నుంచి మందస మీదుగా సింగుపురం చేరుకోవచ్చు. బస్సులు, ఆటోలు అందుబాటులో ఉంటాయి. సింగుపురం నుంచి వాహనాల్లో.. చొంపాపురం మీదుగా ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామమైన రాజబసకు వెళ్లాలి. ఆపై కాలినడక మొదలవుతుంది. దాదాపు 28 కిలోమీటర్లు నడవాల్సి ఉంటుంది.

# మమ్మీలను చూసొచ్చాం..!

**గీజా పిరమిడ్‌లో...**

గ్రేట్ పిరమిడ్‌కు రెండు ద్వారాలు ఉన్నాయి. ఒకటి ఫారో చక్రవర్తి కోసమైతే, రెండోది ప్రజలకోసమట. సందర్శకులను ఒక ద్వారం నుంచే అనుమతిస్తున్నారు. లోపలకు వెళ్లి కింగ్స్ ఛాంబర్‌ను చూశాం. దీంట్లోనే కూఫూ తనకోసం నిర్మించుకున్న సమాధి ఉంది. ప్రస్తుతం నాలుగు పిరమిడ్లను మాత్రమే సందర్శకులకు అనుమతిస్తున్నారు. ఒక్కో పిరమిడ్ వెనక మూడు చిన్న పిరమిడ్లను రాణులకోసం నిర్మించారు. అవి చూశాక దగ్గర్లోనే ఉన్న వ్యాలీ ఆఫ్ నైలులోని స్ఫింక్స్ చూడ్డానికి వెళ్లాం. మనిషి మొహం, సింహం శరీరం గల పౌరాణిక రూపమే స్ఫింక్స్. ఒక సున్నపురాతి కొండనే ఆ విధంగా మలిచారట. ఆ ముఖం ఫారో కాఫ్రాది అని చెబుతారు. దీన్ని క్రీ.పూ. 2613- 2494లో నిర్మించినట్లు తెలుస్తోంది.





తరవాత మజిలీ ఈజిప్టు మ్యూజియం... అందులో 1,20,000కి పైగా పురాతన వస్తువులూ 12 మమ్మీలూ ఉన్నాయి. దీన్ని 1902లో నిర్మించారట. 2011లో ఈజిప్టులో జరిగిన తిరుగుబాటులో కొన్ని విగ్రహాలనూ రెండు మమ్మీలనూ ఆందోళనకారులు ధ్వంసం చేశారట. ఇందులో ప్రధానంగా చూడదగ్గది టూటన్‌కామెన్ మమ్మీని ఉంచిన బంగారు శవపేటిక. ఇది ప్రపంచంలోకెల్లా ఖరీదైన శవపేటికగా పేరొందింది. అప్పట్లో ఆయన ముఖానికి 14 కిలోల బంగారు తొడుగు తొడిగారు. ఆయనకోసం చేయించిన బంగారు మంచం, కుర్చీ, నగలు కూడా అక్కడ ఉన్నాయి. తరవాతిరోజు కైరోలోని ఒక మార్కెట్‌ని సందర్శించాం. ఈజిప్షియన్లలో అత్యధికులు ముస్లింలే. ముఖ్య భాష అరబ్బీ. కైరోలో చాలావరకూ ఇండ్లకు ప్లాస్టరింగ్ చేయడం తక్కువ. అక్కడ వర్షపాతం చాలా తక్కువ. దాంతో ముందు మాత్రమే చేస్తారట.



**ఆస్వాన్ నగరంలో...**

మర్నాడు ఆస్వాన్ సిటీకి బయలుదేరాం. ఆస్వాన్‌లో ఆనకట్టను 'హై డ్యామ్' అని పిలుస్తారు. ఈ నిర్మాణంవల్ల లోతట్టు ప్రాంతం ముంపునకు గురైంది. అందులో ఆస్వాన్ ఆలయం, ఫిలై ఆలయం, అబుసింబల్ ముఖ్యమైనవి. అయితే యునెస్కో సహకారంతో వాటిని ఎత్తైన ప్రదేశాలకు తరలించారు. ఈ చుట్టుపక్కల న్యూబియన్ అనే పురాతన తెగ ఉన్న గ్రామం కూడా ముంపునకు గురయింది. వారి భాష న్యూబియన్. దీనికి లిపి లేదు. వారికి తప్ప ఎంత ప్రయత్నించినా వేరే ఎవరూ ఆ భాష నేర్చుకోలేరని తెలిపాడు గైడ్. వాళ్లను అత్యంత ప్రాచీన ఈజిప్షియన్లుగా చెప్పవచ్చు. మరబోటులో వెళ్లి ఫిలై ఆలయాన్ని సందర్శించాం. ఇందులోని దేవత పేరు ఐసిస్. ప్రాచీన ఈజిప్షియన్లు నిర్మించిన చిట్టచివరి ఆలయం ఇదేనట. దీన్ని వాళ్లు దేవతలుగా ఆరాధించే ఓజిరిస్, ఐసిస్‌లు పుట్టిన ప్రదేశంగా విశ్వసిస్తారు. కాలక్రమంలో క్రిస్టియన్లు దీన్ని చర్చిగానూ ఉపయోగించారు. పురాతన ఈజిప్షియన్లు తాము ఆరాధించే దేవతలని మానవరూపంలో కాకుండా జంతురూపంలోనే ఎక్కువగా పూజించేవారు. అందుకే ఆలయగోడలమీద ఎద్దు, గద్ద, నక్క, మొసలి రూపంలో మలిచిన విగ్రహాలన్నీ ఆ కోవకే చెందుతాయి. నైలునదిలో ఆస్వాన్ నుంచి లక్సర్‌కు పడవలో బయలుదేరాం. దారిలో పిరమిడ్లకోసం తవ్విన గ్రానైట్ క్వారీనీ, అసంపూర్తిగా వదిలేసిన ఓబిలిస్క్‌నీ చూశాం. ప్రాచీన ఈజిప్షియన్లు ఒంటిరాయి స్తంభాలను నిర్మించి వాటిమీద రాజుల గురించి చెక్కించేవారు. నైలునది దక్షిణం నుంచి ఉత్తరానికి 6,853 కిలోమీటర్లు ప్రవహించి, రెండు పాయలుగా చీలి మధ్యధరా సముద్రంలో కలుస్తుంది. ఈజిప్టు మొత్తం నైలునది మీదే ఆధారపడి ఉందంటే అతిశయోక్తి కాదు. అందుకే అక్కడివాళ్లంతా 'నో నైల్, నో ఈజిప్ట్' అంటుంటారు. ఎక్కడో చిన్న చిన్న పాయలుగా మొదలైన నైలు నది ఈజిప్టుకే వరప్రదాయని అని చెప్పవచ్చు. పడవలో సాయంత్రం ఆరు గంటలకు కొమాంబు ఆలయానికి చేరుకున్నాం. ఈ ఆలయాన్ని మొసళ్ల దేవతకోసం నిర్మించారు. 22 మొసళ్లనూ గుడ్లనూ మమ్మీలుగా చేసి ప్రదర్శిస్తున్నారు.

మర్నాడు ఉదయం నాలుగు గంటలకు అబుసింబల్ దర్శించడానికి బయలుదేరాం. 300 కి.మీ. దూరం సహారా ఎడారిలోనే ప్రయాణం. దారిలో ఒక్క ఊరు కూడా కనబడదు. గొప్ప ఫారో చక్రవర్తిగా పేరొందిన రామ్‌సీస్ ఖీఖీ నిర్మించినదే అబుసింబల్ ఆలయం. ఆనకట్ట కారణంగా ముంపునకు గురవడంతో దీన్ని ఇక్కడకు తరలించారు. ఇది రెండు ఆలయాల సముదాయం. ఒకటి రామ్‌సీస్ కోసమైతే, రెండోది ఆయన భార్య నెఫెర్‌టారికోసం. ఇది ఒకటే రాతితో నిర్మించిన భారీ విగ్రహాల సముదాయం. ఆ అద్భుత శిల్పకళా సంపదను దర్శించి, తిరిగి ఓడ దగ్గరకు వచ్చేసరికి మధ్యాహ్నం రెండు గంటలయింది. అక్కడినుంచి ఓడలోనే ఎడ్ఫుకి చేరుకున్నాం. ఉదయం ఏడు గంటలకు గుర్రపుబగ్గీలో ఎడ్ఫు ఆలయానికి చేరుకున్నాం. గద్ద ముఖం, మనిషి శరీరంతో గల హోరస్ దేవతకు చెందిన ఆలయం ఇది. ఇక్కడి ఆలయాలన్నీ ముందు భాగం వెడల్పుగానూ ఎత్తుగానూ లోపలికి వెళ్లే కొద్దీ వెడల్పూ ఎత్తూ తగ్గుతూ ఉంటాయి. ఇక్కడ ఉన్న భారీ కుడ్యాలనూ స్తంభాలను చూస్తే ఔరా అనిపించక మానదు. గోడలమీద అప్పట్లోనే ఆపరేషన్లకు అవసరమైన వస్తు సామగ్రినీ కాన్పు సమయంలో తల్లిని కూర్చోబెట్టిన దృశ్యాలనూ చెక్కడం చూసి ఆశ్చర్యపోయాం. చివరి రోజు లక్సర్ పట్టణాన్ని సందర్శించాం. ఇది ఫారోల రాజధాని నగరం. ఇక్కడ ముఖ్యంగా చూడదగ్గవి నాలుగు. మార్చురీ టెంపుల్ ఆఫ్ హాట్సెప్పుట్, కార్నక్ టెంపుల్, వ్యాలీ ఆఫ్ కింగ్స్, లక్సర్ ఆలయాలు. హాట్సెప్సుట్ టెంపుల్ ఓ సూర్యదేవాలయం. ఈ ప్రదేశంలో దొరికిన శిథిలాలతో దీన్ని పునర్నిర్మించారు. ఇందులోని వర్ణచిత్రాలను చూసి ఆశ్చర్యపోవాల్సిందే. వేల సంవత్సరాలు గడిచినా ఎండకు ఎండినా రంగులు మాత్రం వెలసిపోలేదు. అక్కడి నుంచి వ్యాలీ ఆఫ్ కింగ్స్‌కు బయలుదేరాం.

**సమాధుల్లో మమ్మీలతో..!**




ఈజిప్టుని పాలించిన ఫారో చక్రవర్తులు మరణానంతర జీవితం ఉంటుందని విశ్వసించేవారు. అందుకోసమే భారీ యెత్తున పిరమిడ్లు నిర్మించుకున్నారు. క్రీ.పూ. 1069 నాటికి క్రమంగా వాటిమీద ఇష్టం తగ్గి, సమాధులు నిర్మించుకోవడం ప్రారంభించారు. పిరమిడ్‌లలో ఉంచిన మమ్మీలనూ సంపదలనూ దుండగులు కొల్లగొడుతుండటం కూడా ఒక కారణం కావచ్చు. దాంతో తమ సమాధులను భద్రంగా ఉండేందుకు ఈ వ్యాలీ ఆఫ్ కింగ్స్‌ను ఎన్నుకున్నారు. ఈ భూభాగమే సహజసిద్ధంగా ఏర్పడిన పిరమిడ్ ఆకారంలో ఉంటుంది. దాంతో తరవాతి కాలానికి చెందిన ఫారోలు తాము జీవించి ఉండగానే తమ అభిరుచికి అనుగుణంగా తమ సమాధులని ఇక్కడ తీర్చిదిద్దుకున్నారు. అలాంటివాటిల్లో టూటన్‌కామెన్ సమాధి ఒకటి. కైరో మ్యూజియంలోని మమ్మీలన్నీ ఇక్కడ బయటపడినవే. ప్రస్తుతం ఈ వ్యాలీలో కేవలం మూడింటిలోకే ప్రవేశం ఉంది. భూమిలోపలి పొరల్లో గుహలుగా తొలిచి మరీ వీటిని నిర్మించారు. అద్భుత కుడ్యచిత్రాలతో కూడిన టూటన్‌కామెన్ సమాధిలో అతని మమ్మీని సందర్శించాం. ఆ సమాధిలో అనేక వస్తువులతోబాటు బంగారు తొడుగూ టూటన్‌కామెన్ మమ్మీ బయటపడ్డాయట. మమ్మీనీ, చెక్క శవపేటికనీ ఇక్కడ సందర్శనకు ఉంచి మిగిలిన సంపదను కైరో మ్యూజియంకు తరలించారు. చివరగా లక్సర్ ఆలయానికి వెళ్లాం. ఇది 66 ఎకరాల్లో నిర్మించిన 132 భారీ స్తంభాల సముదాయం. ఇక్కడ రహదారికి ఇరువైపులా మానవశరీరం పొట్టేలు ముఖం కలిగిన విగ్రహాలున్నాయి. పిరమిడ్లతోబాటు ఈజిప్షియన్ల కళాసంపదనీ చూశామన్న తృప్తితో వెనుదిరిగాం.

**వానాకాలం విహారం మనసుకు ఆహ్లాదాన్నిస్తుంది. ప్రయాణంలో కొన్ని చికాకులు ఉన్నా.. చల్లటి వాతావరణం, పచ్చదనంతో పులకించే పుడమి, జలకళ సంతరించుకున్న నదీనదాలు ఇవన్నీ మాన్‌సూన్ పర్యాటకానికి కిక్ ఇచ్చేవే. వానకాలం ప్రయాణాల్లో ఈ జాగ్రత్తలు పాటిస్తే సాధారణ సమస్యల నుంచి సులభంగా బయటపడొచ్చు.**



# వానల్లో వెళ్తున్నారా..

వర్షాకాలం దోమల బెడద నుంచి తప్పించుకోవాలంటే రెప్పలెంట్ దగ్గరుంచుకోవాలి. రెప్పలెంట్ బాండ్స్ కూడా మార్కెట్‌లో లభిస్తున్నాయి.

ఎక్కడపడితే అక్కడ నీళ్లు తాగడం మంచిది కాదు. మినరల్ వాటర్ తాగండి. అవకాశం ఉంటే నీటిని కాచి వడగట్టండి.

రెయిన్ కోట్, గొడుగు వెంట తీసుకెళ్లండి.

వర్షాకాలం విహారంలో ఎక్కువగా ఆకర్షించేవి చిరుతిళ్లు. చిరుజల్లుల వేళ.. వేడివేడిగా ఏది కనిపించినా తినకుండా ఉండలేం. శుభ్రత పాటించని ఫుడ్‌కోర్టుల జోలికి వెళ్లకపోవడం ఉత్తమం. దోమలు, ఈగలు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో చిరుతిళ్లు తింటే.. ఇన్‌ఫెక్షన్లు వచ్చే ప్రమాదం ఉంది.

వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి. వర్షపాతం వివరాలు, పర్యటించదలచిన ప్రాంతంలో పరిస్థితులు వీటి గురించి అంతర్జాలంలో సమాచారం సేకరించి అందుకు తగ్గట్టుగా ప్రయాణ ప్రణాళిక మార్చుకోవాలి.



# ఐస్‌కేఫ్.. కెవ్వుకేక!

ప్రకృతిలో చాలా అందాలున్నాయి. అద్భుతాలున్నాయి. కొన్నింటిని మనిషి సృష్టిస్తే కొన్నింటిని మాత్రం ప్రకృతి ఇచ్చింది. అలా ప్రకృతి ఇచ్చినవి ఎప్పటికీ అద్భుతంగానే ఉంటాయి. భారతదేశంలో ఉన్న ఏకైక ఐస్‌కేఫ్ ఇది. అయితే ప్రకృతిసిద్ధంగా లడఖ్‌లో ఉద్భవించింది. సముద్రమట్టానికి 14వేల అడుగుల ఎత్తులో ఉన్నది. మనాలి -లే హైవే ఈ కేఫ్ కనిపిస్తుంది. దీన్ని మానవులు సృష్టించలేదు. సహజ ప్రకృతి ప్రక్రియ ద్వారా వెలువడింది. ఈ ఐస్‌కేఫ్ బార్డర్ రోడ్ ఆర్గనైజేషన్ అధికారులు వెలుగులోకి తీసుకొచ్చారు. ఇది లే నుంచి 75 కిలోమీటర్ల దూరం ఉన్నది. లడఖ్‌కు వచ్చే సందర్శకులను ఆకర్షించేందుకు ఈ ఐస్‌కేఫ్‌ను ప్రారంభించారు. గుహ మాదిరిగా ఉన్న దీనిలో హాట్‌డ్రింక్స్, నూడుల్స్‌వంటి ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు.



# కొత్త ప్రదేశానికి వెళ్తే ఎక్కడ తినాలో?

ఓ పట్టాన అర్థం కాదు. మంచి హోటల్ ఎక్కడుందో తెలియదు. ఇలాంటి సమయాల్లో చాలామంది ఆన్‌లైన్ రివ్యూలపై ఆధారపడుతుంటారు. ఈ రేటింగ్స్ ఎక్కువగా పర్యాటకులే ఇస్తుంటారు. సదరు రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు వాళ్లకు ఎదురైన అనుభవాన్ని బట్టి రివ్యూలు రాసేస్తుంటారు. అందుకే వాటిని గుడ్డిగా నమ్మొద్దు. ఒక ప్రాంతంలో ఉన్న రెస్టారెంట్లు, ఆహార విషయాలు స్థానికులకు తెలిసినంతగా.. చుట్టపు చూపుగా వచ్చిన పర్యాటకులకు అంతగా తెలియకపోవచ్చు. అందుకే ఆన్‌లైన్ రివ్యూలు కాకుండా.. స్థానికుల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని ఎక్కడ తినాలో నిర్ణయించుకోవాలి. స్థానిక రుచుల గురించి ఆరా తీయాలి.. ఆరగించాలి. మరో విషయం ప్రయాణాల్లో చాలామంది స్ట్రీట్ ఫుడ్ జోలికి వెళ్లరు. అన్ని సమయాల్లోనూ ఇది సరికాదు. బడ్జెట్‌లో వేడివేడి రుచులు కావాలన్నా.. ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన రుచులు ఆస్వాదించాలన్నా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లాలి. అక్కడ రుచికరమైన ఆహారం దొరుకుతుందో లేదో తెలుసుకోవడం కూడా సులభమే! సాధారణంగా స్ట్రీట్‌ఫుడ్ సెంటర్స్‌కు స్థానికులే ఎక్కువగా వెళ్తుంటారు. ఎక్కడ రద్దీగా ఉంటుందో.. అక్కడికి వెళ్లి ఓ పట్టు పట్టేయడమే. రుచి బాగుంటేనే కదా రద్దీ ఎక్కువగా ఉండేది!

# విశుద్ధ భక్తులుగా మార్చే భక్తిమంత్రం దామోదర దివ్య లీల!



పరమ పవిత్రమైన కార్తీకమాసానికే 'దామోదర మాసమని' కూడా పేరు. వైష్ణవ సంప్రదాయాన్ని పాటించేవారిలో కొందరు ఈ ప్రత్యేక మాసాన్ని పౌర్ణమినుండి పౌర్ణమివరకు, మరికొందరు అమావాస్యనుండి అమావాస్య వరకు జరుపుకుంటారు. ఈ మాసం పొడుగునా భక్తులు శ్రీకృష్ణుడిని దామోదరుడిగా కొలవడం విశేషం. తల్లి యశోద చేతిలో బద్ధుడై తాడుతో రోకలికి కట్టేయించుకున్న చిన్ని కృష్ణుని లీలనే 'దామోదర లీల'గా ప్రసిద్ధి చెందింది. ఆ విశేషాలే ఈవారం ఇక్కడ.

గోష్టే దామోదర ఇతి గోపీభిః పరిగీయత

శ్రీకృష్ణునికిగల ఈ దామోదర నామం గొప్పతనాన్ని ఈ శ్లోకం చక్కగా వివరించింది. శ్రీకృష్ణుడు ఏ విధంగా భక్త పరాధీనుడో 'దామోదర లీల' చాటుతుంది. శ్రీకృష్ణుడు దేవాదిదేవుడైనా, దేవతామూర్తులు అందరూ వారి ఆధీనంలోనే వున్నా తన విశుద్ధభక్తురాలైన యశోదమ్మకు మాత్రం తానే బద్ధుడయ్యాడు. అదెలా అన్నదే ఇక్కడ అత్యంత ఆసక్తికరం. యశోదా కృష్ణుల మధ్యగల ఈ వాత్సల్యరసాన్ని శ్రీల ప్రభుపాదులవారు గొప్పగా వ్యాఖ్యానించారు. 'దేవదేవుడైన శ్రీకృష్ణుని లీలలతో కలిగే సంభ్రమాశ్చర్యాలకు ఇదొక ఉదాహరణ. సకల సర్వావస్థలలోనూ భగవంతుడు భగవంతుడే. తాను దేవాదిదేవుడైనా సరే, తన శుద్ధభక్తుని ముందు మాత్రం ఒక ఆటవస్తువుగా మారతాడు. విశుద్ధభక్తులైనవారు కేవలం అంతటి నిర్మలమైన ప్రేమభావనతోనే శ్రీకృష్ణునికి భక్తిపూర్వక సేవలు చేస్తారు. ఆ సమయంలో ఆ శుద్ధభక్తులు ఒక్కోసారి భగవంతుని నిజస్థితినీ మరచిపోతుంటారు. సహజ అనురాగంతో, అప్రయత్న పూర్వకంగా, ఐశ్వర్యభావ రహితంగా వారు చేసే ఆరాధనలను భగవంతుడు మరింత ప్రియంగా స్వీకరిస్తాడు.

భగవంతుడు ఎప్పుడు అతిప్రసన్నుడవుతాడు?

సాధారణంగా, ఎక్కువ మంది భక్తులు భగవంతుణ్ణి ఐశ్వర్యభావంతోనే సేవిస్తుంటారు. కానీ, భక్తుడు తన విశుద్ధమైన ప్రేమానురాగాల కారణంతో 'భగవంతుడు తనకన్నా అంత ముఖ్యుడు కాదని' తలుస్తుంటాడు. అప్పుడే ఆ దేవదేవుడు అతిప్రసన్నుడవుతుంటాడు. ఆదిధామమైన గోలోక బృందావనంలో ఇలాంటి భావనలోనే దామోదర లీలలు సాగాయి. కృష్ణుని స్నేహితులు అతనిని తమలో ఒకనిగానే భావించారు. మర్యాదపూర్వకమైన ప్రత్యేకతలు చూపాలని అనుకోలేదు. అదే విధంగా, విశుద్ధభక్తులైన శ్రీకృష్ణుని తల్లిదండ్రులుకూడా అతనిని తమ పిల్లాడిలానే భావించారు. తల్లిదండ్రుల చివాట్లనూ 'వేదమంత్రాల ప్రార్థనలకన్నా ప్రియంగా' విన్నాడు. జనసామాన్యాన్ని ఆకర్షించే నిమిత్తం దివ్యధామమైన గోలోక బృందావనంలోని తన నిత్యలీలలను ప్రదర్శించేందుకు ఆ దేవదేవుడైన శ్రీకృష్ణుడు ఈ భౌతిక జగత్తులో అవతరించినపుడు తన తల్లి యశోదకు సంపూర్ణ ఆధీనతనే ప్రదర్శించాడు. వెన్నకుండలను పగులగొట్టి అందులోని వెన్నను మిత్రులకు, తోటి ఆటగాళ్లకు, బృందావనంలోని భాగ్యవంతమైన కోతులకు పంచి పెట్టి, యశోదమ్మ కూడబెట్టిన వెన్నను పాడు చేసేవాడు.

కన్నీటి పర్యంతమైన కృష్ణుడు

యశోదమ్మ అది చూసి, ప్రేమతో తన పుత్రునిపట్ల ఒక బూటకపు శిక్షను ప్రదర్శించాలని అనుకుంది. సాధారణంగా, ఇండ్లలో జరిగే విధంగా 'ఒక తాడు తెచ్చి బంధిస్తున్నానని' కృష్ణుడిని భయపెట్టింది. యశోదమ్మ చేతిలోని తాడును చూసి భగవంతుడు భయంతో తల దించుకొని, సామాన్య బాలుని వలె ఏడవటం ప్రారంభించాడు. ఆ కన్నీటితో కంటి కాటుక చెదరిపోయింది. కన్నీరు చిన్నిబుగ్గలపై ఏకధాటిగా కారసాగింది. శ్రీకృష్ణుని దివ్యస్థితిని గురించి తెలిసిన కుంతీదేవికి ఈ సన్నివేశం అత్యంత ప్రియంగా తోచింది. వాస్తవానికి, శ్రీకృష్ణుడు భయానికే భయం కలిగించేవాడైనా తనను శిక్షించాలనుకున్న తల్లిని చూసి భయపడ్డాడు. కుంతీదేవికి ఆ దేవదేవుని దివ్యత్వం తెలుసు. యశోదమ్మ ఇవేవీ పట్టించుకోలేదు. ఆమె స్థితి కుంతీదేవికన్నా ఉన్నతమైంది. యశోదమ్మ భగవంతుడినే తన పుత్రునిగా పొంద గలిగింది. అయితే, తన పుత్రుడు భగవంతుడనే విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేసింది ఆ దేవదేవుడే. ఒకవేళ ఆమెకు శ్రీకృష్ణుని దివ్యత్వమే తెలిసి వుంటే అతనిని శిక్షించడానికి సంకోచించేది. కానీ, తాను తన ప్రియమైన తల్లిముందు బాల్యచేష్టలను ప్రదర్శించాలని శ్రీకృష్ణుడు తలచడం వల్ల ఆ విషయాన్ని యశోదమ్మ మరచిపోయేలా చేశాడు.

ఎంతటి అదృష్టవంతురాలో..

ఆ తల్లి తనయుల నడుమ వాత్సల్య భావన అక్షరాలకు అందనిది. అత్యంత సహజాతి సహజంగా అది వెల్లడైంది. ఈ సంఘటనను తలచుకున్న కుంతీదేవి మోహపరవశురాలైంది. ఆ తల్లీ తనయుల ప్రేమను కీర్తించడం కన్నా మరొకటి చేయలేకపోయింది. సర్వశక్తి సంపన్నుడైన శ్రీకృష్ణుడినే ప్రియపుత్రునిగా అదుపులో వుంచగలిగిన యశోదమ్మ ప్రేమస్థితి అద్వితీయం, అనిర్వచనీయం. చరాచర జగత్తులోని సమస్త ప్రాణులకూ ముక్తిని ప్రసాదించేవాడైన ఆ దేవదేవునితో బ్రహ్మదేవుడు గాని, పరమశివుడు గాని, చివరకు అర్ధాంగి సాక్షాత్తు లక్ష్మీదేవి గాని పొందని దుర్లభమైన కృప తల్లి యశోద పొందింది (శ్రీమద్భాగవతం: 10.9.20). శ్రీల ప్రభుపాదవంటి



గొప్ప విశుద్ధభక్తుని మార్గనిర్దేశకత్వంలో 'మనమూ శ్రీకృష్ణునిపై అంతటి గొప్పభక్తిని కలిగివుందాం'.

అంతటి నిర్మల భక్తుడు మాత్రమే కృష్ణభక్తిని జాతి, కుల, మత బేధాలకు అతీతంగా సమస్త మానవాళికీ ప్రసాదించగలడు.

భగవంతుడు ఒక్కడే!

ఎంతోమంది తాము భగవంతుడవ్వాలనే కోరికతో ఆధ్యాత్మికంగా అనేక ప్రయత్నాలు చేస్తుంటారు. అలాంటి వారికి చివరకు మిగిలేది వట్టి ప్రయాస మాత్రమే. ఎందుకంటే, జీవాత్మ ఎన్నటికీ భగవంతుడు కాలేడు గనుక. భగవంతుడనేవాడు ఎన్నటికీ ఒక్కడే. జీవాత్మలమైన మనమంతా భగవంతుని అంశా స్వరూపులం. పరమాత్మ ముందు జీవాత్మ అత్యంత అల్పం. కేవలం మనలోని అహంకారమే మనం పరమాత్మతో సమానమనే భావనను కలిగిస్తుంటుంది. ఇది మానవుని అతిపెద్ద భ్రమ. కానీ, భక్తులు మాత్రం తమకుగల విశుద్ధమైన ప్రేమతో యశోదమ్మలా భగవంతుణ్ణే జయిస్తుంటారు. ఇది శ్రీకృష్ణుడు తన భక్తులపై చూపే కారుణ్యవర్షం. యశోదమ్మ పొందిన ఈ మహద్భాగ్యాన్ని శుకముని కొనియాడిన తీరు అపురూపం.

## అభ్యాస నిష్ఠతోనే ఆధ్యాత్మిక పరిమళం!



అభ్యాసమంటే ఉద్దేశపూర్వకంగా, నియమబద్ధంగా పదేపదే చేసే ప్రయత్నం. మనిషి జీవితం సంస్కృతి, నాగరికతలతో నిర్మితమయ్యేది కాబట్టి, మారే వ్యావహారిక విలువలను, సాంకేతిక నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అలవరచుకొని సమర్థ జీవనం గడపవలసి ఉంటుంది. కాలం గడిచేకొద్దీ ఈ మార్పుల వేగం పెరుగుతుండటం వల్ల వాటికి అనుగుణంగా మనిషి తన అభ్యాస నేర్పునూ పెంచుకోవలసి వుంటుంది. ప్రాతఃకాలంలో చేసే అభ్యాసం అనతికాలంలో సత్ఫలితాన్నిస్తుందన్నది అనుభవజ్ఞుల మాట. ఇతర జీవులలో సహజాతాల పాత్ర ఎక్కువకానీ, మనిషి జీవనంలో అభ్యాసానిదే ప్రధానపాత్ర. అది ఐహిక విషయమైనా, ఆముష్మిక విషయమైనా. సాధారణంగా ఐహిక విషయాలలో ఒకటి నేర్చుకొనడానికి చేసే చక్రీయకృషిని 'అభ్యాసం' అంటాం. ఆముష్మికాంశాలలో ఒక దిశలో స్వభావగతంగా ఎదగడానికి చక్రీయంగాగానీ, నిరంతరంగాగానీ చేసే కృషిని 'సాధన' అంటాం. ఏదేని విషయాన్ని నేర్చుకొనడంలో, నేర్చుకొన్నది దోషాలు తొలగి బలపడటంలో, బలపడింది అవగాహనలో వికసించడంలో, అట్లా వికసించింది మన స్వభావంగా మారడంలో 'అభ్యాసమే' కీలక ఊతమై నిలుస్తుంది.

అప్పుడు మనం నేర్చుకొన్నది సందర్భోచితంగా, సహజంగా, సమర్థంగా, అప్రయత్న ప్రవర్తనగా ప్రకటితమవుతుంది. 'అభ్యాసం కూసు విద్య' అన్న నానుడికి అసలు అర్థం ఇదే. ఇంగ్లిషులో దీన్నే 'సెకండ నేచర్' అంటారు. అభ్యాసానికి ముందు నిర్ధారిత విషయ పరిజ్ఞానం, ప్రయోగ మార్గదర్శనం అనుభవజ్ఞులైన గురువుల నుండి తప్పనిసరిగా పొందవలసిందే. లేకుంటే కృషి సరైన దిశలో సాగక సత్ఫలితాలకు బదులు దుష్ఫలితాలు వచ్చే ప్రమాదం ఉంటుంది. అందుకే అంటారు మనవాళ్ళు, 'గురువు లేని విద్య గుడ్డివిద్య' అని. సాధారణంగా అభ్యాస స్థాయి వ్యక్తి వయసు, మానసిక పరిణతి, పట్టుదలపైన ఆధారపడి ఉంటుంది. మనకు అందే, మనం పొందే ప్రేరణాబలం వాటి పరిమితులను కొంతవరకు చెరుపగలుగుతుంది.

అభ్యాసం కుంటుబడకుండా సవ్యంగా, సబలంగా సాగడానికి తదనుకూలమైన ఆహార అలవాట్లు, పరిసరాలు, సాంగత్యం వంటివీ అత్యవసరం. ఈ విషయంలో జాగ్రత్తపడకుంటే తగు స్థాయి ఫలితాలు సంప్రాప్తించకపోగా, వైఫల్యమూ ఎదురవవచ్చు. అభ్యాస నాణ్యతను, ఉన్నతిని నిర్ణయించే ఇంకొక అతి ముఖ్యమైన విషయం 'అభ్యాసకుడి వైఖరి' (ఆటిట్యూడ్). ఇది స్వార్థపూరితమైతే అభ్యాసం తీవ్ర ఏకాగ్రతతో సాగినా, ఆశించిన ఫలం సంపూర్ణంగా లభించినా, ఆ ఫల వినియోగం పరహితాన్ని మరచి అహంకారంతో, అత్యాశతో, భయక్రోధాదులతో సాగి పాపాన్ని మూటకడుతుంది. పర్యవసానంగా అది సాధకుని వినాశనానికే దారితీస్తుంది. ఒకవేళ ఈ వైఖరి పరహితార్థమైందైతే ఆ ఫల వినియోగం సకల సజ్జన సుఖాపేక్షతో, ప్రేమ, సంతోషం, తృప్తి వంటివాటితో సాగి పుణ్యాన్ని మోసుకొస్తుంది.

ఈ నిస్వార్థ వైఖరే నిరంతరం అంతఃప్రేరణగా ప్రజ్వలిస్తూ అభ్యాసాన్ని పవిత్రనిష్ఠగా, నిరవధికంగా కొనసాగింపజేస్తుంది. అలాంటి అభ్యాసమే జీవన కౌశలాలను పదునుపరచి, మూల్యాలను మెరుగుపరచి, సమర్థతతో సమాజంలో ఆదర్శప్రాయునిగా నిలిపి, అనుభూతిలో సంతృప్తిని నింపి, సంస్కారాలకు పుణ్యబలాన్నిచ్చి జన్మను సార్థకం చేస్తుంది. మన జీవన విధానంలోకానీ, పలు రకాల అభ్యాసాలలోకానీ ఆధ్యాత్మిక ప్రభను అంటే ప్రకృతిపట్ల, సమాజం పట్ల, వాటి శాసనసూత్రమైన ఈశ్వర శక్తిపట్ల ఆర్ద్ర, అభేద, ఆత్మీయ, అనన్య భావనను ప్రతిష్ఠింపజేయాలి. దీంతో దక్కే ఏ ఫలాన్నైనా 'ఈశ్వర ప్రసాదం'గా స్వీకరించినప్పుడు జీవితమే కర్మయోగమవుతుంది. ఏ కర్మాసక్తులూ కట్లు బిగించవు. అప్పుడు జీవితం 'మోక్ష పథగామి'గానూ సాగుతుంది. అభ్యాస జీవనాన్ని ఇలా ఆధ్యాత్మిక పరిమళంతో నింపుకోవడం ద్వారా భౌతిక జీవనాన్ని ధర్మబద్ధంగా సంపన్నమయం చేసుకోగలం. ఫలితంగా పుణ్యగంధాల ఆత్మానందంతో మానవజన్మ ధన్యమవుతుంది.




## సకల ఐశ్వర్య ప్రదాయకం
## ఓం శ్రీం శ్రియై నమః

సువర్ణవృద్ధిం కురు మే గృహే శ్రీః
సుధాన్యవృద్ధిం కురు మే గృహే శ్రీః
కళ్యాణవృద్ధిం కురు మే గృహే శ్రీః
విభూతి వృద్ధిం కురు మే గృహే శ్రీః

ధనం, ధాన్యం, పుత్రులు, మిత్రులు, బంధువులు, వాహనాలు, భృత్యులు, దాసీజనం మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు' అని పూర్వకాలంలో అనేవారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్యం, సంతోషం, సంతృప్తి, ప్రశాంతత, ధైర్యం, జ్ఞానం, విద్య, శక్తి మొదలైన వానిని 'అష్ట ఐశ్వర్యాలు'గా గుర్తించాల్సి ఉంది. మొదటివి కనిపించే ఐశ్వర్యాలు కాగా, తర్వాతివి కనిపించకుండా మనలోనే ఉండి మనలను ప్రేరేపించి, మన స్థాయిని పెంచే ఐశ్వర్యాలు. ఇవన్నీ మనలో, మనతోనే ఉండాలంటే మనం వాటికి మూలమైన పాంచభౌతిక శక్తితో కలిసి ఉండాలి. కనిపించే సంపదలన్నీ అనుభవిస్తుంటే అయిపోతుంటాయి. కనిపించని సంపదలు ఎంత అనుభవించినా తరగకుండా ఉంటాయి. సంతోషం, ధైర్యం, ఆరోగ్యం, జ్ఞానం మొదలైన వాటన్నిటికీ లెక్కలు కట్టడం అసాధ్యం. ఇవి తరగని సంపదలు. ఇంకా పెరుగుతూనే ఉంటాయి. వాటిని ఇంకా పెంచుకుంటూ పోవాలి. అవి పెరుగుతుంటేవ్యక్తిలో శక్తి పెరిగి, ఆనందాత్ముడవుతుంటాడు.

మనలోని, మన చుట్టూ వున్న పాంచభౌతిక శక్తికే 'శ్రీం' అని పేరు. ఆ శక్తితో మనం ఎంత ఎక్కువసేపు గడిపితే అంతగా మనలోకి ప్రసరించి, మన మానసిక, భౌతిక శరీరాలను సమన్వయం చేస్తుంది. ఈ లోకంలో మనం శక్తివంతులం అనిపించుకోవాలంటే శరీరానికి, మనసుకు రెండిటికీ శక్తి ఉండాల్సిందే. పార్వతిగా, లక్ష్మిగా, సరస్వతిగా భావించే మూలరూపమైన ఆ 'శ్రీమాత'ను నిరంతరం ఉపాసిస్తే ఈ కనిపించే, కనిపించని సంపదలు, ఐశ్వర్యాలన్నీ మనతోనే ఉంటాయి. పాంచభౌతిక శక్తిలోనే సంపదలన్నీ ఇమిడి ఉంటాయి. అందుకే ఆ శక్తి స్వరూపిణి అయిన శ్రీమాతను 'ఓం శ్రీం శ్రియై నమః' అనే మంత్రంతో ఆరాధిద్దాం. ధన కనక వస్తు వాహన పుత్ర పౌత్రాది దృశ్య సంపదలు అపరిమితంగా మనతో చేరడానికి శక్తి, జ్ఞానం, ధైర్యం, సంతృప్తి మొదలైన అదృశ్య సంపదలు మనతోపాటే ఉండటానికి కనీసం ఒక గంట ఈ జపం చేద్దాం. అవసరాన్నిబట్టి దీక్షతో లక్షల సంఖ్యలో జపిస్తే సర్వ దారిద్ర్యాలు దూరమవుతాయి.

## శ్రీ అరవిందుల తత్త్వ దర్శనం!

సాధన త్రికరణ శుద్ధిగా వుంటే యోగమార్గంలో ఫలితం నూరు శాతం లభిస్తుంది. 1926లో ఇవాల్టి (24 నవంబర్) రోజున రాత్రి 8 గంటల వేళ శ్రీకృష్ణుడు నేరుగా నడిచి వచ్చి శ్రీ అరవిందుని హృదయంలోకి ప్రవేశించాడు. ఆయన తుదిశ్వాస విడిచేవరకు పరమాత్మ అక్కడే నివాసమున్నాడు. ప్రతి సంవత్సరం '24 నవంబరు'ను శ్రీ అరవిందాశ్రమం వారు 'సిద్ధిదినం'గా పాటిస్తారు. నిజానికి ఈ రోజును 'శ్రీకృష్ణారవింద సంయోగ దినం'గా భావించాలి. శ్రీ అరవిందులకు 1908 ప్రాంతంలో విష్ణు భాస్కర లేలే అనే యోగి పుంగవునితో పరిచయమైంది. లేలే మహాశయుడు తనకు హఠయోగం నేర్పాడు. ధ్యానమార్గాన్ని చూపాడు. 'ధ్యానం వేళ ఆలోచనలేవీ పెట్టుకోవద్దు. నీ మెదడును నువు బయటి పదార్థం వలె చూస్తూ ఉండు. మెదడులోకి ఆలోచనలు ఒకటొకటిగా వస్తుంటవి. అవి నీ అంతర్నేత్రానికి కనపడుతూ వుంటాయి. వచ్చిన ఆలోచనలను వచ్చినట్టుగా బయటకు పారద్రోలు. తదుపరి నీ మేధ నిశ్చలమవుతుంది' అన్నది ఆ గురువు ఉద్బోధ. శ్రీ అరవిందులు అక్షరాలా దీనిని అమలు జరిపారు. ధ్యానం మొదలుపెట్టిన మూడోరోజే తథాగతుడు ప్రవచించిన నిర్వాణస్థాయికి శ్రీ అరవిందులు చేరుకొన్నారు. అలీపూర్ కుట్రకేసులో విచారణ ఖైదీగా ఆయన కారాగారవాసం అనుభవించారు. అక్కడ వారికేమీ పనిలేదు. విష్ణు భాస్కర లేలే ఉపదేశించిన మార్గంలో పూర్తిస్థాయిలో సాధన చేశారు. గీతాధ్యయనమూ చేశారు. కారాగారంలో ఆయనకు 'శ్రీకృష్ణ దర్శనం' లభించింది. ఆయనకు తోటి ఖైదీలు, పోలీసులు, జైలరు, తనకు అనుకూలంగా-ప్రతికూలంగా కేసును వాదిస్తున్న ప్రతి ఒక్కరూ శ్రీకృష్ణునివలెనే కనపడసాగారు. తన పక్షాన తాను ఒక్క వాక్యమైనా మాట్లాడలేదు. న్యాయమూర్తి శ్రీ అరవిందుని నిరపరాధిగా విడుదల చేశారు. ఈ అనుభవంతో ఆయన జీవితలక్ష్యమే మారిపోయింది. అరవిందుని కార్యరంగం స్వాతంత్ర్య పోరాటం నుండి ఆధ్యాత్మిక రంగానికి మారింది. 'మన్ను తిన్నాడని' బాలకృష్ణునిపై అభియోగం. 'తినలే'దన్నాడు కన్నయ్య. 'నోరు తెరువు చూస్తా' అన్నది యశోద. ఆ చిన్నినోట్లో పద్నాలుగు భువనాలు ఆమెకు దర్శనమిచ్చాయి. శ్రీ అరవిందులు తన



ధ్యానసాధనలో వీటినే దర్శించారు. అక్కడి వాతావరణ పరిస్థితులు, జీవుల స్థితిగతులను అన్నిటినీ ఆయన ఆంగ్లభాషలో రచించిన 'సావిత్రి' మహాకావ్యంలో మనం చదువవచ్చు. 'మహాభారతం'లోని 'సావిత్రి-సత్యవంతుల' కథ అంతా ఆయనకు దృశ్యకావ్యంలా దర్శనమిచ్చింది. సృష్టి, స్థితి, లయలకు చెందిన సరంజామా మొత్తం వారికి ఆ కథలో గోచరించింది.

ఈ భూమిపై నివసించే జీవజాలమంతటికీ ఉత్కృష్ట ప్రాణి మానవుడేనని మనందరి విశ్వాసం. శ్రీ అరవిందుల దృష్టిలో మనం అధమశ్రేణి మానవులం. ఉత్కృష్ట మానవుడింకా ఉద్భవింపవలసే వున్నది. మన దేహంలోని జీవాత్మ.. పరమాత్మ స్వరూపమే అని మనలో కొందరం భావిస్తున్నాం. ఉత్కృష్ట మానవుడు ఈ భావనను నిరంతరమూ అనుభవిస్తుంటాడు. ఈ అనుభవానికి సంబంధించిన అనుభూతికి మినహాయింపులు ఉండవు. భూలోకంలోని మానవులందరూ స్వర్లోక జీవులకువలె తాము పరమాత్మ అంశ అన్న నిరంతర స్పృహతో జీవిస్తుంటారన్నమాట. 'అతిమానస అవతరణం' ద్వారా ఈ ప్రక్రియ సాధ్యమవుతుందని శ్రీ అరవిందులు చెప్పి వున్నారు. దానికోసం వారు తమ తపస్సు మొత్తాన్ని ధారపోశారు. మనం చేసే ప్రతి పనినీ భగవంతుడు మన ఎదురుగా నిల్చొని చూస్తున్నాడన్న భావనతో చేస్తే చాలు, 'అతి మానస అవతరణం' సాకారమై భువి దివిగా మారిపోతుంది.

# తేనెటీగల పెంపకంతో నెలకు 18వేల వరకు అదనంగా సంపాదిస్తున్న రైతన్నలు

ఒకప్పుడు అడవుల్లో, భారీ చెట్ల వద్ద మాత్రమే దొరికే తేనె ఇప్పుడు వ్యవసాయ అనుబంధ రంగ పరిశ్రమగా మారుతున్నది. కేవలం ఆంధ్ర, ఇతర ప్రాంతాలకు మాత్రమే పరిమితమైన పెంపకం తెలంగాణకు క్రమంగా విస్తరిస్తున్నది. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండడం, తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయాన్ని ఈ 'బీ కీపింగ్' (తేనెటీగల పెంపకం) కాసుల వర్షం కురిపిస్తున్నది. ఒక్కసారి పెట్టుబడి పెట్టి.. అనువైన స్థలంలో మొదలుపెడితే క్రమం తప్పకుండా మంచి ఆదాయం ఇవ్వడం ప్రత్యేకత కాగా, ఉమ్మడి జిల్లాలో ఇప్పుడిప్పుడే పలువురు రైతులు రాణిస్తున్నారు. ప్రత్యేకంగా 50వేల తేనెటీగలతో కూడిన బాక్కులను కొనుగోలు చేసి తీసుకువస్తూ, ఉద్యానవన పంట క్షేత్రాల వద్ద అమరుస్తూ ఉపాధి పొందుతున్నారు. ఓ వైపు జీవ వైవిద్యాన్ని, పర్యావరణాన్ని జీవవంతం చేస్తూ ఉపాధి పొందుతూనే.. మరో వైపు పంటలకు ప్రాణం పోస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.



### లాభాల తేనె పట్టు

తేనెటీగలను బాక్స్‌ల్లో పెంచుతారు. ఒక్కో బాక్స్‌లో మైనం షీట్స్ కలిగిన 8-10ఫ్రేంలు ఉంటాయి. వాటిల్లోనే తేనెటీగలు ఉంటాయి. బయటికి వెళ్లడానికి, రావడానికి బాక్సు నుంచి ఒకే దారి ఉంటుంది. బాక్స్ మూత తీసినా ఆ వైపు నుంచి తేనెటీగలు లేచి పోవు. మొత్తంగా ఒక బాక్స్‌లో 50వేల నుంచి లక్ష తేనెటీగలు ఉంటాయి. ఇందులో ఒక రాణి( పరిపూర్ణమైన ఆడ ఈగ, క్వీన్‌బీ అంటారు). వేల సంఖ్యలో కూలీ ఈగలు (అసంపూర్ణమైన ఆడ ఈగలు), వందల సంఖ్యలో మగ ఈగ(వీటిని డ్రోన్స్ అంటారు)లు ఉంటాయి. ఇవి రాణి ఈగ డైరెక్షన్‌లో పనిచేస్తాయి. మరికొన్ని ఈగలు పూలు, పూతపై ఉండే ఎంజెమ్స్‌ని, పుప్పొడిని, మరికొన్ని మకరందాన్ని, బంకపై ఉండే మైనాన్ని తెస్తాయి. మరికొన్ని ఈగలు రాణి ఈగ కోసం రాజాహారం(రాయల్ జెల్లీ)ని తీసుకొస్తాయి. ఇక బాక్స్‌లో ఉండే ఈగలు మైనంతో గదులను చక్కగా నిర్మిస్తుంటాయి. ఇక మకరందాన్ని తెచ్చిన తీగలు దానిని తేనేగా మార్చి గదుల్లో నింపి సీల్ చేస్తాయి. ఇక బాక్స్‌లో చనిపోయి ఉన్న ఈగలను మరికొన్ని ఈగలు బయటకు పడేస్తూ ఉంటాయి. బాక్స్ ప్రధాన ద్వారం నుంచి లోపలికి కొండ ఈగలు, దోమలు, ఈగలు, బల్లులురాకుండా ఒక 15-20 ఈగలు కాపలా కాస్తుంటాయి.

### రైతులకు అదనపు ఆదాయం

తేనెటీగల పెంపకం రైతులకు అదనపు ఆదాయం లభిస్తుంది. ఉద్యానవన పంటలైన నువ్వులు, ఆవాలు, కుసుమ, కంది పంట చేలల్లో తేనెటీగల పెట్టెలను అమర్చుకొని అధిక లాభాలు సేకరించవచ్చు. ఒక ఎకరం పంటలో సుమారు ఐదు బాక్సులు ఏర్పాటు చేసుకోవచ్చు. ఒక్కో బాక్సు నుంచి 4 కేజీల తేనె వస్తుంది. ఒక ఎకరా పంటలో 5 బాక్సులు అమర్చినట్లయితే 20 కిలోల తేనెను సేకరించవచ్చు. ప్రస్తుతం స్వచ్ఛమైన తేనె కిలోకు 450 నుంచి 500 పలుకుతుండగా, ఈ లెక్కన 20 కిలోల తేనెకు 9వేల నుంచి 10వేల ఆదాయం పొందవచ్చు. కాగా, మార్కెట్‌లో తేనెటీగల బాక్సు ధర 7500 ఉంటుంది. ఒక్కో బాక్సులో 50 వేల నుంచి లక్ష దాకా తేనెటీగలు ఉంటాయి.

### బహుళప్రయోజనాలు

తేనె టీగల పెంపకంతో బహుళ ప్రయోజనాలున్నాయి. నిర్వహకులకు తక్కువ పెట్టుబడికే ఎక్కువ లాభాలు కండ్లచూడవచ్చు. సంవత్సరం పొడవునా వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నా వీటిని పెంచవచ్చు. ఇక స్థానికంగా తక్కువ ధరకే స్వచ్ఛమైన, నాణ్యమైన తేనె వినియోగదారులకు దొరుకుతుంది. తేనెటీగలు అంతరించిపోకుండా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చు. పండ్ల, పూల తోటల్లో, కూరగాయల సాగులో రైతులకు అధిక దిగుబడి సాధించడానికి తేనెటీగలు దోహదపడతాయి. పంట పొలాల్లో తేనె టీగలు ఉండడం వల్ల పరాగ సంపర్కం జరిగి సాధారణంగా వచ్చే దిగుబడికన్నా 40శాతం వరకు అధిక దిగుబడులు వస్తాయి. ఈ విషయాన్ని గ్రహించిన పలువురు రైతులు ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు, బాపట్ల నుంచి తేనెటీగలతో ఉన్న ఒక్కో బాక్సును నెలకు రూ.2వేల చొప్పున అద్దెకు తెచ్చుకొని పంట పొలాల వద్ద పెట్టుకుంటున్నారు. ఇటీవల హుజూరాబాద్‌కు చెందిన పలువురు రైతులు బాక్సులను అద్దెకు తీసుకొని వచ్చి పెట్టుకున్నారు.

### అవగాహన లేక నష్టపోతున్న రైతులు

మన ప్రాంతంలోని రైతులకు తేనెటీగల పెంపకంపై అవగాహన లేకపోవడంతో ఎంతో నష్టపోతున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వ్యాపారులు ఇక్కడికి వచ్చి మన రైతులు సాగు చేస్తున్న ఆవాలు, నువ్వులు లాంటి పంట పొలాల్లో తేనెటీగల పెట్టెలను పెట్టుకొని సొమ్ము చేసుకుంటున్నారు. పెట్టెలను అమర్చడం వల్ల పంటల దిగుబడి పెరుగుతుందని చెబుతుండడంతో రైతులూ ఒకే చెప్పేస్తున్నారు. కానీ దాని వల్ల వచ్చే లాభాలను మాత్రం గుర్తించలేకపోతున్నారు. దీనిని గుర్తించిన పొలాస పరిశోధనా స్థానం తేనెటీగల పెంపకం వైపు రైతులను ప్రోత్సహిస్తున్నది.

### పొలాస ఆధ్వర్యంలో శిక్షణ

మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులను వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రాణించేలా పొలాస వ్యవసాయ విశ్వవిద్యాలయం కృషిచేస్తున్నది. అందులో ప్రధానంగా మార్కెట్‌లో అధిక డిమాండ్ పలుకుతూ, తక్కువ పెట్టుబడితో.. ఎక్కువ ఆదాయాన్నిచ్చే తేనెటీగల పెంపకాన్ని ప్రోత్సహిస్తున్నది. ఈ క్రమంలో తేనె టీగల పెంపకంపై పరిశోధనా స్థానంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నది.

పెంపకం, వాటి పరిశ్రమ ఏర్పాటుకు కావల్సిన సలహాలు, సూచనలు ఒక్కో రైతుకు వారంపాటు శిక్షణ ఇస్తున్నది. వారం రోజులపాటు ట్రైనింగ్ ఇవ్వడంతోపాటు తేనె సేకరించేందుకు కావాల్సిన తేనెటీగల పెట్టెలను అందిస్తున్నది. అంతేకాదు పరిశోధనా స్థానంలోనే ప్రయోగాత్మకంగా బాక్సుల్లో బీ కీపింగ్ చేస్తూ వాటిని రైతులకు చూపిస్తూ తేనె ఎలా తయారుచేయవచ్చో అర్థమయ్యేలా వివరిస్తున్నది.

### నెలకు రూ.18 వేలు సంపాదిస్తున్నా..

నాకు ఏడెకరాల భూమి ఉంది. అందులో రెండెకరాలల్ల మామిడి తోట పోను ఐదెకరాల్లో నువ్వు, ఆవాలు, కంది సాగుచేస్తున్న. నేను గతేడాది హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో తేనెటీగల పెంపకంపై ఎనిమిది రోజుల శిక్షణ తీసుకున్నా. ఒక్కో బాక్సులో 50 వేల నుంచి లక్ష తేనెటీగలు ఉండే బాక్కులను 40 కొనుగోలు చేసిన. ఒక్కో బాక్సు ధర రూ.7500 పడ్డది. నా వ్యవసాయ క్షేత్రంలో బాక్సులను పెట్టిన. నెలకు 30-40 కిలోల తేనె తయారైతున్నది.

కిలోకు రూ.450 చొప్పున అమ్ముతున్నా. నెలకు రూ.18 వేలపైనే ఆదాయం వస్తోంది. ఇంకా ఈ తేనెటీగల పెంపకం చేపట్టినప్పటి నుంచి నా పంటల దిగుబడి బాగా వస్తోంది. నేను తయారు చేసే తేనెకు మార్కెట్లో డిమాండ్ బాగుంది. హైదరాబాద్ లాంటి మహానగరాల నుంచి వచ్చి కొనుక్కెళ్తారు. వీలుగాని వారికి కొరియర్ ద్వారా పంపిస్తున్నా. నా కస్టమర్ల నంబర్లతో వాట్సప్ గ్రూప్ కూడా తయారు చేసిన.

### అదనపు ఆదాయం

తేనె వినియోగం బాగా పెరిగింది. డిమాండ్‌కు సరిపడా ఉత్పత్తి జరగడం లేదు. అందుకే ఈ తేనె టీగల పెంపకాన్ని చేపట్టిన రైతులకు అధిక లాభాలుంటాయి. ప్రభుత్వం కూడా తేనె ఉత్పత్తిని ప్రోత్సహిస్తున్నది. ఆవాలు, నువ్వులు, మినుములు వంటి పంటలు వేసే రైతులు తమ తోటల్లో బాక్సులను ఏర్పాటు చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చు. తేనె దిగుబడితోపాటు ఇంకా పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంటుంది.

# మొక్కలతో కాసుల పంట

**ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక పెరిగిన విక్రయాలు**

**ఇతర రాష్ట్రాలకు ఎగుమతి**

**ఉపాధి కల్పిస్తున్న ప్రైవేటు నర్సరీలు**



మండలంలో ప్రైవేట్ నర్సరీలు యజమానులకు కాసుల పంట పండిస్తోంది. జిల్లాలో ఎక్కడాలేనంతగా పదేళ్లలో వందలాది ఎకరాల్లో పండ్ల మొక్కలు పెంచి, విక్రయించే ప్రైవేటు నర్సరీలు ఏర్పాటయ్యాయి. వీటిలో అత్యధికంగా మామిడి (80శాతం), జామ, కొబ్బరి, నిమ్మ, ఉసిరి, నేరెడు తదితర మొక్కలు నర్సరీల్లో పెంచుతున్నారు. మామిడిలో దాదాపు 23 రకాల మొక్కలను పెంచుతున్నారు. విత్తనాల కోసం వివిధ రకాల మామిడి టెంకలు (పిక్కెలు) మెదక్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తారు. మొక్కలు ఏర్పడ్డాక మరో రకం మొక్కతో (గ్రాఫ్టింగ్)అంటుకడుతారు. కూలీలతో అంటు కట్టిస్తారు. ఈప్రక్రియ అనంతరం 5 కిలోలు (ఆరు నెలల వయసు), 10 కిలోలు (ఏడాది), 50 కిలోలు (రెండేండ్లు)గా విభజిస్తారు. ఎక్కువ వయస్సు గల మొక్కలకు అధిక రేట్లు ఉంటాయి. మొక్కలను ఏపీలోని చిత్తూరు, కర్నూలు, రాజమండ్రి, మందపల్లితో పాటు ఛత్తీస్‌గఢ్, కేరళ, మహారాష్ట్ర, ఒడిశా తదితర రాష్ట్రాలకు మొక్కలను ఎగుమతి చేస్తారు.

### 700 ఎకరాల్లో ప్రైవేట్ నర్సరీలు

మండలంలోని లోక్యాతండ, గురువాయిగూడెం, గట్టుసింగారం, పాలేరు తదితర గ్రామాల శివారులో వ్యవసాయ భూములు లీజుకు తీసుకుని నర్సరీలను ఏర్పాటు చేశారు. 1996 నుంచే ఈప్రాంతంలో ప్రైవేట్ నర్సరీలు ప్రారంభం అయినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం ఏర్పడ్డాక నిర్వహిస్తున్న హరితహారంతో ప్రజల్లో మొక్కల పెంపకం పట్ల ఆసక్తి పెరిగింది. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో సుమారు 700 ఎకరాల్లో నర్సరీలు ఏర్పాటైనట్లు అంచనా. ఎకరానికి ఏడాదికి రూ.60 వేల వరకు చెల్లించి, కనీసం మూడేళ్లపాటు లీజుకు ఒప్పందం చేసుకుంటారు. నీటి సరఫరా భూమి యజమానే సమకూర్చాల్సి ఉంటుంది.

### వెయ్యి మందికి ఉపాధి

నర్సరీల్లో సుమారు వెయ్యి మంది ఉపాధి పొందుతున్నారు. ప్రధానం మామిడి మొక్కలకు అంటు కట్టడానికి ఎక్కువ మందికి పని దొరుకుతుంది. దీంతో పాటు ఇతర పనులకు కూడా కూలీలు అవసరమవుతారు. ఏడాదిలో 9 నెలల వరకు దినసరి కూలీలకు ఆయా నర్సరీలు పని కల్పిస్తున్నాయి.

### మొక్కల ఉత్పత్తి ఖర్చు పెరుగుతుంది

15 ఏళ్లుగా నర్సరీలు ఏర్పాటు చేసి, మొక్కలు పెంచుతున్నాం. నర్సరీల ఏర్పాటు, మొక్కల ఉత్పత్తికి ప్రతి ఏటా ఖర్చు పెరుగుతుంది. మండలంలో ఆయా నర్సరీల్లో ఏటా 80 లక్షల వరకు మొక్కల కోసం ఏర్పాట్లు చేస్తే, 60 నుంచి 70 శాతం వరకు మాత్రమే మొక్కలు బతుకుతాయి. ఒక్కో మొక్క ఉత్పత్తికి రూ.30 నుంచి 60 వరకు ఖర్చు అవుతుంది. పండ్ల మొక్కలు పెంపకాలతో ప్రజలకు పర్యావరణం, హరితహారం స్ఫూర్తి కలిగిస్తున్న తమను ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహించాలి.

## డ్రాగన్‌ఫ్రూట్‌తో ఎకరానికి లక్ష ఆదాయం..

# 5 లక్షల పెట్టుబడితో 20 ఏండ్ల దాకా దిగుబడి

సంప్రదాయ సాగుతో విసిగిపోయిన రైతులు.. తక్కువ శ్రమతో దీర్ఘకాలం పాటు ఎక్కువ లాభాలు తెచ్చి పెట్టే పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న డ్రాగన్ ఫ్రూట్ సాగును ఎంచుకొని మంచి ఆదాయం పొందుతున్నారు. ఎకరానికి లక్ష వరకూ మిగులుతుండడంతో ఒకరి తర్వాత ఒకరు పంట సాగు చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మానుకోట జిల్లాలో తొలుత ప్రయోగాత్మకంగా మొదలైన డ్రాగన్ ఫ్రూట్ సాగు ఇప్పుడు క్రమంగా 15 ఎకరాలకు చేరడం విశేషం. ఎకరానికి రూ.5లక్షల పెట్టుబడితో 20 ఏళ్ల పాటు దిగుబడినిచ్చే పంట కోసం ప్రభుత్వం సబ్సిడీ కూడా ఇస్తుండడంతో పాటు అంతర పంటగా కర్బూజ, పుచ్చకాయ, కూరగాయలు వేసి అదనపు ఆదాయమూ పొందే వీలుండడంతో రైతులు హుషారుగా పంట వేస్తున్నారు.



డ్రాగన్ ఫ్రూట్‌తో రైతులు అధిక ఆదాయం పొందుతున్నారు. ఎకరాకు లక్ష రూపాయల ఆదాయం వస్తుండడంతో మహబూబాబాద్ జిల్లాలో సాగు చేసేందుకు ఎక్కువ మంది రైతులు ఆసక్తి చూపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్‌ను ఎత్తుగా ఉండే నేలల్లో పంట వేయాలి. ఒక మొక్క రూ.60లకు లభిస్తుంది. జడ్జర్ల, రంగారెడ్డి జిల్లాలో ఉండే నర్సరీలలో మొక్కలు దొరుకుతాయి. ముందుగా భూమిని చదును చేసుకున్న తర్వాత సిమెంట్ స్తంభాలు నాటాలి. ఒక స్తంభానికి, మరో వరుస స్తంభానికి మధ్య ఎనిమిది ఫీట్ల దూరం ఉండాలి. ఎత్తు ఏడు ఫీట్ల వరకు ఉండాలి. ప్రతి స్తంభం పైభాగంలో సిమెంట్ బిల్లలు అమర్చాలి.

డ్రాగన్ ఫ్రూట్ మొక్కలను నాటిన రెండు సంవత్సరాలకు పంట చేతికి వస్తుంది. ఒకసారి పంట ప్రారంభమైన తర్వాత 20 సంవత్సరాల వరకు దిగుబడి వస్తూనే ఉంటుంది. ఎకరానికి సుమారు రూ.5లక్షల పెట్టుబడి అవుతుంది. ఎకరాకు 30 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. కిలో డ్రాగన్ ఫ్రూట్స్‌కు రూ.250లు చొప్పున విక్రయిస్తున్నారు. ఒక క్వింటాల్‌కు రూ.25వేలు వస్తుంది. మొత్తం 30 క్వింటాళ్లకు రూ.7.50 లక్షల ఆదాయం వస్తుంది. అన్ని ఖర్చులు పోను ఎకరానికి ఏటా లక్ష వరకు ఆదాయం వస్తుంది. ఇందులో అంతర పంటగా పుచ్చ, కర్బూజతో పాటు కూరగాయలు సాగు కూడా చేసుకోవచ్చు. తద్వారా రైతుకు అదనపు ఆదాయం వస్తుంది.

డ్రాగన్ ఫ్రూట్స్‌తో లాభాలు వస్తుండడంతో రైతులు ఈ పంట వేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. డ్రాగన్ ఫ్రూట్ మొక్కకు ముళ్లు ఉండడం వల్ల కోతుల బెడద కూడా ఉండదు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు 15 ఎకరాల్లో ఐదుగురు రైతులు సాగు చేస్తున్నారు. ఇందులో ఇప్పటికే మరిపెడలో ఒక రైతు, గూడూరు మండలంలో మరో రైతు ప్రయోగాత్మకంగా డ్రాగన్ ఫ్రూట్ పంట వేశారు. ఒక ఎకరాకు రూ.లక్ష ఆదాయం వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

### దిగుబడి పది క్వింటాళ్లు వచ్చింది

నేను రెండు సంవత్సరాల క్రితం ఎకరమున్నర భూమిలో డ్రాగన్ ఫ్రూట్ పంట వేశాను. నాకు పది క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. కిలోకు రూ.200 చొప్పున పది క్వింటాళ్లకు రూ.2లక్షలు వచ్చాయి. ఇందులో పెట్టుబడి రూ.50వేలు పోను మిగతా రూ.1.50 లక్షల ఆదాయం వచ్చింది. నాకు ఉద్యానశాఖ నుంచి మొత్తం రూ.90వేల సబ్సిడీ వచ్చింది. డ్రాగన్ ఫ్రూట్స్ పంట చేతికి రాగానే ఖమ్మం, వరంగల్ మార్కెట్‌కు తీసుకెళ్లి అమ్మేస్తాను. ఈ ఏడాది కూడా ఇంకా అదనంగా ఆదాయం వచ్చే అవకాశం ఉంది. మే నుంచి జూన్‌లో పంట మళ్లీ కోతకు వస్తుంది.

### ఎకరాకు లక్ష మిగులుతయ్..

నాకు మూడెకరాల భూమి ఉంది. ఇందులో ఒక ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ వేశాను. ఇప్పటికే రెండు మార్లు పంటను అమ్మాను. ఒక ఎకరాకు 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వస్తుంది. పెట్టుబడి, కూలీల ఖర్చు అన్నీపోను లక్ష మిగులుతాయ్.

అంతర పంటగా పుచ్చకాయ తోట పెట్టాను. ఈ పంటతో మరో రూ.50వేల వరకు వచ్చే అవకాశం ఉంది. ప్రయోగాత్మకంగా ఒక ఎకరంలో పంట వేశాను. మరో ఎకరంలో త్వరలోనే డ్రాగన్ ఫ్రూట్ పంట వేస్తా. కిలో ఫ్రూట్స్ రూ.250లకు చొప్పున అమ్మాను. ఆశించిన స్థాయిలో ఆదాయం వచ్చింది. ముమ్ముందు మరింత ఆదాయం వస్తుందని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు.